ఏప్రిల్ 1974

55

సృజన

ఆధునిక సాహిత్య వేదిక

నిర్వహణ :
'సాహితీ మిత్రులు'

64 పేజీలు 1 రు.

ప్రస్తుతం సృజనవద్ద దొరికే పుస్తకాలు:

1.	ఎరుపు — విరసం కర్నూలు మహాసభల సంచిక		2-00
2.	మావో మిలిటరీ రచనలు — I భాగం		4-00
3.	మావో మిలిటరీ రచనలు — II భాగం		3-00
4.	విమర్శలు—ఆత్మవిమర్శ	కె. వి. రమణారెడ్డి	0-40
5.	తూరుపు—ఉద్యమ వేగాన్నందుకున్న కొత్త కథలు		1-00
6.	కోట్లాది వీరయోధులు	ఎన్ చాంగ్-లిన్	2-00
7.	వైరుధ్యాలు	అను: కొడవటిగంటి కుటుంబరావు	0-50
8.	ఎర్రమందారాలు	"నిజం"పాటలు	1-00
9.	విప్లవ రచయితల సంఘం 3వ మహాసభల ప్రత్యేక సంచిక		2-00
10.	అ.ర. సంఘానికి కాయకల్ప చికిత్స?	కె.వి.ఆర్.	1-25
11.	ఎన్నెస్ కథలు—		3-00
12.	చారు మజుందార్ రచనలు—		3-50
13	చైనా కమ్యూనిస్టుపార్టీ 30 సంవత్సరాల చరిత్ర (1921-1951)		1-75
14.	అమర వీరుల చరిత్రలు	పిలుపు ప్రచురణ	3-00
15	రేపటి కవిత్వం—సిద్ధాంత గందరగోళం	విమర్శ	0-75
16.	కాళీపట్నం రామారావు కథలు		2-50
17.	బద్‌లా	కరీంనగర్ రచయితల కథలు	2-00
18.	రెక్కవిప్పిన రెవల్యూషన్	శ్రీ శ్రీ	2-00
19.	భారత-సోవియట్ ఒప్పందం		0-30
20.	ఆగ్నేయాసియా అంతటా విప్లవ పోరాట జ్వాలలు రగుల్కొంటున్నాయి		0-30
21.	రాష్ట్ర విభజనోద్యమం—మార్క్సిస్టు-లెనినిస్టు దృక్పథం		0-25
22.	ఉప్పెన — మొదటిభాగం	నవల చౌలి-పో	2-50
23.	నా కుటుంబం	నవల టావ్-చెంగ్	2-00
24.	గమ్యం	చెరబండరాజు	2-00
25.	క్రాంతియుద్ధం	..	1-00
26.	భారత రైతాంగ సాయుధ పోరాటం—జనచైనా వ్యాసాలు		1-00
27.	ఊరేగింపు— కవితా సంకలనం	వరవరరావు	1-25
28.	జనం ఊపిరితో— ఖైదీగీతం	సృజన ప్రచురణ	0-50
29.	లాంగ్‌మార్చ్‌లో చైర్మన్ మావోతో	చెన్ చాంగ్-ఫెంగ్	1-50
30.	News and Views on China.		0-80

సృజన పాత సంచికలు కావల్సినవారు ముందుగా డబ్బు పంపి వాటిని పొందగలరు.
అక్టోబర్ '72 నుండి (మార్చ్/ఏప్రిల్ '73 తప్ప) అన్ని పాతసంచికలు దొరుకుతాయి.

Edited, Printed & Published by P. Hemalatha for 'Sahithee Mithrulu'
Printed at Venkataramana Mudranalayam,
J. P. N. Road, Warangal - 506002 (A. P.)

చికిత్సచెప్పిన డాక్టర్ నేరస్తుడు !

మళ్ళీ డాక్టర్ ఎం.వి. రమణారెడ్డిని అక్రమంగా అరెస్టు చేసారు. 'వ్యక్తిగత కక్షలమూలంగా స్థానిక (ప్రొద్దుటూరు) నూనె మిల్లు యజమానిని ఎవరో కొట్టిన సందర్భంలో' విరసం సభ్యుడు, ప్రభంజనం పత్రికా సంపాదకుడు అయిన ఎం వి ఆర్‌ను 31-3-74 తేదీన వారు ఆస్పత్రిలోవుండగా పోలీసులు అరెస్టుచేసారు ఇది మూడోసారి ఎం వి ఆర్‌ను అరెస్టు చేయడం.

ఎం వి ఆర్ చేసిన నేరాలేమిటి ? వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసాలను పట్టుకొని కాల్చేసి, పోలీసులు ఎన్‌కౌంటర్‌లో చనిపోయారని ప్రకటించినపుడు, నిజానిజాలు విచారించి, పోలీసుమంత్రిని బోనులోనిలబెట్టి నేరవిచారణ చేయాలని ప్రభంజనంలా సవాల్‌చేసిన సంపాదకుడు ఆయన. దేశంలో అన్ని సమస్యలపైన శాస్త్రీయ దృక్పథంతోరాసిన సంపాదకుడాయన. పోలీసులు చేసిన ఎన్నో అక్రమాలను ఎండగడుతూ ఆయన రాసినందుకు మోకాలుకూ, బట్టతలకూ ముడిపెట్టినట్లు నెల్లూరు బాంబు కేసులో యిరికించి మొదటిసారి 71 జులైలో అరెస్టుచేసారు ఆయనను. కడపజిల్లాలోని పోలీసు స్టేషన్లన్నీతిప్పి, నానాచిత్రహింసలుపెట్టి. బెయిల్‌మీద వదలడానికి, ఇంటర్వ్యూలకు కూడ చాల ఇబ్బందులు పెట్టారు. తీరాచేస్తే బాంబు కేసుతో డాక్టరుకు సంబంధం లేదని కేసు కొట్టివేసింది కోర్టు.

మళ్ళీ బంగ్లాదేశ్ యుద్ధమపుడు డాక్టరుగారిని ఆంతరంగిక భద్రతాచట్టంకింద అరెస్టుచేసారు. బంగ్లాదేశ్ యుద్ధం విషయంలో భారత ప్రభుత్వ విస్తరణ వాదాన్ని. ముజిబ్ సోషల్ సామ్రాజ్యవాద ఏజెంట్‌తత్వాన్ని మొగ్గలోనే పసికట్టిన చాల కొద్ది మంది వి.ర.సం. సభ్యుల్లో డాక్టర్‌గారు మొదటివారు. అపుడు అసెంబ్లీలో ఆయన అరెస్టును గురించి అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ ఆయన ప్రభంజనం సంపాదకీయాలు ప్రమాదకరంగా వుంటున్నాయని మంత్రిగారు సమాధానం చెప్పారు.

మళ్ళీ యీనాడు ప్రముఖ కార్మిక నాయకునిగా. విరసం నాయకునిగా, నిర్భయం శాస్త్రీయ దృక్పథంగల సంపాదకుడుగా డాక్టర్‌గారు పాలకవర్గాల పోలీసు స్వభావానికి పక్కలో బల్లెంలా వున్నాడుగనుకనే. అయినదానికీ కానిదానికీ. ఆయనకు ప్రమేయం వున్నదానికీ. లేనిదానికీ ఆయనను అరెస్టుచేస్తున్నారు. పత్రికా స్వాతంత్ర్యాన్ని భావ ప్రకటనను చిత్తశుద్ధితో అభిలషించే ప్రజాస్వామ్యవాదులంతా ఏకకంఠంగా యీప్రభుత్వ ఫాసిస్ట్ నిర్బంధవిధానాన్ని ఖండించాలి. నిర్భయంగా సత్యాన్ని చెప్పడం, చేయడం. శాస్త్రీయంగా ఆలోచించడం నేరమైపోయిన వ్యవస్థలో, మనిషయినవాడు ఎదురు తిరగకుండా గాలి పీల్చడంకూడ కష్టమైపోతుంది.

"ఖదం ఖదంపర్ లడ్‌నా సీఖో
జీనాహైతో మర్‌నా సీఖో"*

ఎస్.కె.

అతను మూసిన పిడికిలి
శ్రామికజన నియంతృత్వ స్థాపనకు ముఖద్వారం
అతని కదలిక కదలికలో
పొర్లుతున్న అలల కడలి- కదులుతున్న శ్వాస-

పీడిత ప్రజాహృదయాలు హోరెత్తిన రక్తగానాలు
అతని కోసం
కసి కోసిన చేతులమీదుగా పల్కుతున్న ఆహ్వానాలు

పోరాటం బాటలమీదికి ఆహ్వానం రాస్తున్నవాడు
మా కామ్రేడ్ ।
నీరు నింగి నేల గాలి తన వూపిరి పోస్తున్నవాడు
మా కామ్రేడ్ ।

హమారా కామ్రేడ్ అమర్ హై

నాల్గుచెరగులా అంటుకున్న నిప్పు
నాల్గు దిక్కులా వీస్తున్న తూర్పుగాలి

హమారా కామ్రేడ్ జార్జ్ హై
కామ్రేడ్ జార్జ్ అమర్ హై...

---

* అడుగడుగునా పోరాడడం నేర్చుకో
బతుకుకోసం చావడం నేర్చుకో.

జార్జ్ రెడ్డీ, మేమూ నీ మార్గమే
జ్ఞానేశ్వర్ కీర్తి

జార్జ్
నీవు అందించిన కొరడా కొసనుంచి
ఇదివరకూ చేరుకున్నాం
నీవు కలలుగన్న
సమసమాజ స్థాపనకై
నెత్తురు ముగ్గులు పోస్తున్నాం
ఈ దోపిడీ గోడలను కూలదోసి
విద్యాలయాల లక్కఇళ్ళలోంచి
తప్పించుకొని
కార్మిక కర్షక రాజ్యం స్థాపించేవరకు
రాజీలేని పోరాటం చేస్తాం
జార్జ్
మేమూ నీ మార్గమే.

సాగిపోరో అన్న
రుక్మిణి

సాగిపోరో అన్న సాగిపోరో
ఈ దారినే నువ్వు సాగిపోరో

ఈ దారి నీకు రహదారి కాదు
ఈ దారి నీకు ముళ్లదారోరన్న
ముళ్లదారే నీకు ముక్తిదారోరన్న — సాగిపోరో

కంచెలను పీకేస్తు నడవరో ఈ దారి
గొడ్డల్ని చేబట్టి నరకరో ముళ్లనూ
నరుకుతూ నవ్వుతూ నడవరో ఈ దారి — సాగిపోరో

'అడవుల్లోంచి....కాలేజీల్లోకి'

వసుధ

సైన్‌బోర్డు రాసిపెట్టు
చచ్చిన గాంధీకీ బతికున్న
వినోబాభావేకు
ఒకే మంత్రం—

కాల్పుల్లో, కూల్పుల్లో
ప్రాణాల్నేకాదు
ఎముకల్ని సున్నంచేసుకున్న
అన్న తమ్ముళ్ళకు
తామ్ర పత్రాలతో
సన్మానాలతో తలదాకా
కైపెక్కించు; దేశభక్తి.

కానీ,
నీ ముందూ, నా ముందూ
జనం ముందూ
నువ్వు చేస్తున్న కిరాతకత్వానికి
అరణ్యాల్లోంచి
నువ్వన్నట్లు
విశ్వవిద్యాలయాల్లోకి
లంఘించిన
చిరుతపులుల్ని తట్టిలేపి
వర్గశత్రు తలల్ని
నోట కరచుకునే
రేపటి చరిత్రని
సృష్టిస్తున్న సిద్ధాంతంవుందే
దాన్నేం చేస్తావ్ !!

అది నీ యమ్మనూ
నీ అబ్బనూ
చూసి జడిసేదికాదు
తుపాకుల్నీ, పోలీసుల్నీ
లెక్కచేసేది అంతకంటేకాదు
అది పుట్టింది పోరాటంలోంచి
పెరుగుతోంది పోరాటం గర్భంలో

అవును, నువ్వు
విద్యాలయాల్ని
అరణ్యాలు చేస్తే
మేం అరణ్యాల్ని
విద్యాలయాలు చేస్తున్నం.

[అంకితం :
పోరాటం ప్రాణంగా జీవిస్తున్న
విద్యార్థినీ, విద్యార్థులకు
కృతజ్ఞతలతో—]

ఎర్రని పూవు

బ్రహ్మానందం

చెల్లెలా
నా ముద్దుచెల్లెలా
వినవమ్మ
ఈఊరుగాథ వినవమ్మ
పేరేమో బొడ్డపాడు
తెలుగు దేశానికి పోతుగడ్డ
భరతభూమికి భావిరేఖ

నేటి విప్లవాలను
రేపటి విజయాలను
కురిపించు
వసంత మేఘగర్జన

వినవమ్మ
నా ముద్దు చెల్లెలా
వినవమ్మ
వీరులెందరో పుట్టేరు
వీరవనితలెందరో
విప్లవాలతో వియ్యంబులందేరు
వీరభూమిది
ధీరభూమిది
భూమంటే భూమికాదిది
ఎర్రభూమే చెల్లెలా

ఎటుచూచినా యెరుపేనే
చెల్లెలా
నా ముద్దు చెల్లెలా
ఊరు యెరుపేనూ
యేరు యెరుపేనూ
యేరులోనా నావనడిపే
నావికుని చుక్కాని యెరుపేనూ
పైరు యెరుపేనూ
పైరుకోసే కొడవళ్ళు యెరుపేనూ
అడవి యెరుపేనూ
అడవికొట్టే గొడ్డళ్ళు యెరుపేనూ
అడవిలోనీ
అన్నయ్యలా
అక్కయ్యలా
చేతుల్లో
విల్లంబులూ
బంధూకులు
యెరుపేనూ
యెరుపేనూ, యెరుపేనూ
అంతాను యెరుపేనూ.

వినవమ్మ
నా ముద్దు చెల్లెలా
అసలీ
బొడ్డపాడు పేరు
విప్లవాలకి నేడు
మహా దొడ్డపేరు
చెల్లెలా ! నా ముద్దు చెల్లెలా
ఈవూరే మనచెల్లి చెంద్రమ్మది
ఈవూరే మన కైలాసమన్నది
ఈవూరే
మన మాస్టారు సత్యానికి
మన్నెపుబాస నేర్పింది
ఈవూరే
కన్నాది
మన కృష్ణన్నను
నిర్మలమ్మను
ఈవూరే! చెల్లెలా!
మన విప్లవ కవులకు
గాయకులకు
వేదికలుగా మారింది

ఈపూరేనమ్మా.
చెల్లెలా! నా ముద్దు చెల్లెలా!
రక్తపు దారులూ
వేసింది దేశానికి
ఈపూరేనమ్మ
రక్తపు చుక్కలు
వెలిగించింది ఆకాశంలో
ఈపూరే చెల్లెలా
రక్తానికి విలువలు
కట్టింది

ఈపూరేనమ్మ
మనిషి త్యాగానికి
పన్నెలు పెట్టింది
ఈపూరేనమ్మా
హిమాలయానికి
బాటలు వేసింది
ఊరంటే
ఊరుకాదిది చెల్లెలా
శ్రీకాకుళ సిగలోని
ఎర్రని పూవే చెల్లెలా

రండిరా! పదండిరా!

ఎం. వరప్రసాదరావు

రండిరా! పదండిరా!
భుజం కలిపి- కదం త్రొక్కి-
జన విముక్తి గీతి పాడి
జనసేనకు బాసటగా
రండిరా! పదండిరా!

బానిసలం కాం మనం
ఉత్పత్తికి సారధులం
శ్రమశక్తిని దోచేనే
స్వార్థపరుల మట్టుబెట్ట
రండిరా! పదండిరా!

కత్తీ కొడవలి బట్టి
ఈటె-బల్లెం ఎత్తి
జన విముక్తి గీతి పాడి
జనసేనకు బాసటగా
రండిరా! పదండిరా!

చారుదారి, బాబూలాల్
భాస్కరుల బాటనడువ
భూస్వామ్యం తలలు త్రుంచి
పోలీసుల మీదబడి
తెల్లభయానికి ప్రతిగా
ఎర్రని భీభత్సులుగా
తుపాకీలు గుంజుకొని
నేలలోన విత్తులుగా
ప్రజల్లోన ప్రజలుగా
కలసి మెలసి, కలసి పోరి
శ్రామిక సమతారాజ్యం
సృష్టిద్దాం-స్థాపిద్దాం
రండిరా... పదండిరా...

భుజం కలిపి, కదం త్రొక్కి-
జన విముక్తి గీతి పాడి
జనసేనకు బాసటగా
రండిరా... పదండిరా...

లెల్లైపాట

ఎన్నార్ 'భోలా'

చిన్నకత్తి పెద్దకత్తి నాదేనయ్యా
శిందేసే వీరబాహు నేనేనయ్యా
తాలే లెల్లియ్యరా శివతాలే లెల్లియ్యరా ॥చిన్న॥

యెదురైన దొరకు మొక్కకపోతె
పెడరెక్కలు విరిచేసి కట్టిరి
జూలుపట్టుకొని గుంజికొట్టిరి
జుట్టుముడికి వేళ్లాడదీసిరి
తాలే లెల్లియ్యరా శివతాలే లెల్లియ్యరా ॥చిన్న॥

కూలికెల్లిన పిల్లతల్లుల
చంకబిడ్డల గుంజివేసిరి
రొమ్ములపాలు చేతపితికిరి
తల్లడిల్లె తల్లిని యీడ్చిరి
తాలే లెల్లియ్యరా శివతాలే లెల్లియ్యరా ॥చిన్న॥

తాతలనాటి అప్పు తీర్చమని
ఆలిని గొరగొర యీడ్చుకొచ్చిరి
గుడ్డలు బరబర గుంజివేసిరి
చెప్పరాని దారుణము చేసిరి
తాలే లెల్లియ్యరా శివతాలే లెల్లియ్యరా ॥చిన్న॥

నిరంకుశమ్మని పోరుసలిపితె
ప్రజాస్వామ్యమని పేరుమార్చిరి
పాటుకు తగిన ఫలితమడిగితె
తుపాకి కాల్పులు జరిపించేసిరి
తాలే లెల్లియ్యరా శివతాలే లెల్లియ్యరా ॥చిన్న॥

ఎన్నికలెన్ని వచ్చినగాని
మంత్రులపేరులె మారునుగాని
మారలేదు మా మురికి బతుకులు
తీరలేదు మా కెంగిలిమెతుకులె
తాలే లెల్లియ్యరా శివతాలే లెల్లియ్యరా ॥చిన్న॥

సమస్యలేమో తీరుటలేదు
అడిగినదానికి ఎదురు తుపాకి
నేర్చినదానిని వప్పజెప్పుదాం
తుపాకితోనే బదులుజెప్పదాం
తాలే లెల్లియ్యరొ శివతాలే లెల్లియ్యరొ ॥చిన్న॥

మేలుకో రైతన్న - మేలుకో కూలన్న

చేరెడ్డి మస్తాన్‌రెడ్డి

మేలుకో రైతన్న! మేలుకో కూలన్న!
'కొక్కొరోకో' అనీ తొలికోడి కూసింది
సంజవెలుగులు దెసల స్నానమాడించాయి
మేలుకో రైతన్న మేలుకో కూలన్న!

అపర ఫణిధరుడెపుడొ అవతరిస్తాడనీ
పాము పట్టాకెళ్ళి పారవేస్తాడనీ
నీకేమి పాపమూ సోకకుంటుందనీ
ముసిలోళ్ళ మాటలిని మోసపోకన్నా ॥మేలుకో॥

సెట్టు పుట్టా బలిసి సేను బీడౌతాది
రెక్క ఆడకపోతె డొక్క ఆడదె నీకు
పంచదారాకలిపి పాలు పోస్తుంటావ
నాగమయ్యా అంటు మొక్కుతూ ఉంటావ ॥మేలుకో॥

పలుగు పారాబట్టి పదిమందితోబోయి
పుట్ట త్రవ్వి పాము కుదురెల్ల కూల్చరా
పాపజాతినిచూసి భయపడడ మెందుకూ
పదుగురను కాటేసి పారిపోతుందా? ॥మేలుకో॥

కథలు :

చీకటిపులి

జయంతి

వేసవి ఎండ మండిపోతోంది. ఎర్రధూళి పొగలా లేచి వూర్ని కప్పేస్తోంది. ఆ గుడిసెళ్లు కాల్చేసినట్లు గుబులుగుబులుగా వున్నాయ్. ఆ గుడిసెల్లోనివాళ్లు చెమటతో తడిసి ముద్దయిపోతున్నారు. అంచాత వాళ్లు ఇళ్లు వదిలి రామకోవెలముందు వేపచెట్ల కింద చేరిపోయారు.

రావుడుతాత వేపచెట్టుకిందనున్న రాతిపలకమీద చెట్టుమొదలకు నడుం ఆన్చి కూర్చున్నాడు. సగం కాల్చివుంచిన చుట్టను తలపాగాలోంచి మళ్లీ తీసి ముట్టించాడు.

వయసుమళ్లిన కొందరు ఆ గుడి అరుగులమీద నిద్రపోతున్నారు. కొందరు కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. ఇళ్ళ ముంజూర్లకింద కూర్చుని కొందరాడాళ్లు పేలు నొక్కుకుంటూ వూసులాడుకుంటున్నారు. కొందరు వయసులోని కుర్రాళ్లు వయసులోవున్న ఆడపిల్లల్తో ఎకసెక్కాలాడుతున్నారు. గుడివెనక కొందరు కుర్రాళ్లు గోళీలాడుతున్నారు.

ఆ గుడికి ఎదురుగా, కొంచెం పక్కగా సుబ్బారావు మేడవుంది. ఆ మేడ దూరంనుండిచూస్తే, కిరీటంవున్న మహారాజులా కనబడుతుంది. దగ్గర్నుంచి చూస్తే ఆ మేడ అందరికీ ఒకలా కనబడదు. కొందరికి చీకటి గుహలా, క్రూరంగా, భయంకరంగా, అసహ్యంగా కనబడుతుంది. కొందరికి దేవేంద్రభవనంలా కనబడుతుంది.

ఆ మేడచుట్టూ దోపిడీకి—శ్రమకూ మధ్య గీతలా ప్రహరీ గోడ వుంది. ఆ గోడచుట్టూ మామిడిచెట్లువున్నాయి. ఆ చెట్లకింద చిక్కని నీడలున్నాయి. ఆ నీడల్లో సుబ్బారావు మనవడు పదేళ్ల గిరిజారావు మూడు చక్రాల సైకిలుమీద ఖుషీగా కూర్చున్నాడు. రావుడుతాత మనవడు రామారావు వుషారుగా సైకిలు తోస్తున్నాడు. గిరిజారావు సైకిలుమీద తిరుగుతూ సంతోషంతో తలతిప్పుతున్నప్పుడు, గాలికి కదుల్తున్న (అతి)పెద్ద రబ్బరుబొమ్మలా వున్నాడు.

అప్పుడే సుబ్బారావు కార్లో ఇంటిముందు దిగాడు. ఆ కారు షెడ్లోకిపోయింది. సుబ్బారావు మేడమీదకు వెళ్లాడు.

అప్పటికొక గంటముందే అతడు ఒక సభలో వుపన్యసించాడు. అతడు బీద ప్రజలనుద్దేశించి ఆ సభలో మాటాడేడు.

"నా స్నేహితుల్లారా, బీదల్లారా! నా మిత్రుల్లారా, కడుపేదల్లారా! మీకష్టాలు చూసి నా కళ్లు నీళ్లుకారుస్తున్నాయ్. మీ బాధలుచూసి నా గుండె చెరువై పోతోంది. మీ కష్టాలు పోవాలంటే, మీరు కష్టపడి పనిచేసి దేశసంపదను పెంచాలి, దేశసంపద పెరిగితే, మీ కష్టాలు పోతాయి. అంతేకాదు, కూడు లేకపోయినా మీకు కల్లు వుండాలి. గంజి లేకపోయినా, మీకు పక్కలో ఆడదుండాలి. ఇలాంటి వ్యసనాలవల్లే మీకు దరిద్రం, ఈ వ్యసనాలవల్లే మీకు కష్టాలు. వీటివల్లే మీకు బాధలు. కష్టపడి పనిచేసి, వ్యసనాలు విడిచేస్తే మీకు దరిద్రంవుండదు. కష్టాలుండవు, బాధలుండవు" అని అతడు ఉపన్యసించే, ఆవేళప్పుడు కార్లో ఇల్లు చేరుకున్నాడు.

ఆ సుబ్బారావు పదిహేనేళ్లు వొచ్చేవరకూ రావుడితోకలిసి పక్కూరి నాయుడిగారి పశువుల్నికాసాడు. పదిహేనేళ్ళసుబ్బికి వాళ్ళపట్నం మాం(వొచ్చి ఏదో వుపదేశంచేసాడు. ఏం వుపదేశించాడో తెలీదుకాని, తర్వాత వారంరోజుల్లో బస్తీకిపోయి సారాకొట్లో పని సంపాదించాడు. ఇరవై ఏళ్ళ సుబ్బు తన వూరు తిరిగొచ్చి, ఆ వూళ్లో సొంతంగా సారాకొట్టు పెట్టాడు. ఆ సారాకొట్టుముందు టీకొట్టుకూడా పెట్టాడు. ఆ సారాకొట్లో (తను కొట్టుకొచ్చిన) సరసాలాడగల చిన్నదాన్ని పెట్టాడు.

ఆ సిన్నది అతనికంటే పెద్దది. ఆమె ఇదివరకు బస్తీసారాకొట్లో పన్జేసి నేర్పు సంపాదించింది. ఆమెపేరు 'లచ్మి'అయినా ఆమె ఊర్వశిలా మగాళ్ళను వుర్రూతలూగించగలదు. ఆమెచేత్తో సారాఇస్తే ఒకగ్లాసుడు తాగేవాడు, మూడుగ్లాసులు తాగ్గలడు.

అలా కొంతకాలం గడిచింది. తర్వాత వోసారి అవూరు గారడీవాళ్లు వచ్చారు. ఆ వూరు వచ్చిన గారడీవాళ్లు ఆ సారాకొట్లోకికూడా వచ్చారు. ఆ గడసానిఫీట్సుచేస్తూ బాణంలా వెనక్కి వొంగినప్పుడు సుబ్బి కళ్లు చెదిరిపోయాయి. మగాళ్ళలోని పశువుకి ఆమె బలంగా మేత పెట్టగలదని అతడు వెంటనే గ్రహించాడు. వెనువెంటనే వెయ్యి రూపాయిలిచ్చి ఆమెను కొనేసాడు. ఆమెను కొన్నాక బస్తీలో యిల్లు కొన్నాడు. తర్వాత పదిమంది పదునైన ఆడాళ్ళను పట్టి ఆ గడసాని నాయకత్వంకింద సుఖాలు అమ్మించడం ప్రారంభించాడు. ఆ ఇంటిని విశ్రాంతి భవనంగా మార్చాడు.

అప్పుడతడు వడ్డీవ్యాపారంకూడా ప్రారంభించాడు.

పాతికేళ్ళ సుబ్బి అప్పులపాలయిపోయిన రావుడితాత మూడెకరాల గరువూ దక్కించుకున్నాడు. ముప్పైఏళ్లసుబ్బి ముప్పయి ఎకరాల గరువుకొన్నాడు, నలభై ఏళ్ళ సుబ్బారావు ఏభై ఎకరాల పొలం కొన్నాడు. ఏభై ఏళ్ళ సుబ్బారావు సొంతవూళ్లో పెద్ద మేడ కట్టించాడు.

అతడలా ధనవంతుడవగానే ఎన్నికలపార్టీలన్నీ అతణ్ణి చుట్టుముట్టాయి. ప్రతి పార్టీ అతణ్ణి చేరతీసుకోడానికి ప్రయత్నించింది. అయితే అతడు ఏ రాజకీయపక్షం వల్ల తనకు లాభంవుంటుందో, ఆ పార్టీలో చేరిపోయాడు.

చిన్నతరగతి ప్రజానాయకుడుగా మారిపోయిన సుబ్బారావు అహింసను ప్రజలకు బోధిస్తాడు. శాంతియుత పరిష్కారాలు ఉద్బోధిస్తాడు.

అయితే రావుడితాత జీవితం వేరు.

అతడు ఇరవై ఏళ్ళవరకూ పక్కూరి నాయుడిగారి పశువుల్ని కాసాడు. ఇరవై ఏళ్ళ రావుడు తండ్రిమిగిల్చిన కొండదిగువ పర్రభూమిని సాగులోకి తేవానికి ప్రారంభించాడు. ఆ భూమి మూడెకరాలుంటుంది. కొంత భూమి బండరాళ్లతో నిండి వుంది. కొండమీంచిదొర్లిన వర్షంనీరు ఆ బండరాళ్ల మధ్య కాలువలుకట్టి పారుతోంది. అపక్కనే వున్న చిట్టడవి ఆ భూమిలో కొంతవరకూ వ్యాపించివుంది.

ఆ భూమిలోని ఎండిపోయినచెట్లు ముసలిరాక్షసుల్లాగ భయంకరంగా వున్నాయి. బాగా బలిసి పచ్చగావున్నచెట్లు కత్తులుదూస్తున్న వనరాక్షసిలాగ క్రూరంగా వున్నాయి. గజిబిజిగా చిక్కగా అల్లుకున్న ముళ్లపొదలు, జుత్తులు విప్పుకుని కాళ్లుచాచుక్కూర్చున్న దెయ్యాల్లాగ భయంకరంగావున్నాయి. ఆ చిట్టడవి, చీకటి చీకటిగా, చిక్కులు చిక్కులుగావుంది. ఆ చిట్టడవిలో క్రూరమైన పాములున్నాయి. పుల్లు లేకపోయినా పులుల్లాటి ఎలుగుగొడ్లున్నాయి. చిరుతపుల్లు లేకపోయినా రేచుకుక్కల్లాటి తోడేళ్లున్నాయి.

అయినా రావుడు ఏవీ భయపడలేదు. జడిసిపోలేదు. అతని చేతులు గొడ్డళ్లై ఆ బండరాళ్ళను పిండిచేసాయి. అతని వూపిరి అగ్నిజ్వాలలై ఆ చెట్లనూ పొదలనూ కాల్చేసింది. అతని గోళ్లు తవ్వు గోళ్లై చెట్ల వేళ్ళను పీకేసాయి. అతని కళ్ళల్లో మంటల్నిచూసి ఆ ఎలుగుగొడ్లు పారిపోయాయి. అతని గుండెల్లో నిప్పునుచూసి ఆ తోడేళ్లు బెదిరిపోయాయి. ఆ పాంవులు అతని కాళ్ళకిందపడి నల్లుల్లా నలిగిచచ్చాయి. కొండమీంచి పారే నీటి ప్రవాహం అతడు తవ్విన పక్కకాలువలో గొల్లుమని ఏడుస్తూ పారుతోంది, అతని చెమటతో ఆ భూమి తడిసిపోయి మెత్తబడి సాగులోకివచ్చింది.

అయితే ఆ యజ్ఞంలో రావుడికుటుంబం అంతా వొళ్లు మర్చి పన్జేస్తున్నప్పుడు రావుడి రెండేళ్ళకొడుకు పాముకుట్టి చొంగలుకక్కి చచ్చిపోయాడు.

అంతేకాదు ఆ భూమి సాగులోకి రావానికి చాలాసంవత్సరాలు పట్టింది. రావుడే కాకుండా రావుడి కుటుంబంలోని అందరూకూడా ఆయజ్ఞంలోనేవుండిపోయారు రావుడి కొడుకు సిమ్మాద్రి రావుడితో సమానంగా పాటుపడ్డాడు. వాళ్ళ శ్రమ మరోనాటిబతుకు

తెరువుకి పెట్టబడే అయింది. అంచేత మరో బతుకుతెరువులేక అప్పులుచేసి బతక వల్సివచ్చింది.

ఆ అప్పు ఎలా పెరుగుతుందో రావుడికి తెలీదు. ఆ భూమి సాగులోకివచ్చి పండడం ప్రారంభించిననాటికి అప్పులభారం పెరిగిపోయి పీక్కి వురితాడులా తగుల్తుంది అంచాత ఆ పండబోతున్న భూమిని అమ్మేసి, ఆ వురితాడు తప్పించుకున్నాడు అప్పు డతడు సుబ్బారావు పెదపాలికాపుగా మారిపోయాడు.

రావుడుతాత మావిఁడిచెట్లకింద సైకిలు తోస్తున్న మనవణ్ని చూస్తున్నాడు.

మనవణ్ని చూస్తున్న రావుడుతాత తన గతాన్ని తల్చుకుని విచారిస్తున్నాడు. కొడుకు జీవితాన్ని తల్చుకుని కుమిలిపోతున్నాడు. మనవడి భవిష్యత్తు తల్చుకుని బాధ పడుతున్నాడు.

వేడిగాలి రివ్వున వీస్తోంది. ఎఱ్ఱధూళి గుప్పున లేస్తోంది. ఆకాశం ఎఱ్ఱగా మండిపోతోంది. భూమి నిప్పులా కాలిపోతోంది.

'నువ్వే సేసినావిదంతా, నువ్వే సేసినావిదంతా'అంటూ గాలిలా రివ్వున వచ్చి, వేడిగా మాటాడుతోంది రావుడిభార్య. ఆమె ఒకచేత్తో సత్తుగిన్నెతో గెంజిపట్టుకొచ్చి రావుడిముందుంచింది, రెండోచేయి విసురుతూ విసురుగా మాటాడుతోంది.

'ఈ సేత్తో నాకొడుక్కి గెంజోసి పదిపంట్లయిపోనాది. ఆ పొద్దూ నేడు— ఈ పొద్దూ నేదు ఆడు మల్లీ సూపవనేదు, ఆ గుంటడికి అల్లయ్యోడో తెల్దు, అణ్ని సూస్తా వుంటే నాకు కడుపులో అగ్గేసినట్టు మంట మంట. నీ రోసంముక్కలవా, ఇదంతా నువ్వే సేసినావు'అని ఆమె అక్కసు వెళ్ళబోస్తోంది.

'ఓలత్తా. ఒల్లకొయ్యే. మాఁవ బెంగడిసస్తన్నాదే, మావని పీక్కుతినేకే, నీ కొడుకు మా మంచోడంటే? ఒల్లకోవే, సిగ్గునేక, అంటూ కోడలు అత్తని రెండు చేతులూ పట్టుకుని ఇంటికి లాక్కుపోయింది.

రావుడు ఏదో చెబ్దావని ప్రయత్నంచేసాడు. అతడి నోరు పెగల్లేదు. దుఃఖం గుండెల్లో గూడుకట్టుకుంది. దెయ్యంలా అతడి పీక నొక్కేసింది. పీక్కుపోయిన అతడికళ్లు నీళ్ళతో నిండాయి. ఆ కన్నీటిబిందువులు జారి గుండెలమీది చెమఁటబిందు వుల్తో కలిసిపోతున్నాయి. ఆ కన్నీరు అతడికి ఏవీ కనబణ్ణేదు.

అసలు జరిగిందేవిటీ అంటే రావుడుతాత కొడుకు 'సిమ్మాద్రి'ఇల్లు విడిచి వెళ్ళి పోయి పదేళ్ళయిపోయింది. (అతడు తండ్రిచే కుక్కలా కొట్టబడి ఇల్లువిడ్చి వెళ్ళి పోయాడు.)

అవి కరువురోజులు. ఆనాడు రావుడియింట్లో తిండిగింజలు నిండుకున్నాయి. చేతిలో డబ్బులేదు. పిల్లలుకూడా పస్తులు పడిపోతున్నారు. అంచాత రావుడు చిన్ననాటి స్నేహితుడేకాకుండా, ఆనాటి యజమానైన సుబ్బారావు యింటికి వెళ్లి అతణ్ణి పిల్చాడు.

సుబ్బారావు మేడమీద పడకగదిలోంచి రావుడి పిలుపు విన్నాడు. 'అవును. ఇప్పుడు రావుడు నన్నెందుకు పిలుస్తాడు? వీళ్లెవరైనా ఈ కరువురోజుల్లో నన్నెందుకు పిలుస్తారు? డబ్బుకోసం— అప్పుకోసం. వీళ్లకిచ్చినడబ్బు మళ్ళీ తిరిగిరాదు'అని సుబ్బారావు అనుకున్నాడు. 'ఏదోచెప్పి రావుణ్ని తగిలెయ్'అని భార్యతో చెప్పాడు.

ఆమె చకచకా మెట్లుదిగి వచ్చింది.

'రావుడూ. అయన నిద్రపోయారు. ఏంకావాలీ'అని అడిగింది.

'ఏంనేదమ్మా. బాబుగారు నాకు ఒరాలిచ్చే దేవుణ్నాటోరు. కరువు మమ్మల్ని తినేస్తోంది. బిడ్డ సాత్రిగా ఇంటికాడ పిడికెడు గింజల్నేవు. సేతులో కానీ డబ్బుల్లేవు. మాం ఋమ్మల్ని నమ్ముకు బతుకుతున్నాం. ఈ కరువు రోజుల్లో తవరు కూసింత మమ్మల్ని కాయాల'అని రావుడు వినయంగా విన్నవించాడు.

ఆమె చిరునవ్వు నవ్వుతూ ఆ మాటలు వింది. 'నువ్వెందుకొచ్చావో మాకు తెలీదేంటి'(అని ఆమె మనసులో అనుకుంది. అలా)అనుకుని 'రావుడూ, నిజంవే. వెధవముండా కరువు మండిపోతోంది. ఈ కరువు ఇంతవేగంగాపోదు. ఏదో ప్రళయం వొచ్చేసి ముంచేసేవరకూ ఈ కరువు పోదనినా నమ్మకం. నీకు రావాల్సిన సంవత్సరజీతం మొదటినెల్లోనే కొల్చివేసాంకదా! అంచాత నువు మళ్ళీ యిలా అడగడం ఏవీ బాగోలేదు. నీలాంటి వాళ్ళకి అప్పుయిస్తే మళ్ళీ తిరిగిరావడం చాలా కష్టమని మాకు బాగా తెల్సు. మాకుకూడా డబ్బు ఒత్తినేరాలేదుకదా! రాదుకదా! సుబ్బారావుగారు వరాలిచ్చే దేవుడయితే అవుగాక, కానీ దేవుడుకూడా ఎవళ్ళకీ ఒట్టినే వరాలివ్వడట. ఏవరాలిచ్చేదేవుడూ సంచుల్తో డబ్బువట్టుకొచ్చి, మా గుమ్మంలో గుమ్మరించడు. ఈ పాడు డబ్బుకోసవే సుబ్బారావుగారు ఎన్నికష్టాలుపడ్డారో నీకు బాగా తెల్సు. అలా కష్టపడి సంపాదించుకున్న డబ్బు మేం దానాలుచేయలేం. తిరిగిరాని మదుపులు పెట్టలేం" అని చెప్పి ఆమె విసురుగా. కోపంగా వెళ్ళిపోయింది.

ఆమె వచ్చినప్పుడు చిరునవ్వు నవ్వుతూ వచ్చింది. ఆమె చిరునవ్వు పులి మందహాసంలావుంది. ఆమె వెళిపోయేటప్పుడు కోపంగా వెళిపోయింది. ఆమె కోపంగావున్నప్పుడు. అప్పుడే ఈనిన అతిసుందరమైన పులిలావుంది.

ఆ మాటలువిన్న రావుడిమనసు ఒక్కసారిగా అవమానంతో భగ్గున మండిపోయింది. అతని వళ్లు కోపంతో జలదరించింది. 'శీ-శ్శీ! ఈ సుబ్బిగోడు డబ్బెలా గనించేడో నాకు తెల్దనుకుంటన్నావా? ఆడు సేసిన అన్నేయాలు నా కెరుక నేవా? ఆడికీ చావ్డానికీ తేడానేదే! శీ-శ్శీ! నువు నాకు నీతులు సెప్పొచ్చినావా?' అని రావుడు అనుకున్నాడు. 'శా-శ్శా! ఎదవబతుకు నాది. ఈ బతుకు బతుకుతే నేటి, సత్తే నేటి'అని కూడా అనుకున్నాడు.

'ఇయ్యాల్టి చంగతేటిమరి' అని ఆలోచిస్తున్న రావుడి ఒక వుపాయం తట్టింది.

రావుడు నూకాలమ్మ పండక్కి కోడికోసం కాణీ-అణా అప్పుడప్పుడు కూడబెట్టి చిక్కంసంచీలో దాస్తాడు. ఆ చిక్కంసంచీ వెదురుబద్దలపెట్టెలో దాస్తాడు ఆడబ్బుల్తో ఆ రోజు గడుపుదావని చిక్కంసంచీ బయటకు తీసాడు. అందులో డబ్బుల్లేవు. రావుడు తెల్లిబోయిచూస్తూ నిలబడిపోయాడు.

'మావా. ఏటిసెప్పేది. తాగనానికి నీ కొడుకు ఆ డబ్బులు గుంజుకుపోనాడు' అని కోడలు బెదురుతూ చెప్పింది. వొళ్లుతెలీలేదు. వొళ్లుతెలీని కోపంలో, తాగి వొళ్లు తెలీకుండా గుడి అరుగుమీద పడున్న కొడుకుని చేపాటికర్రతో బాదాడు, 'ఈ ఎసనాలే మన బతుకుల్నిలా సేస్తన్నాయే. ఇయ్యే మన పానాలు తీత్తన్నయ్' అని అరుస్తూ కొడుకుని బాదాడు. అతడు కర్రతో కొడుతున్నప్పుడు బోర్లా పడుకున్న సిమ్మాద్రి ముక్కు నేలకు ఢీకొని నెత్తురు కారింది. నాలిక పళ్ళమధ్యపడి తెగి రక్తం కారింది.

ఆ రక్తబిందువులు ఆ రాతి అరుగుమీద వెంటనే యింకిపోలేదు

రావుడు నీరసంతో కళ్లు చీకట్లుకమ్మి తూలి పడిపోయాడు.

బరువుగా వూపిరిపీలుస్తూ, సిమ్మాద్రి అక్కణ్ణుంచి వెళ్ళిపోయాడు. అవూరి పక్కనున్న ఏట్లోపెగి మొహం, ముక్కూ, నోరూ కడుక్కున్నాడు. 'ఇంకీ ఎదవ బతుకు బతకను. ఆ సిటంవే వూరొగ్గేసి ఎగేస్తాను' అని అనుకుని, ఆ క్షణమే వూరు విడ్చి వెళ్ళిపోయాడు.

రావుడు కళ్లు విప్పిచూసాడు. సిమ్మాద్రి కనిపించలేదు. రాతి అరుగు మీద యింకిపోని రక్తబిందువులు అతని కళ్ళకు కనిపించాయి. 'నానొట్టి పసివిని, గొడ్డును బాదినట్టు నా కొడుకుని బాదినాను. దరిద్దెరాన్ని కొట్లేక నా కొడుకుని కొట్నాను'అని రావుడు తల్లడిల్లిపోయాడు.

కొడుకు వూరువిడిచి పారిపోయాడని తెల్సుకున్న రావుడు కుప్పలా కూలిపోయాడు.

* * *

'నానంటే అందరికీ సులకనై పోనాను. ఇలవనేకుండా పోనాను. మా యమ్మ నన్జూసి సీదరించుకుంటాది. కట్టుకున్నగుంట ఇసుక్కుంటాది. వూల్లో అందరికీ సులకనైపోనాను. వోరూ నన్ను సిమ్మాదిరిఅని పిల్రే. బుడ్డిగోడనే పిలస్తారు. పక్కలో తొంగున్నప్పుడు పెల్లాంకూడా బుడ్డిగోడనే పిలస్తాదికానీ మరోలా పిల్దే. ఓట్లనెక్కల్లో తప్ప మరెక్కడా సిమ్మాదిరిపేరు యినబడదు. మాయయ్య గొడ్డునుబాదినట్టు నన్ను బాదినాడే. ఇదంతా తాగడంసేతేగదా సిత్తుగా తాగుతూ 'సిత్తకారితె'కుక్కనై పోనాను. శీ శ్సీ- నానింకీ ఎదవబతుకు బతకను. తాగడంసేతే, ఎసనాలల్లే, మాకు కూడూ-గుడ్డా నేవని పెద్దోరంటన్నారు. కస్టపడి పనిసేస్తే మాకు కరువుండదని గొప్పోరంటన్నారు. అందుకే నానింక తాగను, సస్తే తాగను. ఏ ఎసనాలూ తగులోక్కను. కడుపుతోనున్న నా పెల్లాంతోడుగా నానింక తాగను. మా యమ్మతోడుగా వొల్లొంచి పనిసేస్తాను. అలా డబ్బుకూడెట్టి మాకు కరువునేకుండాసేస్తాను'అని సిమ్మాద్రి గట్టిగా ఒట్టుపెట్టుకుని వూరువిడిచి వెళ్ళిపోయాడు.

వూరువిడిచివెళ్లిన సిమ్మాదిరి తన వూరికి చాలా దూరంగావున్న పట్నం చేరుకున్నాడు.

ఓ కట్టెలవ్యాపారివద్ద కూలీగా చేరాడు.

అతడు పగలల్లా వొళ్లు దాచుకోకుండా కండలు పిండుకుని పనిచేస్తున్నాడు. అంచాత అతని నరాలు పీకుతూవుండేవి. వొళ్లు నొప్పులుగా వుంటూవుండేది. తాగడం మానీడంవల్ల అతడికి నిద్ర సరిగ్గా పట్టడంలేదు. అంచాత అతని మనసుస్థిమితంగా వుండేదికాదు. రకరకాల ఆలోచన్లు అతని మనసును కలవరపరుస్తూ వుండేవి, తన వాళ్ళందర్నీ చూడాలని తనువు కలిగినప్పుడల్లా తల్లడిల్లిపోతున్నాడు. నిరాశ అతని మనసును కాల్చేస్తోంది.

'నాను బుడ్డిగోణ్ణని సాలామందికి అసియ్యం కానీ, వోరూకూడా నానెందుకలాగయిపోనానో పట్టిచ్చుకోరు. ఆరోరికీ దాన్తో పన్నేదు. మారకతం తాగిందే ఆపద్ర-మా జవ పేర్చేసిందే- బంగారం పండుతాదని ఆసెపడ్డావే- ఆ భూ(వి మాదికాకుండా పోశాదే. మా కష్టం కాట్లో కల్సిపోనాదే. మా ఆసెలు బుగ్గయిపోనాయే. మావింక ఏటిసూసుకు బతకాల? మా కింకేటిమిగిలింది? అక్కడే నా తమ్ముడు పొంగుట్టి సచ్చిపోనాడే. నానప్పుడు ఎర్రెక్కినట్టయిపోనాను. బుర్రలో సెదట్టినట్టుబాద. గుండెల్లో అగ్గోసినట్టు మంట, నాను బతకాలంటే యియన్నీ మరవాల. అద్గందుకే తాగడం మొదలెట్టినాను. వొల్లు పులుపెక్కి నాను తాగనేదే. కానీ ఏది ఏటయిపోనా, నానింక తాగను, సస్తే తాగను'అని అతడు ఆ నిద్రరాని రాత్రిళ్లు తరుచుగా అనుకుంటూవుండేవాడు.

అతడలా తాగడం మానేసాడు. కష్టపడి పనిచేస్తున్నాడు. అతడు చాలాచోట్ల పనిచేసాడు. చాలారకాలైన పనులుచేసాడు. రకరకాల యజమానులదగ్గర పన్జేసాడు. అలా పది సంవత్సరాలు గడిచిపోయాయి.

ఏ యిద్దరూ అతడికి సమానంగా కన్పించలేదు కానీ, రెండువిషయాల్లో మానవు లంతా సమానమే అని అతడు అప్పుడే తెల్సుకున్నాడు. ఆడాళ్ళవిషయంలో మగాళ్లం దరూ ఒకాటే అయినట్లు, పనివాళ్ళ విషయంలో యజమానులంతా ఒకాటే అని తెల్సు కున్నాడు. కష్టపడేవోడికంటే కష్టపడ్నోడే గొప్పోడని అతడికప్పుడే తెల్సొచ్చింది అతడలా చాలా విషయాలు తెల్సుకున్నాడు.

అప్పుడతడు సిమెంటు వ్యాపారివద్ద పనిచేస్తున్నాడు.

ఆ వెన్నెలరాత్రి అతడు రావిచెట్టుకింద సిమెంటు బస్తాలలాగే బండిమీద వెల్ల కిలా పడుకున్నాడు.

చల్లగాలి వొళ్లు పులకరించేలా వీస్తుంది. అతడు పెళ్లానికి దూరంగా వుండడం వల్ల ఆ వెన్నెల్ని కోప్పడ్డాడు. ఆ చల్లగాల్ని తిట్టాడు. ఆకాశంలో దోబూచులాడు తున్న మేఘాల్ని దూషించాడు.

విరిగిపడుతున్న ఆకాశంలా నిరాశ అతనిమీద కూలిపడింది.

ఆ పక్కింటిగోడమీద చిక్కగా అల్లుకుని పచ్చగావున్న లతలన్నాయ్. ఆ లతల్లో విరబూసిన వెన్నెల నవ్వుల్లాంటి తెల్లని సన్నజాజులున్నాయ్.

సిమ్మాద్రి ఆ సన్నజాజుల్ని పిడికిలితో పీకి కాలికిందవేసి నలిపేసాడు.

'సిమ్మాద్రీ– సిమ్మాద్రీ—'అప్పుడొక పొలికేక, సిమ్మాద్రి తుళ్లిపడ్డాడు. గబగబా బండిఎక్కి మళ్లీ వెల్లకిలా పడుకున్నాడు. అతడు పలకలేదు. కళ్లు విప్పి చూడలేదు.

'ఏయిరా డబ్బు సంచులు? ఎక్కడెట్టినావ్రా? నువు పూరొగ్గేసి పదిపంట్లయి పోనాదే. నువు తాగుడు మానేసినావే. ఒల్లుదాసుకోకుండా పనిసేస్తన్నావే, మరేయిరా నువు పోగేసిన డబ్బు సంచులు?

'డబ్బు సంచులా– డబ్బు సంచులా– ఏటీ ఏటీ– డబ్బు సంచులా? నా సేతులో సిల్లుకానీకూడా నేదే?' అని సిమ్మాద్రి నిరాశగా, దుఃఖంగా, పిచ్చిగా, మొరపెట్టు కున్నాడు.

కాళ్లు కట్టేసి మంటల్లో పడేసిన పక్షిలా సిమ్మాద్రిలోని సిమ్మాద్రి విలవిలా తన్నుకున్నాడు.

అప్పుడే వో ఎలక చల్లగాలికోసం గోడకన్నంలోంచి బయటకు వచ్చింది. ఆ ఎలక యవ్వనంగా బలంగావుంది. ఆ చల్లగాలి వొంటికితగిలేసరికి ఆ ఎలక్కి వొళ్లు పులకరించింది. ఆ చల్లగాల్లో ఆ ఎలక స్వైరవిహారం చేస్తోంది. ఆ ఎలక్కి శత్రు వులున్నారని తెలీదు. ఆ ఎలక మురిసిపోతూ స్వేచ్ఛగా తిరుగుతున్నప్పుడు హఠాత్తుగా గోడమీంచి ఒక పిల్లి దూకి, ఆ ఎలకను నోటితో కర్చుకుపోయింది.

ఆ పిల్లి నల్లగా చీకటిపులిలా వుంది.

సిమ్మాద్రి అది చూసాడు. 'ఓ ఎలకముండా! నీ బతుకూ నా బతుకూ ఒక లాగే వున్నాయే?'అని ఆ ఎలకమీద జాలిపడ్డాడు.

వెంటనే దిగ్గున లేచి కూర్చున్నాడు. వెనువెంటనే గబుక్కున బండిమీంచి కిందకుదూకి; తిరిగి తనవూరు బయల్దేరాడు.

* * *

ఎండ మండి మండి మళ్లు ముఖంపట్టింది. చెట్ల ఆకులు వాడి వాడి మొహాలు వెలేసాయి. గాలి వీచి వీచి మందగించింది. ఎర్రధూళి ఎగిరి ఎగిరి మరింక ఎగరలేదు.

రావుడు చుట్ట కాల్చి కాల్చి మిగిలిన చుట్టను తలపాగాలో పెట్టాడు.

'నిన్ను పొద్దుటకాణ్నుంచి సైకిలుమీద కూకోబెట్టి తోత్తన్నానే, నన్నోపాలి కూకోనీవా?' రామారావు అడిగాడు

'వీల్లేదు'అన్నాడు గిరిజారావు.

'ఓరి ఎర్రోడా, ఆడునిన్ను సైకిల్మీ కూకోనీడ్రా, ఎందుకురా అణ్ణాలా బతిమ లాడుతావ్. ఏ సెట్టు ఆ సెట్టుకాయలే కాద్దిరా'అని అనుకున్నాడు రావుడుతాత.

రామారావు మనసు విసవిసలాడింది. కొంతసేపు విచారంగా, దీనంగా మామిడి చెట్టుకింద కూర్చున్నాడు. మరికొంతసేపటికి మళ్ళీ సైకిలుతోయడం మొదలెట్టాడు.

ఇంతలో సిమ్మాద్రి అత్రుతగావచ్చి. వేపచెట్టుమొదల్ని నడుంఆన్చి కూర్చున్న తండ్రిముందు అసహాయంగా నిలబడ్డాడు.

'ఓరికొడకా, ఒచ్చినావట్రా, నాజ్జేసినతప్పుకి తగిన సిచ్చేసినావులే. ఈముసిలి పేణం రాలిపొయ్యేముందయినా, నిన్జూసే అదుష్టం వుందో నేదో అని గుండె గండడి సస్తన్నాను. ఇయ్యాల్టికేనా ఒచ్చినావు. అదేసాలు ఈ బతుక్కి'అని రావుడు కొడుకుని సందిట్లో పట్టుకున్నాడు.

సిమ్మాద్రి కళ్ళల్లో నీళ్లు గిర్రున తిరిగాయి. అతని గొంతుక బిగుసుకుపో యింది. అతడు ఏమీ మాటాడలేకపోయాడు.

తండ్రి వచ్చాడనితెల్సి రామారావు గంతులువేసుకుంటూ వచ్చాడు. పుట్టినప్పట్నుంచీకాకుండా పదేళ్ళకొడుకుని ఒక్కసారే చూసిన సిమ్మాద్రి గుండెల్లో దుఃఖం, ఆనందం, అల్లిబిల్లిగా పెనవేసుకుని అతణ్ని ఏవో తెలీనిభావాల్లో ముంచేసాయి. అతడు కొడుకుని ఎత్తుకుని ముద్దులాడుతూ పరవశంచెందాడు. ఆ కుర్రాడు చాలా సంతోషంగా, ఉత్సాహంగా, బలంగా అప్పుడు కనిపించాడు.

సిమ్మాద్రి మొహంలో సంతోషం వెన్నెల్లావిరిసింది.

ఇంతలో సిమ్మాద్రితల్లి సత్తుగిన్నెలో గెంజోసి పట్టుకొచ్చింది. 'ఈ సేతుల్తో నీకు గెంజోసి పదిపంట్లయి పోనాదిరోరికొడకా। ఇదంతా మీ యయ్యే సేసినాడోరికొడకా!'అని ఆమె అంటూ కొడుకుని చుట్టేసింది.

సిమ్మాద్రి ఆమెను కౌగిట్లోకి తీసుకున్నాడు. అతడి కన్నీళ్ల ఆమె తలమీద రాలాయి.

'ఇన్నాళ్ళకి మాం గురుతొచ్చినామన్నమాట' అని సిమ్మాద్రి పెళ్లాం తలదించుకుని, అడిగింది. ఆమె కొత్త పెళ్లికూతుర్లా అప్పుడు సిమ్మాద్రికి కనిపించింది. ఆమె అత్తను తీసుకుని తిరిగి యింటికి వెళ్లిపోయింది. వెళిపోతూ, వెళిపోతూ ఆమె సిమ్మాద్రి మొహంలోకి చూస్తూ చూస్తూ ముసిముసినవ్వులు నవ్వింది.

ఆ నవ్వులు అతడి గుండెల్ని కవ్వించాయి.

తమ్ముళ్లూ-చెల్లెళ్లూ అతణ్ని చుట్టుముట్టేసారు. వూరువూరంతా అతడి చుట్టూ చేరింది.

రామారావు మళ్లీ తోట్లోకిపోయి గిరిజారావు కూర్చున్న సైకిలు తోస్తున్నాడు.

సిమ్మాద్రి తనచుట్టూ చేరినవాళ్ళతో తను వూరువిడిచి వెళ్ళిననాటినుండీ జరిగిన సంగతులన్నీ చెప్తున్నాడు అలా చెప్తూ సైకిలు తోస్తున్న కొడుకుని చూస్తున్నాడు.

అంతలో గిరిజారావు సైకిలుదిగి మేడమీదకు పరుగెత్తాడు.

రామారావు మామిడిచెట్టుకింద కాళ్లుచాచుకూర్చున్నాడు.

అప్పుడు రామారావుకి చాలా ఆకలిగా వుంది. అతడు సైకిలు తోయడంవల్ల బాగా అల్సిపోయాడు ఆయేల అల్లింట్లో కూడ్నేదు. అంచేత అళ్ళమ్మ అడికికూడెట్నదు. కూసిన్ని గెంజినీల్లోసి తగిలేసింది. అంచాత అతడు చాలా ఆకలిగావున్నాడు. (బాగా అల్సిపోనాడు.) ఆకలి కిరకిర్లాడుతోంది. ఆ ఆకలి బాధకంటే 'అల బొద్దెల్నుంచీ ఆణ్ని చైకిల్మీకూకోబెట్టి తోత్తన్నా, నన్నోపాలి కూకోనిచ్చినాడు కాదే' అనే బాధ అతడికి మరీ బాధగా వుంది.

ఇంతలో గిరిజారావు వెండికంచంలో పనసతొనలు తెచ్చుకుని రామారావుముందు నిలబడి తింటున్నాడు. ఆ వెండికంచం గుండ్రంగా పున్నమచంద్రుడి ముఖంలావుంది. ఆ పనస తొనలు గుమ్మని వాసనవేస్తూ నోరూరిస్తున్నాయి. అవి పసుపు పచ్చగా, బంగారంవన్నెలా, (బింకంగా, రసవంతంగా) వున్నాయి. అవి ఆ పచ్చని సూర్య కాంతిలో మరీ పచ్చగా మెరుస్తున్నాయి.

అవి చూసి రామారావుకి నోరూరింది. 'నాకో తొనెట్టవా'అని అడిగాడు. పీల్లే దన్నాడు గిరిజారావు. 'అలబొద్దేల్నుంచి నిన్ను సైకిల్మీకూకోబెట్టి తోత్తన్నా నన్నో పాలి కూకోనిచ్చినావు కావే! పోన్లే, ఒక తొనేనాఎట్టు, ఒక తొనెడితే అరిగిపోతా వేటి ? ఎట్టు, ఎట్టు' అని చెయిచాచి కొంచెం గిరిజారావు దగ్గరగా వెళ్లాడు.

పీల్లేదని గిరిజారావు గట్టిగా అరిచాడు 'ఎందుకీల్లేదూ ?'అని రామారావు మరి కొంచెం దగ్గరగావెళ్ళి మరికొంచెం గట్టిగా అడిగాడు.

'పీల్లేదు, పీల్లేదు. పీల్లేదంటే పీల్లేదు. మా తాతను పిలుస్తాను. మా కుక్కను వుసికొల్పుతాను, నీ పొగరేంటో చూస్తాను. అని గిరిజారావు గొంతుక పెద్దదిచేసి అరిచి, చీదరించుకుంటూ నేలమీద వుమ్మాడు.

'నీకు నేయం నేదులే, అలబొద్దుకాణ్నుంచి నినుగూకోబెట్టి సైకిలుతోత్తన్నానే, నన్నోపాలైన కూకోనిచ్చునావుకాదే. ఒక తొనెట్టమన్నా ఎట్టినావు కాదే. నా నోట్టినే ఎట్టమన్నేదే, సైకిలు తోసినానుగందా అని ఎట్టమన్నాను. నే దండానికి నీకు సిగ్గవ నేదా ? సెప్పుకో, సెప్పుకో. నీ దిక్కున్నసోట సెప్పుకో, ఓరూ నన్నడ్నేరు. సూసుకో !'అంటూ రామారావు కోడిపిల్లను గెద్దంకించుకున్నట్లు, ఆ తొనల్ని అంకించు కున్నాడు.

గిరిజారావు అడ్డువస్తే కిందకు తోసేసాడు. ఆ తొనలు తింటూ వెనక్కి తిరిగి పోయాడు.

సిమ్మాద్రికాకుండా, రావుడుతాతకూడా ఆ జరిగిందంతా చూసాడు. అక్కడ చేరినవాళ్ళందరూ చూసారు.

అప్పుడు రావుడితాతకు మనవడిమీద పట్టరానికోపం వచ్చింది.

'ఓరిగుంటడా ! ఓరి గాడిదకొడకా ! ఏట్రా నువుసేసినావు ? ఏట్రా ఆ దగు ల్బాజీపని ? కూడ్నేకపోతే, నువు ఆకల్తోసావు. నువుసస్తే ఈ నోకానికేటీ నోటురాదు. కానీ నీతి సావకూడదురా, ఏట్రా నీ పొగరు ! నీతిమాలినపని సేస్తావట్రా! నూడు, ఇయ్యాల నీ దుమ్ములొల్సెస్తాను'అంటూ రావుడు చేతికర్రతీసి వస్తున్న మనవడికి ఎదు రుగా వెళ్లాడు.

'ఓరి ముసిల్నంజాకొడకా, నా దుమ్ములొలుత్తావట్రా? నానేం తప్పుసేసినాన్రా? నానేం తప్పుసేయ్‌నేదురా, ఆ తప్పంతా ఆమెకంగోడు ఆడిదేరా. నాన్జేసింది నీకంటికి అగపడ్డదా? ఆడుసేసింది నీకంటికి అన్నేదా? గుడ్డినంజాకొడకా, రారా, కొటాగ్రి' అంటూ రామారావు తాతచేతిలోనికర్రి ఎగిరిపట్టుకుని గట్టిగా లాగాడు.

రావుడుతాత కర్రి వదలకపోయినా కుదుపుకి తూలి పడిపోయాడు. వొళ్లుతెలీని కోపంతో కర్రినానుకునిలేచి, మనవణ్ని కొట్టడానికి మళ్ళీ కర్రిపైకెత్తాడు.

'ఓరయ్యా, ఓరోరయ్యా, ఆగరా, ఆగరా, ఒల్లకోరా, ఒల్లకోరా, నీకు ఆకలిబాదేగాని అన్నేయాల బాద తెల్నేదురా. నీకు కడుపుమంటేగానీ, గుండె మంట తెల్దురా. నీ మనవడు నీలా బతకనేడ్రా'అంటూ సిమ్మాదిర్రి తండ్రిని అడ్డుకున్నాడు.

తెలతెలబోతూ రావుడుతాత వెలవెలబోతున్న ఆకాశంలోకి వెర్రిగా చూసాడు.

అక్కడ చేరినవాళ్ళందరూ ఒకరిమొహాలొకరు చూసుకున్నారు.

మనవడి ఏడ్పువిని సుబ్బారావు గబగబామెట్లుదిగి కిందకువచ్చాడు. జరిగిందంతా మనవడిద్వారా తెల్సుకున్నాడు.

'ఎవడ్రావాడు, నా మనవడి పనసతొనలు ఎత్తుకుపోయాడు? ఎవడ్రా వాడు నా మనవణ్ని కొట్టాడు. ఎవడ్రా వాడు నా మనవణ్ణి కిందకు తోసేసాడు. నా మనవడి ఒంటిమీద చెయివేయడానికి వాడికి ఎన్నివేల గుండెలున్నాయిరా? వాణ్ని ముక్కలు ముక్కలు కింద తరిగించేసి, గెద్దలకు ఎగరేయిస్తా' అంటూ సుబ్బారావు గావు కేకలు పెట్టాడు.

సుబ్బారావలా కేకలు వేసివేసి అప్పటికి వూరుకున్నాడు.

చైనాపై అరుణతార — మేడేకు విడుదల

విద్యుచ్ఛక్తిలో కోతవల్ల ప్రెస్‌లో తరచు కరెంటు ఫేలయి "చైనాపై అరుణతార" పుస్తకం లోగా ప్రకటించినట్లుగా మార్చ్ నెలాఖరుకు అందించ లేకపోయినందుకు మన్నించాలి. మేడే కానుకగా అందించగలం.

జనత ప్రచురణలు
6-3-628/13 ఖైరతాబాదు.
హైదరాబాదు 500004.

దేవతల విందు

చైనీస్ మూలం: చావో హుంగ్-చిన్
స్వేచ్ఛానువాదం: చలసాని ప్రసాదరావు

లాంగ్ మార్చ్! పశ్చిమాభిముఖంగా సాగుతోంది

పదకొండు రాష్ట్రాలగుండా ప్రయాణం! ఇరవయ్యయిదువేల 'లీ' ల దూరం. రెండేండ్లపాటు సుదీర్ఘ యాత్ర! మమ్మల్ని మింగేందుకు కాపలా కాచుకూర్చున్న కొమింటాంగ్ మూకల్ని ఛేదించుకుంటూ, జపాన్ దురాక్రమణ సేనల్ని అరికట్టేందుకు సాగిపోతున్నాం.

బురదనేలలు, మంచుపర్వతాలు, కొండలు, గుట్టలు, వాగులు ఇవేవీ మమ్మల్నాపటంలేదు. ఇబ్బందులు అసంఖ్యాకం. కానీ, మా దీక్ష అనంతం, రెడార్మీ అంటే పట్టుదలకు మారుపేరు.

నడచి, నడచి అలసిపోయింది మా దళం. పరిసరాలన్నీ నిర్జనం. దగ్గర్లో ఓ కొండదేవుడిగుడి కనుపిస్తే తాత్కాలికంగా అక్కడ బరువులు దింపుకున్నాం.

కొద్దిరోజులుగా కడుపునిండా తిండిలేదు. నీళ్లు తాగి నీడ వెదుక్కుని విశ్రమించాం.

గుడి గోడకానుకుని, కాళ్లు బారచాపుకుని వళ్లు విరుచుకున్నాన్నేను. నిద్రమత్తులో ఉన్న నా కళ్ళకు ఓ మూలన పగిలిన పెద్దడోలు ఒకటి కనుపించింది. దానికి బిగించిన పెద్ద తోలు ముక్క కట్లు ఊడి కిందపడి దుమ్ముకొట్టుకునుంది.

అలుపు తీరింతర్వాత అనాలోచితంగానే లేచి వెళ్లేను. ఆ తోలుముక్కను తీసి దుమ్ము దులిపి శుభ్రించేసేను.

మా దళనాయకుడు ఇది చూసి అడిగేడు "ఎందుకు పనికొస్తుందదీ? ఏం చేసుకుందామనీ?"

నా తోటి కామ్రేడ్ చిలిపిగా నవ్వేడు: "నెత్తికేసి కొట్టుకుందామనుకుంటున్నాడేమోనండీ!"అని. దానికి మరికొందరు శృతి కలిపేరు.

నాకు నవ్వురాలేదు "అవును! నెత్తినేసుకునేందుకే తీసేను!"అని దబాయించేను.

నిజమే! అదెందుకూ పనికిరాదు. మాకు ఉన్నబరువుచాలక యిదో అదనపు బరువవుతుంది. అంతే! అదెందుకు తీసేనో నాకేతెలీదు. తీసేప్పుడు నాకు ఏ ఆలో

చనా లేదు. కానీ మా కామేడ్ల నవ్వులూ, వేళాకోళాలూ చూసేక దాన్ని కొద్దిగా వంచి నెత్తిన టోపీలా అమర్చుకున్నాను. దూరానికది అచ్చం గడ్డి టోపీలాగే కనుపిస్తోంది.

రోజులు గడుస్తున్నాయ్! మేం నడుస్తున్నాం. మా లాంగ్ మార్చ్‌లో రాను రాను యిబ్బందులు ఎక్కువకాసాగేయి. కొండలూ, గుట్టలూ ఎక్కి దిగటంలో తేలికగా అలసిపోతున్నాం. అయినా మా నడక వేగంమాత్రం తగ్గకుండా జాగ్రత్త పడుతున్నాం.

అద్భుతం! ఒకేరోజున యిటు వేసవినీ అటు శరత్తునూకూడా చూడగలుగుతున్నాం. కొండలదిగువన లోయల్లో మండే ఎండలు స్వాగతమిస్తే అదే సాయంత్రం కొండశిఖరాన మంచులోంచీ నడుస్తున్నాం. ఉదయం వేడిగాడ్పుల్ని రుచిచూసినవాళ్ళం సాయంత్రిం మంచుగాలుల్ని కౌగలించుకుంటున్నాం.

ఎందుకూ పనికిరాదనుకున్న తోలు ముక్క న్ననేకవిధాలా కాపాడుతోంది. ఎండల్లో గడ్డిటోపీకన్నా మిన్నగా నీడనిస్తోంది మంచుగాలుల్లో గోలీల్లా మీదపడే మంచుముక్కల్ని డాలులా అడ్డుకుంటోంది బురదనేలల్లోంచి నడిచేటపుడు మాకు కనీసం కూర్చునేందుకు మంచి నేలకూడా దొరకదు. కానీ నాకు మాత్రం ఈ తోలు ముక్క ఎలాంటిచోటునయినా పీటలా పనికివస్తోంది,

నవ్విన నాపచేను పామెతగా నా తోలుముక్కను చూసి నవ్విన కామేడ్స్ నా అదృష్టానికి అభినందించసాగేరు.

అవును! మరి మా పరిస్థితి అది, ఇదేం సరదా యాత్రకాదు. మాక్కావాల్సినవి మేం సమకూర్చుకోవాలే తప్ప మాకు సప్లయిలు చేసేవారే లేరు. ఊళ్ళకు ఊళ్లే నిర్మానుష్యం అయిపోయాయి. అడవుల్లో దొరికే దుంపలే మాఆహారం. అడపాదడపా ఏ జంతువేనా దొరికితే ఆ రోజు మాకు విందు చివరికి అవీ కరువయినప్పుడు మా గుర్రాల్నే కోసుకుతినసాగాం. గత్యంతరంలేదు

ఒక్కోసారి వెనుదిరిగి చూసుకున్నపుడు మాకే ఆశ్చర్యంవేసేది, ఇంత సుదీర్ఘ యాత్రను యిలాంటిస్థితిలో ఎలా సాగించగలిగామా? అని. నిజానికి మాకు సరైన పాదరక్షలుకూడా లేవు నీళ్ళలో తడిసీ, బురదనేలల్లో నానీ, మంచుగుట్టల్లోముద్దయి దాదాపు అందరి బూట్లూ, చెప్పులూ ముక్కలు ముక్కలుగా విడిపోయేయి, కుట్టుకుందామన్నా వీల్లేకుండా పాడైపోయేయి. అనేక మందికి కాళ్లు పగిలేయ్! ముళ్లూరాళ్లూ గీసుకుని రక్తాలు కారేయ్. కొందరికి అడుగుతీసి అడుగు వేయటం అసాధ్యమైపోయింది. సూదులు తాపిన నేలమీద నడుస్తున్నట్లయింది. పళ్ళబిగువున వేగం తగ్గించ

కుండా సాగిపోతూనే ఉన్నాం. కానీ...కానీ... ఈ లెక్కన ఇంకెంతదూరం నడవ గలం ?

ఓ రాత్రి మా దళం విశ్రాంతితీసుకుంటూండగా దళనాయకుడు మా దళానికిఉన్న ముతక గుడ్డలోని ఆఖరి ముక్కను పైకితీసేడు. పాదాలకు చుట్టుకోమని తలా కాస్త పంచేడు పంచటం పూర్తయేసరికి నేనూ, హూపేనుండి వచ్చిన ఓ కామ్రేడూ మిగిలి పోయేం. మా పాదాలు కూడా ఏమంత మంచి స్థితిలోలేవు మరి మాసంగతేమిటి?

నేనతన్ని ఆహ్వానించేను, "మనకు గుడ్డ మిగలకపోతే పోయింది. మనం తోలు చెప్పులే తయారుచేసుకుందాం!"అని ప్రతిపాదించేను.

మొదట అతను తెల్లమొహం వేశేడు. కానీ, కింద పరచుకున్న తోలునుపైకి తీయగానే నివ్వెరపోయేడు. అతని కళ్ళలో వెలుగు చూడగలిగేను.

మేం చకచకా పనిచేసేం. సైజువారీగా నా గడ్డిటోపీలాంటి తోలు టోపీని ముక్కలుగా కోసేం. రంధ్రాలుచేసి తాళ్ళు బిగించేం. అంతా క్షణాల్లో అయిపోయింది. నా కామ్రేడ్ సంతోషం పట్టలేక గంతులేశేడు. "మామూలు చెప్పులకన్నా మనవి ఎంతో బాగున్నాయ్! బలంగా ఉన్నాయ్!"అని అరిచేడు. మా దళం ఆశ్చర్యపోయింది.

మా మహాప్రస్థానం సాగిపోతోంది, రోజులు గడచినకొద్దీ తినేందుకు ఏమీ మిగలకుండా పోతున్నాయ్! గుర్రాల్ని తినటంకూడా పూర్తి చేశేసేం. అదయ్యాక చివరికి మా తోలు పటకాలనే ఉడకబెట్టుకు తినసాగాం. కొద్దిరోజుల్లో అవీ పూర్తయ్యేయి. ఖాళీకడుపుల్తోనే ఆగకుండా పురోగమిస్తున్నాం.

ఇలాంటిస్థితిలో మా ఓపికను పరీక్షించేందుకా అన్నట్లుగా మాదారిలో ఓపర్వతం అడ్డునిలిచింది. అదేం చిన్న కొండకూడాకాదు. దిగువన నుంచుంటే పైన దానిశిఖరం కూడా కంటికి ఆనటంలేదు.

అయినాసరే! దాన్ని అధిరోహించి తీరాలి! వేరు దారి లేదు. కానీ, మాకు అప్పటికే కొన్ని రోజులుగా అసలు ఆహారమే లేదు. నడిచే ఓపికకూడా లేనివాళ్ళం పర్వతారోహణం చేయటం ఎలా ? ఎలా ?

ఆ రాత్రికి విశ్రాంతి తీసుకుని ఉదయం ప్రయత్నిద్దామనుకుని అక్కడే పడకలు వేశాం. నిద్రకు ఉపక్రమించేముందు అలవాటు ప్రకారం నా చెప్పులు తీసి తలగడగా అమర్చుకోబోయేను.

వాటిని చూస్తూనే నాబుర్ర పనిచేయసాగింది. తోలుపటకాల్ని పులుసువండుకు తినగలిగినవాళ్ళం యీ డోలు తాలూకు తోలుముక్కను మాత్రం తిని హరాయించుకోలేమా ? అది తినగలిగినపుడు ఇదెందుకు తినలేం ?

నా పాదరక్షల్ని వదులుకోవటం నాకిష్టంలేదు. నా పాదాలుకూడా ఏమంతమంచి స్థితిలోనూ లేవు. కానీ... మా దళం ఆ పర్వతాన్నధిరోహించి తీరాలి.

లేచి ఎండుచితుకుల్ని పోగుజేసి నిప్పురాజేశేను. నా "చెప్పుల్ని" ఆ నిప్పులో కాల్చసాగేను. చెప్పులు కాలినకొద్దీ వచ్చే వాసనకు మా దళసభ్యులంతా నా చుట్టూ ప్రోగయ్యేరు. మా దళనాయకుడు సంగతి అర్థంచేసుకున్నట్లున్నాడు! "శెభాష్"అని అరిచేడు.

సరిగా అదే క్షణంలో నా హవాపే కామ్రేడ్ ముందుకువచ్చి తన చెప్పుల్నికూడా మంటల్లో వేసేడు.

కొంచెంసేపలా కాల్చి బాగా శుభ్రించేసి, పై పొరలు గీకేసి నీళ్లతో కడిగాక పాత్రలో నీళ్లుపోసి ఉడకబెట్టసాగాం. ఉడికినకొద్దీ "తోలు" పసుపురంగులోకి మారి మెత్తబడిపోసాగింది. మావద్ద మిగిలిన కొద్దిపాటి వంటదినుసులూ అందులో వేశాం.

కొద్ది క్షణాల్లో మా ఆకలి కడుపులకు అద్భుతమైన సువాసనలాపాత్రలోంచి అందసాగాయ్: మా ఆకలి అధికం కాజొచ్చింది!

సాధారణంగా యిలాంటి "ఆహారాన్ని" చూస్తే ఎవరేనా వాంతిచేసుకుంటారు. కానీ మేం వాంతిచేసుకునేందుక్కూడా కడుపుల్లో ఏమూలా ఏమీ మిగల్లేదు.

పైగా రోజుల తరబడి పస్తుల్తో ప్రస్థానంచేస్తున్న మాకు ఆక్షణంలో అది దేవతలు కష్టపడి దేవుళ్ళకోసం తయారుచేసిన విందులా కనుపించింది.

మా దళనాయకుడు ఆ "ఆహారాన్ని" అందరికీ సమంగా పంచేడు. ఆవురావురుమంటూ తినేసి పడకవేశేరందరూ,

అప్పటికే బాగా పొద్దుపోయింది. నేను మాత్రం ఇందరి ఆకలీ తీర్చిన ఆతోలు ముక్క చరిత్రినే ఆలోచించుకుంటూ పక్కసర్దుకున్నాను.

మేనువాల్చబోతూ అలవాటుప్రకారం తలగడగా వాడుకునే చెప్పులకోసం కాళ్ళ పీడికి చేతిని పోనిచ్చేను,

కానీ......?

ఔరా!

ఆ తోలుముక్క ఇచ్చిన సత్తువతో మర్నాడాపర్వతాన్నధిరోహించి లొంగదీసుకున్నాం.

లోగడ బిచ్చగాడు లీ షంగ్ సన్
పడమటి చైనాలో ప్రముఖ విప్లవ కవి యెలా అయినాడు?

సేకరణ: కొల్లా వెంకటరామయ్య

హూచో, నవంబరు 25, 1973 (హిష్టువా) 1949 లో చైనా విముక్తిముందు లీ షంగ్ సన్ 11 సంవత్సరములు అడుక్కుతింటూ బిచ్చమెత్తుకునేవాడు. 9వ యేట బిచ్చగానిగా అడుక్కుతినటానికి వీలుగా అతని కుడికాలును విరగగొట్టుకొని వికలాంగుడైనాడు. ఇద్దరు తమ్ములు, చెల్లెలు బతకలేక ఆకలిచేత మరణించినారు. అతని చిన్నచెల్లెలును బీదరికమునకు తట్టుకొనలేక అమ్మివేసినారు.

1949 జపాను, అమెరికా, కోమింటాంగ్ ద్రోహులనుండి చైనావిముక్తి ఐన తరువాత, లీ షంగ్ సన్ సాయంత్రిపు గ్రామపాఠశాలలో చదువుకొన్నాడు. 1959లో కవిత్వము వ్రాయటము నేర్చుకున్నాడు. ఆయన మొదటి రచన చైనా పత్రికలలో, సాంస్కృతిక కేంద్రములలో వ్రాయబడింది. పాడబడింది. దానితో ఆయన ప్రోత్సాహము, వుత్సాహము పొందాడు. ఆ గేయములో ప్రజాజీవితాన్ని, ప్రజాశక్తిని పెంచే గ్రామ సోషలిస్టు విధానాలను కళ్ళకుకట్టినట్లు రచించాడు. లీ షంగ్ సన్ తరువాత కమ్యూనిస్టుపార్టీ సభ్యుడైనాడు. నాల్గు ప్రైమరీస్కూళ్ళపై విద్యాశాఖకు బాధ్యుడైనాడు. ఆయన చంగ్ కువాన్ కమ్యూన్‌లో చంగ్ హూబ్రిడ్జి యేరియా బీదచిన్న మధ్యతరగతి రైతాంగములో యెంతో పేరు సంపాయించాడు. ఆయన వ్రాసిన 23పంక్తుల గేయం గ్రామములలో సహజంగా పాడుకొనే ప్రజాగేయంగా చిత్రించాడు. ఆ గేయం జపాను, అమెరికావాళ్ళతాబేదారులు చాంగ్ కై షేక్ వాళ్లవల్ల కార్మికులు, వ్యవసాయ కూలీలు, బీదరైతులు పడిన బాధలు, ప్రజానీకాన్ని యే విధముగా చిత్రహింసలుపెట్టి హింసించింది వ్రాశాడు. మావో నాయకత్వమున కమ్యూనిస్టుపార్టీ ఎర్రసేనవలన విముక్తి అయినతరువాత సోషలిజం యేవిధంగా ప్రజలను కమ్యూన్‌లద్వారా సౌఖ్యము అనుభవించుతున్నది వ్రాశాడు. ఈ గేయం స్త్రీలోకాన్ని బాగా కదిలించి వుత్పత్తికి ఎంతో తోడ్పడింది. ఇప్పటివరకు వందల గేయాలను ప్రస్తుత అనుభవములనుండి వ్రాయగలిగినాడు. ఇప్పుడు నూతన సామ్యవాద గ్రామజీవితం, స్త్రీలోకం ఏవిధముగా వుత్పత్తులు పెంచుటకు తోడ్పడుచున్నది వ్రాశాడు. ప్రజలకు అర్థమయ్యేటట్లు మూడు విప్లవాలచరిత్ర, శాస్త్రీయ పద్ధతులద్వారా వుత్పత్తి పోరాటములో విప్లవ మార్పులతో చైనా పత్రికలలో రాష్ట్ర జిల్లా కమ్యూన్‌లలో ప్రముఖంగా ప్రచురించబడి ప్రజలచేత

మన్ననలుపొంది పాడబడుచున్నది. విప్లవ కమ్యూన్‌ల నాటక, గేయాల ప్రజాపరిదర్శనలలో ముఖ్యముగా పెకింగ్ విప్లవ వొపెరాలలో పాటలు ప్రదర్శించబడుచున్నవి. అయన ముఖ్యగేయాలు ప్రముఖమైనవి యెర్రలాంతరు, డ్రేగన్ రివర్, తెల్లపెండ్రు కలపిల్ల, వోటింగ్ (Ballot). వీరు వ్రాసిన పాటలు ప్రజానీకంముందు ప్రదర్శించబడి ప్రథమపాఠమును చర్చించి, ఖరారుచేయబడి చైనా ప్రజానీకం యొక్క మన్ననలను పొందినవి. లీ షుంగ్ సన్ విప్లవ గేయాలకు చైనా కమ్యూన్‌లలో యెంతోపేరు సంపాయించి 'విప్లవకవి' అయినాడు ఈ కవి కమ్యూన్‌లో భూసంస్కరణలలో భూమిని కూడా పొందినాడు. కొంత కాలము పుస్తకములషాపులో పుస్తక విక్రేతగా పనిచేసినాడు. ప్రస్తుతము యీ కవి వివాహము చేసికొని ప్రజాకమ్యూన్‌లలో పుత్పత్తి పెంచటానికి యెంతో తోడ్పడుతూ గేయాలు రచిస్తున్నాడు.

"నాకు కమ్యూనిస్టుపార్టీ రెండవ సౌఖ్యజీవితాన్ని విప్లవంద్వారా ప్రసాదించింద"ని "ప్రజలకొరకు సేవచెయ్యటానికి జీవితం పుపయోగపడింద"ని లీ షుంగ్ సన్ అన్నాడు.

ఆలోచన

అస్క

శిశువు కొత్తగా భూమిమీదపడుతున్న క్షణానికిముందు
నేలమీద నెత్తురు చిందడం ఎంత సహజమో
సూర్యుడు ఉదయించేముందు తూర్పు ఎరుపెక్కడం
ఎంత సహజమో—
నీవు నడిచే ఈ కత్తుల దారిలో
శత్రువు నెత్తురు చిందించడమో, నీ నెత్తురు చిందడమో
అంతే సహజం.
అందుకే ఆలోచన అంటే
నీవు కళ్ళతో చూసిందీ, చదివిందీ,
చెవులతో విన్నదీ, గ్రహించిందీ
వర్గ చైతన్యం గీటురాయిగా
విడమరచి ఏర్పరుచుకుంటున్న
విస్పష్టమయిన అరుణ చిత్రం.

[జపాన్ వ్యతిరేక యుద్ధకాలం సంఘటనలకు సంబంధించిన చైనా నాటకం ఎర్ర లాంతరు (Red Lantern) లోని ఎన్నిక చేసినపాటల (Selected Songs)తెలుగు అనువాదాలు కింద ఇస్తున్నాం. చైనాభాషలో రికార్డుచేయబడిన పాటల ఇంగ్లీషు అనువాదాలు వీటికి ఆధారం. తెలుగులో ఇంగ్లీషులో వచ్చినంత సౌరంకూడా రాకపోవచ్చు. కాని ఒక కుటుంబానికి కుటుంబం ముసలి నాయనమ్మ మొదలుకొని పదిహేడేళ్ళ పసివానిదాకా విప్లవానికి ఎంత దీక్షగా అంకితమయ్యారన్న సత్యం ఈ వీటిద్వారా రేఖామాత్రంగా వ్యక్తమయినా చాలునన్నదే మేమాశించిన ప్రయోజనం.]

కమ్యూనిస్టును ప్రపంచంలోని ఏకష్టమూ భయపెట్టజాలదు

(లియు–హో పాట)

కామ్రేడ్
నీ ప్రయాణంలో జాగ్రత్తగావుండు
ఎత్తైన పర్వతాలు, ఉరవడిగా పరుగులెత్తే ప్రవాహాలు
చిన్న చిన్న సందుల్లోంచి, చిన్న చిన్న వంతెనలమీంచి నడు
అవే ప్రశాంతమైన సురక్షితమైన మార్గాలు
విప్లవానికి మేం మా నిజాయితీ గుండెలను అర్పిస్తాం.
ఎంత భారమైనపని అయినాసరే
భుజమొడ్డి అగ్నిపరీక్షకైనా నిలుస్తాను
శక్తితో పెల్లుబుకుతూ, పార్టీ నా మీద
వుంచిన విశ్వాసానికి అర్హుణ్ణవుతాను
ప్రపంచంలోని ఏ కష్టమూ
కమ్యూనిస్టును భయపెట్టజాలదు.

శత్రువును స్థిరంగా, పర్వతంలా నిశ్చలంగా ఎదుర్కొంటాను

(లియు–హో పాట)

శత్రువు పంపిన ఆహ్వానంలో
విషంపూసిన బాణం దాగివున్నది
తుఫాను అకస్మాత్తుగా బద్దలయిందంటే
అంతదాకా ఎక్కడో అది దాగున్నదనే అర్థం
కత్తులమధ్య గొడ్డళ్ళ మధ్య ఏర్పాటుచేసిన
అతని విందుపట్ల
గుండెల్లోని విప్లవ నైతికశక్తితో నవ్వుతాను
శత్రువును
స్థిరంగా, పర్వతంలా నిశ్చలంగా ఎదుర్కొంటాను.

పార్టీ నన్ను ఉక్కుమనిషిగా తీర్చిదిద్దింది
(లియు-హో పాట)

పార్టీ నన్ను ఉక్కుమనిషిగా తీర్చిదిద్దింది
నేను శత్రువుతో పోరాడుతాను
వానికెప్పుడూ పట్టుచిక్కకుండా చేస్తాను.
నా శరీరంలోని ఎముకలన్నీ విరిగినా
నాకు భయం లేదు
నా నిర్బంధంలో నేలకు కరుచుకుపోయేట్టు
నన్ను బంధించినా నాకు భయంలేదు
నా దేశం నాశనమయిపోతుంటే చూడలేక
నా గుండెనెత్తుర్లు చిందుతున్నది
నా ప్రజల కష్టాలు చూడలేక
నేను ఆగ్రహంతో మండిపోతున్నాను
విప్లవపథం ఎంత కఠినమైందయినా సరే
మృతవీరుల అడుగుల్లో మునుముందుకెపోదాం.
నేనివ్వాళే చచ్చినా నా విచారమల్లా ఒక్కటే–
నా శత్రువుతో ఇంకా నా 'లెక్క' తేల్చుకోలేదన్నది.
కోట్లాది నా దేశప్రజలను కష్టాలనుంచి
కాపాడడానికే గరుత్మంతునిలా రెక్కలు విచ్చుకొని
ఆకాశంలోకి ఎగరాలని
పర్వత శిఖరాగ్రాలమీద వీచే స్వేచ్ఛా
పవనాలమీద జన్మించాలని నా ఆకాంక్ష
అప్పుడు విప్లవంకోసం ఎంత ఆనందంగా మరణిస్తాను!

నా సంకల్పం స్వర్గాలను ఊపేస్తుంది
(లియు-హో పాట)

జైలరువేసిన రక్తదాహం కేకకు
నేను నా నిర్బంధపు అరనుంచి ముందుకు వచ్చాను.
బరువైన గొలుసులు నా చేతులనూ కాళ్ళనూ బంధించినా
స్వర్గాలను సైతం తుఫానులతో ఊపే నా సంకల్పాన్ని
అవి బంధించలేవు.

దుర్మార్గుడు హటోయామా నానుంచి
రహస్యం లాగడానికి నన్ను అన్నిహింసలకూ గురిచేసాడు
నా ఎముకలు విరిగిపోయినవి. శరీరం చీలికలయింది
కాని నా పట్టుదలమాత్రం ఎప్పటికన్నా గట్టిపడ్డది.
వధ్యశాలకు ధైర్యంగా నడుస్తూ దూరంగా చూసాను-
విప్లవ అరుణపతాకం ఉన్నతంగా ఎగురుతున్నది.
పోరాటాగ్నులు ఎంతో దూరం, ఎంతో విశాలంగా పరుచుకున్నవి
తుఫాను గడిచిపోయిందంటే పువ్వులుపూస్తాయి
నవచైనా ఉదయసూర్యునివలె ప్రకాశిస్తుంది
దేశమంతటా ఎర్రజెండా ఎగురుతుంది
—ఈ ఆలోచనలతో నా విశ్వాసం మరింత పెరిగిపోయింది
నా నిర్ణయం మరింత బలపడ్డది
నా పార్టీకోసం నేను చాల తక్కువ సేవ చేసాను
పర్వతాల్లోకి రహస్యం అందించలేక
పోయానన్న విచారం నన్ను వేదిస్తున్నది
నా తల్లీ కూతురూ ఉక్కుకన్న స్థిరమయినవారు
శత్రువు ఆకాశాన్నీ భూమినీ తలకిందులు చేసైనా
నా నుంచి రహస్యాన్ని మాత్రం పొందలేడు
విప్లవ కారులు ప్రపంచంలో దేనికీ భయపడరు
వాళ్ళు ఎప్పటికీ మునుముందుకు సాగుతూనే వుంటారు.

నేను వాళ్ళవలె కావాలి

(టీహ్-మి పాట)

నాయనమ్మ నాకు ఎర్రలాంతరుకథ చెప్పింది
మాటలు కొంచెమే, కాని లోతయిన అర్థం
నా తండ్రి చిన్నాయనా ప్రమాదం అంటే ఎందుకు భయపడలేదు ?
శత్రువులను ఓడించి
పేదవాళ్ళను రక్షించి
చైనాను కాపాడాలనుకున్నరు గనుక
నేను వాళ్ళవలె పనిచేయాలని తెలుసుకున్నాను
వాళ్ళవంటి మనిషిని కావాలి.
నాకు పదిహేడేళ్లు – పసికూననేమీకాను
నా తండ్రి ఆలోచనలను నేను పంచుకోవాలి
ఆయన వెయ్యి పౌనుల బరువును మోస్తుంటే
నేను ఎనిమిదివందలైనా మోయాలి.

నా హృదయంలో కసీ కోపమూ మొలకెత్తుతాయి
(టిహ్-మి పాట)

శత్రువు గురించి ఆలోచించినపుడు
నేను కోపంతో వివశుణ్ణవుతాను
నా కోపాన్ని అణచుకుంటూ పండ్లుకొరుకుతాను
రహస్యాన్ని గుంజడానికి ఎన్నో
ఉపాయాలుచేసి శత్రువు నా ముసలిఅవ్వనూ
తండ్రినీ చంపాడు
నా కసిని నేను కొరుక్కుంటూ, నా కోపాన్ని
నములుకుంటూ బలవంతంగా గొంతులోకి
నెట్టుకుంటున్నాను.
అవి నా హృదయంలో మొలకెత్తినదు
నేనెన్నటికీ లొంగిపోను
నేనెన్నటికీ వెనుకడుగువేయను
ఏ కన్నీళ్ళూ నా చెక్కిళ్ళను తడుపలేవు
అవి నా హృదయంలోకి ప్రవహించి
అక్కడ విత్తిన కసిని పోషించనీ
ఈ చీకటి శక్తుల సామ్రాజ్యాన్ని
ఉవ్వెత్తునలేచే కోపాగ్నులు కాల్చివేస్తాయి.
నేను సంసిద్ధంగావున్నాను
నన్ను అరెస్టు చేయండి. వదలండి
బెత్తాలతో కొట్టండి. తాళాలుపెట్టి బంధించండి
సంకెళ్లు వేయండి, ఎముకలు విరగ్గొట్టండి
నానుంచి రహస్యాన్ని మాత్రం పొందలేరు.

నీ తండ్రి నుంచి నిజాయితీని, సాహసాన్ని,
ఉక్కు సంకల్పాన్ని నేర్చుకో
(నాయనమ్మ లీ పాట)

పదిహేడు తుఫాను సంవత్సరాలు
నేను మౌనంగా వున్నాను
ఎన్నోసార్లు చెప్పాలనుకున్నాను
కాని సత్యం చెప్పడానికి
నువ్వింకా పసివాడివని భయపడ్డాను

బహుశా నీ తండ్రి యింక తిరిగిరాడు
నాయనమ్మనుకూడ జెయిల్లో పెట్టవచ్చు
అపుడు, విప్లవ గురుతర బాధ్యత
నీ భుజాలమీదనే పడుతుంది.
ఈ నిజం నీకు చెప్పినపుడు, హై-మీ
అరవకు, అదిరిపడకు
ధైర్యంగా స్థిరంగా వుండు
నీ తండ్రినుంచి అతని నిజాయితీని
సాహసాన్ని ఉక్కు సంకల్పాన్ని నేర్చుకో.

రక్తం రుణాన్ని రక్తంతోనే చెల్లించాలి

(నాయనమ్మ లీ పాట)

సమ్మెలో ఆ రాక్షసులు నీ తండ్రినీ తల్లినీ చంపేరు
లియు-హో విశ్రాంతిలేకుండా విప్లవంకోసం పనిచేసాడు
ఎర్రలాంతరు ఎప్పటికీ వెలుగుతూ ఉండాలని
మృతవీరుల అడుగుజాడల్లో నడుస్తానని శపథంచేసాడు
తన గాయాలను అదిమిపట్టి, మృతవీరుల పాతిపెట్టి
పోరాడుతూ పోయాడు
శత్రువులు గృహదహనాలు, హత్యలు, దోపిడీలు
చేస్తున్నారు
మా కళ్ళముందరే నీ తండ్రిని జైలుకు తీసుకపోయారు
ఈ రక్తానికి, కన్నీళ్ళకు యివ్వాల్సిన జవాబును
జ్ఞాపకం వుంచుకో
ధైర్యంగా వుండు
శత్రువుతో తేల్చుకోవాల్సిన లెక్కలను నిశ్చయించుకో
రక్తరుణాన్ని రక్తంతోనే చెల్లించాలి.

సమీక్షలు :

సాహిత్య మొర్మొరాలు

"ఈ వ్యాసాలు పండితులకోసం వ్రాసినవికావు. పూర్వకవుల పరిచయం బాగ వున్న పాఠకుల కోసం వ్రాసినవికావు. ప్రబంధాలకు, ప్రబంధకవులకూ కొంచెందూర మున్నవారికోసమే వ్రాశాను.

కాలాన్నిబట్టి, సంపర్కాలనుబట్టి మనవారి అభిరుచులూ అభిప్రాయాలూ మారుతున్నాయి. చూస్తూవుంటే మరికొన్నేళ్ళలో ఈ కవులపేర్లూ కావ్యాలూ అన్నీ విస్మృతిలో పడిపోతాయనిపిస్తూంది. అలా జరగటం మంచిదికాదన్న అభిప్రాయం కొందరితోపాటు నాకూవుంది. మరి నాలుగునాళ్ళయినా వాటి జ్ఞాపకం నిలపటానికి ప్రయత్నం చేయాలనే నా సంకల్పం" అంటూ తన రచనా వుద్దేశ్యాన్ని ధర్మారావుగారు చెప్పారు.

తాపీ ధర్మారావును గురించి ఆంధ్ర పాఠకులకంతగా పరిచయం అక్కర్లేదు. ఆయన జగమెరిగిన బ్రాహ్మణుడు. పురాణ, ప్రబంధ కవిత్వాలను వాటి లోతుపాతులను క్షుణ్ణంగా జీర్ణంచేసుకొని, అధునాతన అభిరుచులనుకూడా అర్థంచేసుకోయత్నించిన వారిలో ధర్మారావుగారొకరు. అందుకే ప్రబంధ సారస్వతానికి సంబంధించిన చిన్న చిన్న విషయాలనేరుకొని, నవతరంవారు వినోదంగానూ, తేలికగానూ చదువుకో వీలు కల్గేట్లు, రవంత విమర్శన, కొంత పదవ్యాఖ్యానమూ, కొంత కవుల తారతమ్యమూ రుచిచూపించేందుకు ప్రయత్నించారు. సులభపదజాలంతో, మెచ్చుతున్నారో, గిచ్చుతున్నారో తెలియనంత సున్నితంగా చెప్పుకపోయిన వ్యాససంపుటి ఇది.

పరనింద, ఆత్మస్తుతి పూర్వకవుల్లో ఏ విధంగా అంటురోగంగా మారిందో చక్కగా వివరించారు. మ్యూచువల్ ఎడ్మిరేషన్ సమాజాలుపెట్టుకొని, ఇదిగో నేతిబొట్టు అంటే అదిగో మజ్జిగచుక్క అంటూ, అరుగుమీద కూర్చున్న మూడున్నర మనుష్యుల నిండుమహాసభల్లో రాజులూ, కవులూ ఒకరికొకరు పోటీపడి, బిరుదప్రదానాలు ప్రసాదించుకున్నతీరు బాగ విమర్శించారు. పూలబజార్లలో, సూర్యోదయంలోనే కాక, వేటలో, యుద్ధరంగంలోసైతం విచక్షణారహితంగా శృంగారరసం వొలికించిన తీరు, వ్యభిచారగృహాలముందు పండితులు తమ తమ పాండిత్యాలను ప్రదర్శించిన పద్ధతులూ, ఇంద్రప్రస్థ పురాన్ని గురించిన వర్ణనలో తంజావూరు తాంబూలతోటల్ని వర్ణించిన విధానాలను ధర్మారావుగారు పసందైన పదజాలంతో అతిచమత్కారంగా పాఠకులకందించారు. బాణుడులాంటివారు ఎంగిలిచేసి వదిలేసిన వర్ణనలనే అప్పకవులూ, గొప్పకవులూ రైలుపట్టాల్లో బిగించి వుంచటాన్నికూడ చక్కగా బహిరంగంచేశారు.

ఐతే మధ్యమధ్యలో ధర్మారావుగారు పాఠకులకువేసిన కొన్ని ప్రశ్నలు. రుచి చూపించిన కొన్ని సమస్యలు అందరికీ అర్థమౌతాయా ? ముఖ్యంగ ప్రబంధ సాహిత్యానికి దూరంగ వున్నవారికెంతవరకు అవగతమౌతాయనేది సందేహం.

భట్టుమూర్తిగారి నాయిక ముఖం పూర్ణచంద్రునిలా వున్నదల్లా. క్రిందిచరణంలో కొచ్చేప్పటికి పద్మంలా మారిపోయిందేమిటి ? ఈ మార్పుకు కారణం మతిమరుపా ? మరేమిటి ? అని ప్రశ్నించారు. ఇలాగే కొన్నిచోట్ల వారెత్తి చూపించిన అర్థనిగూఢత్వం, పదలాలిత్యం, సరసంలోని సొగసు, భావగాంభీర్యత, తాంబూల సేవలు, కుకవినిందలు నేటి యువతరం జ్ఞాపకం వుంచుకోవలసిన విషయాలేనా అన్పిస్తుంది. చంద్రగ్రహపు లోతుల్ని కొలుస్తున్న నేటి యువకులు, తారాశశాంక వర్ణనలతో తృప్తిచెందగలరా ? చంద్రుడనే భావం యొక్క, పునాదిలోనే మార్పుజరిగిపోయింది, కనుక తృప్తిపొందలేరు.

మరొక ప్రధాన విషయమేమంటే. ప్రబంధకవులు తమను [ప్రజలు నాలుగు నాళ్లయినా గుర్తుంచుకోవాలని ఆలోచించారా ? అలా గుర్తుంచుకోవలసిన విషయాలేమైనా ముందుతరంవారి కందించారా ? వీరిని పరిశీలించిచూదాం—

రాజశేఖరుని 'కావ్యమీమాంస' చదివినతర్వాత ఆకాలపు కళాకారులు, పండితులు ఇతర రాజపోషకులగురించి మనకు కన్పించే పటం ఇది.

ఒక సుందరభవనం, రుతువులకనుగుణమైన సకల సౌకర్యాలతో— పండిత గోష్ఠులు, పడకగదులు, విలాస విహారాలు విడివిడిగా— చుట్టు పెద్దపూలతోట, మల్లెలు సంపెంగల, రకరకాల లతలు, చిన్న పెద్ద చెట్లతో— ఒక సహజమైన చిన్నకొండ, చుట్టు పండ్ల చెట్లు— ముద్దు ముద్దు పక్షులు— పూలతో నిర్మించిన వూయెలలు— ఈత కొలనులు—

ఆ వుద్యానవనంమధ్యలో— గిరిజాలజుట్టు, పట్టుపీతాంబరాలు, మకరకుండలాలు, గండపెండేరాలు మెరుస్తున్న పండితుడు, తాంబూలం నములుతూ, కైదండవాసన చూస్తూ, కోయిలకూతలువింటూ, అలాఅలా ఆనందమేఘాల్లో తేలిఆడుతూవుంటాడు.

రాజశేఖరుడు వదిలేసిన అసలు విషయమేమంటే— అతని కొంతమందిభార్యలు అనేకమంది దాసదాసీలు— పాడియావులు— ధన, కనక వస్తువాహనాదులు.

వీరే రాజపండితులు— అడిగినసీమల్లో అగ్రహారాలుపొంది— రాజులచేత పల్లకీలు మోయించుకొని, గండపెండేరీలు తొడిగించుకొని— ధనధాన్యాలకు కొదువ ఎరుగని భూస్వామ్యయుగపు అగ్రహారస్వాములు— అష్టదిగ్గజాలంటే వీరే— వీరు లక్ష్మిప్రియులు మాత్రమేకారు— వాణీ భర్తలు— నాటి సాహిత్య గుత్తదార్లు— కవితా పితామహులు—

ప్రబంధ కావ్యకన్యల కృతికర్తలు- శ్లేషార్థాలు, ద్వంద్వార్థాల సృష్టికర్తలు, నిత్యమృష్టాన్నాలతో అష్టైశ్వర్యాల అధిపతులు. నన్నన్నంతప్ప మరేమి ముట్టనని శ్రీనాధుడు చెప్పాడు. నాకేకాదు, నా భార్యకుసైతం తాంబూలసేవకు ప్రత్యేక నౌకర్లున్నారని అల్లసాని పెద్దనగారు కలవిచ్చారు.

ఈ పండితులు తీరుబడిగసృష్టించిన కావ్యకన్యల భర్తలెవరు ? ఈఅష్టైశ్వర్యాల అనుభవ హక్కుల్ని ప్రసాదించిన రాజులు, రాణులు, రాకుమారులు, ఇతరప్రభువులు- 4 వ శతాబ్దపు కోమటిరాజులనుండి 17 వ శతాబ్దపు నాయకరాజులవరకు- పండితులు, రాజులు ఒకరినొకరు పోటీపడి ఎందుకు పొగుడుకున్నారో, బిరుదప్రదానాలకు మూలం స్పష్టపడిందనుకుంటాను. భౌతిక సంపదలు పుచ్చుకుని, మేధోసంపద నమ్ముకున్నవారే మహాపండితులు ఒక పోతననో, వేమననో చూపించి ఈ చారిత్రక చుట్టరికాన్ని రద్దు చేయలేరు.

రెడ్డిరాజులు ఓడిపోయిన అనంతరం వారు పోషించిన పండితుల స్థితిగతుల్ని గురించి శ్రీనాధుడు మనకు చెప్పాడు. విజయనగరరాజులు మారిపోయినపుడు వారి పండితవర్గం తంజావూరుకు తరలిపోయింది- ఎన్ని వుదాహరణలు కావాలి ? ఒకనాటి చారిత్రిక సత్యానికి.

యంత్రియుగం వచ్చింది- దాన్ని తరుముకుంటూ అణుయుగంకూడ ప్రవేశించింది- శాస్త్రజ్ఞానపు హడావిడిలో భూస్వామ్యయుగపు సాహిత్య సంపదనుగురించి జనం మర్చిపోతున్న మాటనిజం- అది సహజంకూడా-

వద్దు. మర్చిపోవద్దు. అది మంచికాదంటున్నారు ధర్మారావుగారు. పాతసారాయినే కొత్తసీసాలో రుచిచూడమంటున్నారు.

తార-వరూధిని వాంఛల్లోని వ్యత్యాసాలను వివరిస్తూ ధర్మారావుగారుకూడ ఉచ్చ, నీచ భేదాల సుడిగుండంలో యిరుక్కున్నారు. "మగడంటే ఎవరు ? కంటికింపగు నతడెవ్వడో అతడే మగండు"అన్న తారది, హృదయ ప్రేమఅనిన్నీ, వరూధినిది కేవలం శారీరక ప్రేమ అన్నారు- తార గొప్ప రిషిభార్య కావడం, వరూధిని కులగోత్రాలులేని 'మర్త్యకాంత'కావడమే ఈ భేదానికి మూలం- లేనిఎడల, వరూధినికుచాలు 'కొండరాళ్ళు, బండరాళ్ళు- (విచ్చుగబ్బి చనుమిట్టలు)గా వర్ణించడాన్ని ధర్మారావుగారు నిరసించలేదు- కన్పించిన కన్యలందరికి వేదపండితులు తీరుహృదయాల నందివ్వరాదు. దాసదాసీలనుపయోగించుకున్నట్లుపయోగించుకొని వదిలేయండి"అన్న పెద్దనగారి సందేశాన్ని ధర్మారావుగారు మెచ్చటం అంటే, పాతసారాయిని కొత్తసీసాలో పోయడమే ఔతుంది- కాలమార్పుకు తగింది కాదు.

సత్యభామ-రాధ, కైక-కౌసల్యలనుపోల్చి, స్త్రీలను నీచంగా చిత్రించే భూస్వామ్యయుగపు మనస్తత్వాన్ని, తాపీవారు నిరసించటానికిబదులు సమర్థించారు. 'సత్యభామ కృష్ణునితన్నలేదు- కాలితో నెట్టేసిందనీ, పిల్లా చెండ్లుచూపిస్తావా ? తమ్ముల జూపవే తరుణీ! ఇత్యాది సరసాలు తెలుగు సారస్వతపు అదృష్టం అనీ అన్నారు. పై కులాలవారు ఏడిస్తే కోకిలస్వరంలా మెత్తగా విన్పించటం, మామూలువాళ్లు ఏడిస్తే గాడిదస్వరంలా వర్ణించటం వర్గదృష్టికాక మరేమౌతుంది ?

ధర్మారావుగారు "సారస్వతంలో స్వాతంత్ర్యం" గురించి మాట్లాడుతూ "మన ఆంధ్రకవుల్లో చాలమందికి కథలో స్వాతంత్ర్యంలేదు. భావంలోలేదు. భాషలోలేదు. స్వాతంత్ర్యం అంటే ఏమిటో ఆంధ్రకవులకు తెలుసునా అన్నంతవరకు సందేహం సాగుతుంది" అన్నారు. భావాలన్నీ సంస్కృతంనుండి ఎరువుతెచ్చుకోవడంవల్ల, పాతవారు ఎంగిలిచేసి వదలిన వర్ణనలనే కొత్తవారు బట్టీపట్టడంవల్ల, వీటికితోడు, అప్పకవులూ, గొప్పకవులూ రైలుపట్టాలు బిగించి వుంచడంవల్ల- ఆంధ్రకవులందరూ ఆ గీటుల్లోనే మెలగాల్సి వచ్చిందన్నారు. ఐనా రామరాజభూషణుడు, ముక్కుతిమ్మన, చేమకూరలాంటికవులు అద్భుతమైన కొత్తకల్పనలుచేసి చక్కని ఒరిజినాలిటీ ప్రదర్శించారనికూడ అన్నారు.

ఇచట తాపీవారు సారస్వతంలో స్వాతంత్ర్యం అనేదాన్ని వ్యక్తుల బుర్రల్లో చూస్తున్నారు- ప్రవరాఖ్యునికాళ్ళకు పసరుపూసి, హిమాలయాలకుకాక తనఅగ్రహారానికి పంపి, ఒక పల్లెపడుచును ఆ బ్రహ్మచారిపై పడేసినట్లయితే, పెద్దనగారి పెద్దరికంనిల్చి వుండేదని వాదించగలరా ? ఎద్దులపేరుపలికితేనే శూద్రకవిత్వమైనట్లు, పల్లెపడుచుల్ని ప్రస్తావిస్తే "అదిగానట బీసట" కవిత్వమై కూర్చుండేది.

"ఎవ్వరేమైనయంద్రు నాకేమికొదువ" అన్న శ్రీనాధునికంటే వ్యక్తిగతంగా స్వేచ్ఛాజీవి మరొకరు లేరేమో ? రెడ్డిరాజుల్నేకాదు, విజయనగర సాహిత్యరాజుల్ని కూడ దబాయించి బతికాడు- తన పోషకులు ఓడిపోయేప్పటికి శ్రీనాధుని స్వేచ్ఛ ఏమైపోయింది ? కవి కౌలుదారుగా మారిపోయి గండపెండేరేలు కుదువబెట్టాల్సివచ్చిందని, ఆ కవిసార్వభౌముడే చెప్పాడు. విజయనగర సామ్రాజ్యపతనానికి, కవిత్వం నీరసించటానికివున్న సంబంధం వ్యక్తిగతమా ? కాదు. చారిత్రకం. అప్పకవులూ, గొప్పకవులుగా గుర్తించబడ్డవారందరూ వారికాలపు భూస్వామ్య ఆర్థిక విధానాన్ని బలపర్చే సరిహద్దుల్లో పిల్లిమొగ్గలు వేసినంతమేరకే వారి స్వేచ్ఛ. కవిత్రయంలోని వైదిక మతాభిమానమూ, పోతనలోని భక్తి, శ్రీనాధునిలోని శృంగారతత్వం, చేమకూర సొంపు, ఇవన్నీ భూస్వామ్యయుగపు సామాజికదోపిడీకి అవసరమైన లక్షణాలు- ఇవే

మహాప్రబంధానికుండవలసిన లక్షణాలు– ఆ హద్దుల్లోని పండితులకే అగ్రహారాలు, సుందర భవనాల భిక్ష– ఎంగిలివర్ణనల అవసరం ఎందుకో దీన్నిబట్టి అర్థంకాగలదనుకుంటాను.

ధర్మారావుగారి మరొక సూత్రీకరణకూడ విచారించతగ్గదిగా వుంది. "ప్రతి భాషావాఙ్మయంలోనూ, అపుడపుడు జ్యోతిర్మూర్తులైన కవీశ్వరులు దేదీప్యమానంగా వెలిగి, ఆరిపోతూంటారనీ. ఆ వెలిగేపుడతడే విప్లవమూర్తి అభ్యుదయకవి అవుతాడని అతడారిపోంగనే మరొకరు విప్లవం తీసుకరాకమానరవి, ఇది సాహిత్యానికి ముఖ్య లక్షణమనీ అన్నారు. దీనికి రుజువుగా పురాణయుగంలో కవిత్రయం జ్యోతిర్మూర్తులై వెలగగా ప్రబంధయుగంలో శ్రీనాధుడు కాగడాపట్టాడని, అతడారిపోయిన అనంతరం రామరాజభూషణుడు ప్రబంధయుగానికొక కొత్తవెలుగు ప్రసాదించాడనీ ఆఖరుకు, విజయనగర సామ్రాజ్యపతనంతో కవితా నీరసత్వం ప్రవేశించిందనీ, అంతలో తంజాపూరులో రఘునాధ, చేమకూర కవులజంట ఆంధ్రజ్యోతిని వెలిగించిందనీ అన్నారు.

ఇచటకూడ తాపీవారి దృష్టి వ్యక్తిగతమే. ఎవరు ఎప్పటికి పేరులోవుంటే వారే ఆనాటి విప్లవకవి. అభ్యుదయకవి అనికూడ అన్నారు.

తెలుగు సాహిత్యాన్ని ముఖ్యంగా ప్రబంధలక్షణాలను రైలుపట్టాలమధ్య బిగించివేశారనీ, వర్గచట్రంలోకి కుదించివేయబడిందనీ, అందుచే తెలుగు సాహిత్యంలో స్వాతంత్ర్యంలేదనీ వారే ముందుచెప్పారు. ఐనపుడు తాపీవారి విప్లవకవిగాని, అభ్యుదయవాదిగాని ఎవరు ? 17వ శతాబ్దం మొ॥ 20వ శతాబ్దంవరకు వెలిగి ఆరిన జ్యోతిర్మూర్తులెవరు ? అనే విషయంపై తాపీవారి ఆలోచన తెలిపివుంటే మనకు పూర్తిగా అర్థమైవుండేది– భూస్వామ్యయుగం అంతంతో వారుసూచించిన జ్యోతులు మరల వెలగలేదని తెలిసిపోయేది. ఇది కేవలం ఒక వర్గానికి సంబంధించిన సూత్రీకరణే. అందుచేదానిలో అభ్యుదయం ప్రశ్నే పుట్టదు. దర్జా, దర్పం, అహం, శృంగారం, సానికొంపల సాహిత్యాన్ని వదలి, సరైనదృక్పథం కలవారికి, ప్రేమ, దయ, సహకారం, ఐక్యత, మానవత్వంతోకూడిన సామాన్యుల సాహిత్యంలో మాత్రమే అభ్యుదయం, విప్లవం కన్పిస్తుంది.

– ఎస్. వి. రావు

సామ్రాజ్యవాదం : పెట్టుబడిదారీ విధానపు అత్యున్నతదశ

— లెనిన్

[22 ఏప్రిల్ లెనిన్ జయంతి. ఈనాడు మన పాఠకులు లెనిన్ రాసిన 'సామ్రాజ్యవాదము - పెట్టుబడిదారీ విధానపు అత్యున్నతదశ' అనే పుస్తకాన్ని మళ్ళీ మళ్ళీ అధ్యయనం చేయవలసిన ఆవశ్యకతను దృష్టిలోపెట్టుకొని యీ వ్యాసాన్ని ప్రత్యేకంగా ఈ సందర్భంగా ప్రచురిస్తున్నాం.]

ప్రపంచంలోకి మానవుడు అవతరించిననాటినుంచీ, అతడు తన అవసరాలకు గానూ చేసే శ్రమవిధానానికీ, అతడి సమాజం నిర్మాణం కావటానికీ, ఆ సమాజం తనుతాను పాలించుకునే నియమాలు రూపొందటానికీ విడరాని సంబంధంవుంటూ వస్తున్నది. మానవులు వేటాడటమూ, ఆహారాన్ని ఏరుకోవటమూ చేసే దశలో చిన్నచిన్న ముఠాలుగా జీవిస్తూ, సంచారజీవితం గడిపారు. అప్పట్లో వారి సాధనాలూ, ఆయుధాలూ, పరికరాలూ వ్యక్తిపరంగా వుండేవి. వారి 'సంపద' మాత్రం సమిష్టిగావుండేది. ఆ చిన్న సంఘాలలో ప్రతి ఒక్కరూ తమ పరికరాలను (రాళ్ళనుంచి) తామే తయారు చేసుకునేవారు. (అందుకే పరిశోధకులకు రాతిపనిముట్లు లక్షలసంఖ్యలో లభ్యమవుతున్నప్పటికీ వాటిని తయారుచేసిన వ్యక్తుల అవశేషాలు సంపాదించటం గగనంగా ఉంటున్నది.) అయితే ఎవడు ఏ జంతువును కొట్టినా, ఎవరు దుంపలనూ, కాయలనూ ఏరినా అందరూకలిసి అనుభవించేవారు. పెద్దఎత్తున వేటాడటానికి- ముఖ్యంగా జడల ఏనుగులమందలనూ, అడవి గుర్రాలమందలనూ, భయంకరమైన గుహాభల్లూకాలనూ వేటాడటానికి— చిన్నచిన్న ముఠాలు ఏకమై, సహకారపద్ధతి అవలంబించేవి. అది ఆదిమ సమసమాజం.

తరవాత పశుపోషణా. వ్యవసాయమూ వచ్చి, మనుషులు సంచారజీవితానికి స్వస్తి చెప్పి, స్థిరనివాసాలు ఏర్పాటుచేసుకుని, గణజీవితాలు ప్రారంభించారు. కొన్ని కొత్త సాంఘిక ఆచారాలూ, పెళ్లివగైరాలకు సంబంధించిన నియమాలూ, వ్యవసాయానికి సంబంధించిన సమిష్టి తంతులూ అమలులోకి వచ్చాయి. కొంతకాలంపాటు స్త్రీలకు పూర్వంలేని ఆధిక్యత వచ్చింది. స్త్రీల "వ్రతాలు" అమలులోకి వచ్చాయి. (ఈనాడు మనవాళ్లు యీ వ్రతాలను మార్పుచేసి పాటిస్తున్నా, ఆ కాలానివి యీనాడు చాలా అనాగరికంగా కనిపిస్తాయి.) సాంఘిక 'పరిపాలన'లో అందరూ పాల్గొనేవారు. వాళ్లు అప్పుడప్పుడూ ఒక నాయకుణ్ణికూడా ఎన్నుకునేవారు.

ఇప్పుడు మనం మానవ సమాజ పరిణామదశల వివరాలలోకి పోనవసరంలేదు. గమనించవలసింది ఏమంటే, ఉత్పత్తిసాధనాలలో ఒక మౌలికమైన పరిణామం కలిగినప్పుడల్లా సామాజికవ్యవస్థలో విప్లవపరిణామాలు కలిగాయి. ఆ సమాజాల నిర్వహణ (పరిపాలన)లోకూడా అతి విచిత్రమైన మార్పులు వచ్చాయి. "సామాజిక విలువలు" అనేకమార్లు తారుమారయాయి. తలకిందులయాయి. ఉదాహరణకు స్త్రీస్వామ్యంపోయి పురుషస్వామ్యం వచ్చింది. మనుషులమధ్య సమానతనశించి అసమానతలు ఏర్పడ్డాయి. జాతులమధ్యవుండే వైరాలు జాతులలోకలిగే, వర్గపీడనరూపంలో, ప్రవేశించాయి. ఈ వర్గపీడనా, దోపిడీ వీలయినంత 'శాంతంగా' కొనసాగటానికి చిత్రవిచిత్రమైన మతాలు పుట్టుకొచ్చాయి. ఒకప్పుడు 'సంస్కృతి' (కల్చర్) అనేది కేవలము మనుష్యులు సంపదను సృష్టించటానికి ఉపయోగించే సాధనాలకూ, వాటితో సృష్టిఅయ్యే సంపదకూ పరిమితమై వుండేది. రాను రాను అదే మనుషులు అసమ-దోపిడీ-వర్గ సమాజంలో సృష్టించే విశ్వాసాలకూ, ఆచారాలకూ, కళలకూ విస్తరించింది. పల్లెలు (ఒకప్పుడు ఆటవికుల గూడెములు)గ్రామాలుగా మారాయి; వ్యాపారవస్తూత్పత్తి విస్తరించటంలో పట్టణాలు(సముద్రతీరపు రేవులు), నగరాలు (వర్తక కేంద్రాలు) పుట్టుకొచ్చాయి; నాగరికత అన్నది సంపన్నుల జీవితాల ఉచ్చదశను సూచించటానికి పుట్టింది. చిత్రమేమంటే నాగరికతకూ, సంస్కృతికీ మధ్య గండి ఏర్పడింది— ఏమాత్రమూ సంస్కారంలేని పశుప్రాయులు నాకరికతతో ఓలలాడగలగటం మనం కళ్లారా చూస్తున్నాం; నాటకాలలో చిత్రిస్తున్నాం :

మనిషి తన అవసరాలకు మించి పదిమందికి సరిపడే సంపదను సృష్టించే ఆర్థిక వ్యవస్థ చరిత్ర పూర్వయుగంలోనే ఏర్పడింది. సమాజాన్ని శాసించగలవర్గాలు శ్రామిక వర్గాన్ని, సంపదను సృష్టించటానికి నియోగించి, తాము ఐశ్వర్యంలోనూ, ఐహిక భోగభాగ్యాలలోనూ ఓలలాడాయి. మనుషులను బానిసత్వంలో ఉంచాయి. బానిసల గిరాకీ గ్రహించి కొందరు బానిస వర్తకులుగా తయారయి అంతులేనిధనం సంపాదించారు ఒకనాటి పశుపోషణస్థానంలో మనిషి పోషణ వచ్చింది. అరేబియన్ నైట్స్ కథలలో ఖలీఫాల సంపదనూ, వర్తకశ్రేష్ఠుల సంపదనూ, జాతక కథలలో వర్తకశ్రేష్ఠుల సంపదనూ, మార్కోపోలో వర్ణించిన కుబ్లాయిఖాన్ సంపదనూ ఊహిస్తే దిగ్భ్రాంతి కలుగుతుంది. కాని ఆ కాలంలో అత్యధిక సంఖ్యాకులు దుర్భర కృత్రిమ దారిద్ర్యానికి గురిఅయారు.

సామాజిక పరిస్థితిలో విప్లవకరమైన మార్పులు తెచ్చినది పారిశ్రామిక యుగం, యంత్రనిర్మాణం, పెట్టుబడిదారీ విధానం. పారిశ్రామిక విప్లవానికిముందుకూడా వ్యాపారసరుకులూ, పెట్టుబడీ, యంత్రాలూ ఉండేవి. కాని కొత్తగా వచ్చిన యంత్రాలు

శక్తిచోదితయంత్రాలు. ఈ యంత్రాలు రాకపూర్వం వేరువేరు వృత్తులవాళ్లు, తమ ఉపకరణాలను తామే తయారుచేసుకునేవారు. లేదా సొంతం చేసుకునేవాళ్లు. కాని ఈ యంత్రాలు కార్మికుడు సొంతంగా సంపాదించగలవికావు. భారీ అయినవి. సాంకేతిక ప్రావీణ్యంతో కూడుకున్నవి. వాటిని ఎలా తయారుచేస్తారో కార్మికుడికి తెలియదు. వాటిని తయారుచేసే ఇంజనీర్లు సాటి కార్మికులుకారు, కార్మికవర్గానికి చెందినవారుకూడా కారు. ఆ యంత్రాలను నడిపేశక్తి — ఆవిరీ, విద్యుత్తూ వగైరా — యంత్రాలను మరింత క్లిష్టంచేసింది. కార్మికుడు ఆ యంత్రాలు ఎలా పనిచేస్తాయో, వాటిలో తన చేతులూ, కాళ్లూ పడి తెగిపోకుండా ఎలా జాగ్రత్తపడాలో తెలిసివుంటే చాలు. (అది లేకే యంత్రాలతో అసంఖ్యాకులు వికలాంగులుకావడమూ, బలికావటమూ జరుగుతూ వస్తున్నది.)

చేతివృత్తులతో వస్తువులు ఉత్పత్తి అయినకాలంలో పనివాడి నైపుణ్యానికి గణన ఉండేది. తాను ఏ వస్తువును తయారు చేస్తున్నదీ మొదటినుంచి చివరిదాకా వాడికి తెలుసును. కాని ఇప్పుడు నైపుణ్యం యంత్రంలోకి వెళ్ళిపోయింది. కార్మికుడికి తాను చేసే వస్తువు చివరి ఆకారంతో ప్రమేయం లేదు. వాడి పని ఆ వస్తువు నిర్మాణంలో ఒక దశకు మాత్రమే సంబంధించి ఉండవచ్చు. అది ఏ మోటారుకారులాటి పెద్ద వస్తువుకు చెందిన ఒక చిన్నభాగం కావచ్చు. ఆ చిన్నభాగంకూడా రెండుమూడుదశలు దాటితేగాని రూపుదాల్చదు. ఈ విధంగా ఉత్పత్తి అయే వస్తువుకూ, దాన్ని ఉత్పత్తి చేసే కార్మికుడికీ మధ్య పెద్ద గండిపడింది. ఉత్పత్తి ఆయిన సరుకు ఎక్కడికిపోతుందో, దానికి ఎంత ధర వస్తుందో కార్మికుడికి తెలీదు, పట్టదు.

అయినప్పుడు కార్మికుడు ఎందుకు పనిచేస్తాడు? వేతనంకోసం, ఆ వేతనం ఎలా నిర్ణయమవుతుంది? సమాజంలో వాడి స్థాయినిబట్టి వాడి శ్రమశక్తికి విలువకట్టి, పారిశ్రామికులు దాన్ని ఇతర విక్రయవస్తువులను కొన్నట్టే కొంటారు. ఈకారణంగా కార్మికుణ్ని సాధ్యమైనంత హీనస్థితిలో ఉంచటం పారిశ్రామిక సమాజానికి లాభకరం. కార్మికుడి శ్రమనుకొని, దాని సహాయంతో సరుకులు ఉత్పత్తిచెయ్యటంచేత పెట్టుబడిదారు — పారిశ్రామికుడికి "అదనపు విలువ" సరుకులమీద లభిస్తుంది. ఈ విషయాన్ని "కేపిటల్"లో మార్క్స్ రుజువుచేశాడు.

ఇందులో దురన్యాయమూ, దోపిడీ ఉన్నాయి. దీన్ని మొదట పారిశ్రామికులు ఆమోదించలేదుగాని, దాస్తే దాగనిసత్యం కనక, వాళ్లు కార్మిక సంఘాలనూ, తమ స్థాయి పెంచుకోవటానికి వారుజరిపే పోరాటాలనూ చట్టబద్ధంగా అనుమతించక తప్పలేదు. పారిశ్రామికంగా ముందుకువచ్చిన దేశాలలో కార్మికులు పోరాటాలద్వారా తమ స్థాయిని పెంచుకున్నారు.

ఇతరత్రా యంత్రయుగం సామాజికంగా చాలా మేలుచేసింది. వినియోగవస్తువుల సంఖ్యా, నాణ్యమూ అపారంగా పెరిగి, నాగరిక జీవితం శరవేగంతో ముందుకు పోసాగింది. రైళ్లూ, కార్లూ, విమానాలూ, తంతితపాలాలూ, రేడియోలూ రోగ నిదానపు క్రియలూ లాటివి అసంఖ్యాకంగా వచ్చి, ప్రజల సుఖ సౌభాగ్యాలకూ, దీర్ఘాయువుకూ, మనిషి జ్ఞానం అభివృద్ధి కావటానికీ ఎంతో దోహదం జరిగింది. భారీ పరిశ్రమలనూ, భారీ వ్యాపారాన్నీ పురస్కరించుకుని మహానగరాలు వెలిశాయి. అంతర్జాతీయ సంబంధాలు పెరిగాయి. ఈ నాగరికత మానవ జీవితంలో మూఢవిశ్వాసాలకు ఎక్కువ ఆస్కారంలేకుండా చేసింది.

కాని దీనికి రెండోపక్క పెట్టుబడిదారీఅన్నది అనేక వైరుధ్యాలను సృష్టించింది. అనేక జీవితపు విలువలను అస్తవ్యస్తంచేసింది. అనేక తీవ్రసమస్యలను తెచ్చిపెట్టింది. వాటికి పరిష్కారం కావలసివచ్చింది. ఒక్కముక్కలో చెప్పాలంటే, పెట్టుబడిదారీ తెచ్చిపెట్టిన అత్యంత తీవ్ర సమస్య సామ్రాజ్యవాదం. దానికి ఒకే ఒక పరిష్కారం శ్రామిక విప్లవం.

సామ్రాజ్యవాదమంటే యాదృచ్ఛికంగా కొన్ని దేశాలు అవలంబించిన ఒకానొక రాజకీయ విధానం కాదనీ, పెట్టుబడిదారీ తన అభివృద్ధిని పురస్కరించుకొని ఆ దశకు చేరుకున్నదనీ లెనిన్, రష్యాలో విప్లవం జరగకముందే, రుజువుచేస్తూ యీ గ్రంథం రచించాడు.

పెట్టుబడిదార్లు యంత్రాలను కొనగల ధనికులు. ఆరంభదశలో వాళ్లు తాము తలపెట్టిన ఉత్పత్తిశాఖలో సాంకేతిక ప్రావీణ్యంకలవారై కూడా వుండేవారు. ఉత్పత్తి "అరాజకంగా"సాగేది. ఎవరికి సాధ్యమైనంత విరివిగా వారు ఉత్పత్తులు తయారుచేసి మార్కెట్టుమీదికి ఎగదోసేవారు. ఒకరితో ఒకరు పోటీపడి సరుకులను సాధ్యమైనంత తక్కువ ధరలకు- అంటే కనీసలాభాలకు- అమ్మేవాళ్లు. (ఇది పెట్టుబడిదారీలోఉండే సుగుణంగా చెప్పుకోబడేది) అలాగే వస్తువుల నాణ్యంలోకూడా పోటాపోటీ ఉండేది. ఈ పోటీ ఒకరినిమించి ఒకరు తమ యంత్రపరికరాలను అభివృద్ధిచేసుకోవటంలోకూడ ఉండేది.

గతితార్కికదృష్టి లేనివాళ్లు భూతలస్వర్గానికి యంత్రాలు పునాదివేశాయని నమ్మారు. కాని యీ పోటీ తననుతానే నాశనం చేసుకుంటుందని జోస్యం చెప్పినవాడు మార్క్స్. కొంతవరకు మనం దీన్ని సులువుగానే గ్రహించవచ్చు. పోటీ అన్నతరవాత దుర్బలుడు ఓడిపోవటమూ, బలవంతుడు గెలవటమూ ఉంటుంది. పెట్టుబడిదారీ సంస్కృతిదృష్ట్యా బలవంతుడెవరు? ఎక్కువ పెట్టుబడిపెట్టి, ఎక్కువ భారీయంత్రాలు కొని, ఎక్కువ

మంది కార్మికులను నియోగించి, వారి శ్రమశక్తిని ఎక్కువగా దోచి బక్కవాళ్ళను దివాలా ఎత్తించగలవాడు: ప్రత్యర్థులు చితికిపోయినదాకా నష్టానికైనాసరే సరుకు లమ్మి, చితికిపోయిన పరిశ్రమలను కారు చౌకగా కొనేసి, వాటిని నడిపినవాళ్ళకు తన ఫ్యాక్టరీలలో ఉద్యోగాలు యియ్యగలవాడు! ఇది పెట్టుబడి కేంద్రీకరణకు దారితీస్తుంది; దారితీస్తుందనీ, కాలక్రమాన పారిశ్రామికసత్తా అంతా కొద్దిమంది గుత్త అవుతుందనీ మార్క్స్ చెప్పాడు.

ఇంతేకాదు, పెట్టుబడిదారీకింద వస్తూల్పణం జరిగి తీరుతుంది. ఉత్పత్తిలో ఉన్న అరాజకం వస్తువులను గిరాకీమించి తయారు చేస్తుంది. అవి అమ్ముడు కావు. ఆర్థిక మాంద్యం ఏర్పడుతుంది. ఫాక్టరీలు మూస్తారు. కార్మికులకు ఉద్యోగాలు ఊడుతాయి. వాళ్లు కఠోర దారిద్ర్యం పాతపడతారు. డిప్రెషన్. సరుకులన్నీ అమ్ముడయినదాకా ఈ డిప్రెషన్ కొనసాగుతుంది. తిరిగి పరిశ్రమలకు కదలికవస్తుంది. ఇలా పెట్టుబడిదారీకింద పగలూ, రాత్రిలాగా సామాజిక స్తంభనా, కదలికా ఉంటూ వస్తాయి.

అయితే దీనికి ఒక విరుగుడు ఉన్నది. ప్రపంచంలో పారిశ్రామికంగా వెనకబడి ఉన్న దేశాలు చాలాఉన్నాయి. వాటిని మార్కెట్లుగా చేసుకుంటే, దేశీయ గిరాకీని మించి వస్తుజాలాన్ని ఉత్పత్తిచేయవచ్చు. అలాటి దేశాలలో ముడిసరుకులు పుష్కలంగా దొరుకుతాయి. వాటిని తీసుకురావచ్చు ఇది వర్తకులతో కూడినపని. ఈ విధానాన్ని ముందుగా అవలంబించి, ఎక్కువ లాభం పొందినవారు బ్రిటిషు వర్తకులు. "ప్రతి బ్రిటిషువాడూ వర్తకుడే" అన్నమాట ఇందుకే పుట్టింది.

బ్రిటనుతో ఇతర పారిశ్రామిక దేశాలు పోటీచేసి వాటి మార్కెట్లను (వర్తక క్షేత్రాలను) అవి చూసుకున్నాయి. ఇలా చూసుకున్న పారిశ్రామిక దేశాలమధ్య సహజంగా ఘర్షణ ఏర్పడింది. అంతేగాక, పారిశ్రామిక దేశాలకు మార్కెట్లు అయిన దేశాలలో కొంత సంచలనం ఏర్పడింది వాటికి విదేశీ వర్తకం కొత్త కాకపోయినప్పటికీ, పారిశ్రామిక దేశాలతో వర్తకం అయేసరికి వాటి సామాజిక స్వరూప స్వభావాలలో కొన్ని మార్పులు జరిగాయి. విదేశీ వర్తకులకు దళారీలుగా పనిచేసే వర్గం ఒకటి అక్కడ సృష్టి అయింది. కొత్త వైరుధ్యాలు తలఎత్తాయి.

పారిశ్రామికంగా అభివృద్ధి అయిన దేశాలు వలసలలో తమ పరిపాలన స్థాపించటం అనివార్యమయింది. "వర్తకం వెంట జెండా వచ్చింది." పందొమ్మిదో శతాబ్ది అంతానికే ప్రపంచమంతటా తమ వలసలను ఏర్పరచుకున్నాయి. ఇక ఆక్రమించుకోవటానికి ఏమీలేదు.

కాని కథ అంతటితో ఆగిపోలేదు. ఆగిపోయినది ప్రపంచ విభజన మాత్రమే. అటు వివిధ సామ్రాజ్య దేశాలమధ్య ప్రపంచ పునర్విభజనకోసం ఘర్షణ సాగింది. ఆ ఘర్షణ ఫలితమే మొదటి ప్రపంచ యుద్ధం. ముందుగా పారిశ్రామికోన్నతి సాధించిన బ్రిటన్, ఫ్రాన్స్‌లను జర్మనీ ఎలా సవాలు చెయ్యగలిగింది? దీనివెనకఉన్నది పెట్టుబడిలో కలిగిన గొప్పమార్పు. పెట్టుబడి విధానంలో కలిగిన మార్పులు సామ్రాజ్యవాదం రావటంలో కీలకపాత్ర వహించాయి.

పారిశ్రామికయుగపు ఆరంభదశలో వుండినది పారిశ్రామిక పెట్టుబడి. భారీఎత్తున విదేశీవ్యాపారం సాగటానికి మర్కంటైల్ పెట్టుబడి వచ్చింది. అటుతరవాత ఫైనాన్స్ పెట్టుబడి వచ్చింది. ఈ పరిణామం గుత్త సంస్థలవల్ల సాధ్యమయింది. పెద్ద పెద్ద బాంకులు ఈ పరిణామంలో అత్యంత ప్రధానపాత్ర వహించాయి, పెట్టుబడికి అంతర్జాతీయ లక్షణాలను తెచ్చిపెట్టాయి. 1916 నాటికి జరిగిఉన్న, జరుగుతున్న ఈ పరిణామాలను లెనిన్ విపులీకరించుతూ, సామ్రాజ్యవాదంగురించి ప్రచారంలోఉండినతప్పుడు అభిప్రాయాలన్నిటినీ ఖండించి, పెట్టుబడిదారీ యొక్క అత్యున్నతదశే సామ్రాజ్యవాదమనీ, అటుతరవాత అది పతనం కావటమేననీ సూచించాడు.

1914 ప్రపంచయుద్ధంనుంచి "ప్రపంచవ్యాప్తమైన ఒక విప్లవ సంక్షోభం ఉత్పన్నమవుతోంది. దీని దశలు ఎంత దీర్ఘంగా, బాధాకరంగా ఉన్నప్పటికీ, అది పారిశ్రామికవర్గ విప్లవంతోతప్ప, దాని విజయంతోతప్ప, అంతమవదు" అని లెనిన్‌చెప్పాడు.

పెట్టుబడిదారీ సామ్రాజ్యవాదంగా మారటం ఎలా జరిగినదీ లెనిన్ సాకల్యంగా వివరించాడు. అందులో వేరువేరు దశలు.

1. ఉత్పత్తి కేంద్రీకరణద్వారా గుత్త పెట్టుబడి సంస్థలు ఏర్పడ్డాయి.

జర్మనీలో 1882–1907 మధ్యకాలంలో పెద్ద పరిశ్రమల సంఖ్య మూడింతలు పెరిగింది. మొత్తం కార్మికులలో మూడోవంతు వాటిలో పనిచేశారు. ఆ పరిశ్రమలు మొత్తం శక్తిలో ముప్పాతిక భాగం ఉపయోగించాయి. మొత్తం పరిశ్రమలలో అవి వెయ్యింట 9 మాత్రమే.

అమెరికాలో యీ కేంద్రీకరణ యింకా బాగా జరిగింది. అక్కడ 191_–1909 మధ్య 10 లక్షల డాలర్లను మించిన విలువగల సరుకులను ఉత్పత్తి చేసే పెద్ద సంస్థల సంఖ్య 1900 చిల్లరనుంచి 3000 చిల్లరకు పెరిగింది; వాటిలో పనిచేసే కార్మికుల శాతం సుమారు 25 నుంచి 30కి పెరిగింది; వాటిలో ఉత్పత్తి ఆయే సరుకుల విలువ 38 శాతం నుంచి దాదాపు 44 శాతందాకా పెరిగింది. 1909 నాటి యీ పెద్ద సంస్థలు మొత్తం సంస్థలలో నూరోవంతు; అవి తయారుచేసిన సంపద మొత్తం సంపదలో సగం.

"ఈ విధంగా పోటీ పద్ధతిగుత్తాధిపత్యంగా మార్పుచెందటం ఆధునిక పెట్టుబడి దారీ విధానంయొక్క అతిప్రధానమైన పరిణామాల్లో ఒకటి; ఇదే అతిప్రధానమైన పరి ణామం అనికూడా చెప్పవచ్చు."

ఈ సందర్భంలో లెనిన్ "ఉత్పత్తి సమ్మిళితం" గురించికూడా ప్రస్తావించాడు. సమ్మిళితమంటే ఒక పరిశ్రమకుచెందిన వివిధశాఖలూ, అనుబంధశాఖలూ ఒకేయాజ మాన్యం కిందికి రావటం. ఇందుకు హెచ్.జి. వెల్స్ ఒక మంచి ఉదాహరణ యిచ్చి వున్నాడు. ఫోర్డ్ మోటారు కంపెనీ పైవాళ్ళ జోక్యాలనుంచి విముక్తి కావటానికి మోటారుకార్ల తయారీకి కావలసిన ముడి సరుకుల వనరులు— ఇనుమూ, బొగ్గూ వగైరా గనులూ— కలపకోసం అడవులతోసహా సొంతం చేసుకున్నదట "ఆర్థిక మాంద్యం తీవ్రరూపం ధరించినప్పుడు మిశ్రమసంస్థలు (విడి సంస్థలతో)పోటీలో ఎక్కువ బలమైన స్థానం ఆక్రమిస్తాయి; ఎందుచేతనంటే, ముడిపదార్థాలధరలు తయారీ వస్తు వుల ధరలతో సమానంగా పడిపోవు"అన్నాడు లెనిన్.

ఇలా ఏర్పడిన భారీ పరిశ్రమలకు మద్దతు ఇచ్చేవి పెద్ద బాంకులు. ఈ బాంకుల పాత్రను లెనిన్ తరవాత వివరించాడు.

గుత్తసంస్థల అభివృద్ధిలో లెనిన్ మూడు చారిత్రక దశలు చెప్పాడు.

1860—70 మొదటిదశ. ఇది ప్రపంచ ఆర్థికమాంద్యంతో ప్రారంభమయింది. ఈ కాలంలో యూరపుకు సంబంధించినంతవరకు స్వేచ్ఛాయుతమైన పోటీ తారాస్థాయికి వచ్చింది. బ్రిటన్‌లో పాతకాలపు పెట్టుబడిదారీవ్యవస్థ పూర్తి అయింది. (1870-80) 1873లో భయంకరమైన అఘాతం కలిగింది. ఆ తరవాత ఏర్పడిన మాంద్యం నుంచి 1889-90 లో కొంత కోలుకోవటం జరిగింది. అప్పుడు కార్టెల్స్(గుత్తసంస్థలు) విరి విగా పుట్టాయికాని అవి నిలవలేదు. ఆ తరవాత 1890-1900 మధ్య కార్టెల్స్ పద్ధతి ఒక స్థిరత్వాన్ని సాధించింది.

"ఈ కార్టెల్స్ విక్రయపు షరతులూ, చెల్లింపుతేదీలూ మొదలైనవిషయాలపై ఒప్పందాలు కుదుర్చుకుంటాయి; మార్కెట్లను తమలోతాము విభజించుకుంటాయి; తాము ఉత్పత్తి చేయవలసిన సరుకుల మొత్తాన్నీ, ధరలనూ నిర్ణయించుకుంటాయి; లాభాలను పారిశ్రామిక సంస్థలమధ్య పంచుకుంటాయి. ఇలాగే అనేక విషయాలపై ఒప్పందం కుదుర్చుకుంటాయి."

అమెరికాలో 1900 లో స్థాపించిన స్టాండర్డ్ ఆయిల్ కంపెనీ దాదాపు 21 కోట్ల డాలర్ల పెట్టుబడితో ఏర్పడి, 9 ఏళ్ళ కాలంలో 36 కోట్ల 70 లక్షల డాలర్లు లాభాల రూపంలో పంచింది. (దీనితో పోటీచేసి చిన్నకంపెనీలు నూనెను తక్కువధరకుఅమ్మితే

ఆ నూనె అంతా తన ఏజెంట్లద్వారానే కొనిపించి, తన ధర పడిపోకుండా కాపాడు కున్నది. ఒక రైల్వే కంపెనీ తన నూనెరవాణాలకు ప్రత్యేకమైన రేట్లు ఇయ్యకపోతే ఆ రైల్వేలో సమ్మె తెప్పించి, తనకు ప్రత్యేకరేటు యిచ్చినదాకా సమ్మె సడలకుండా చేసింది. గుత్త ఉత్పత్తిసంస్థ ఎన్నిరకాల దుర్మార్గాలకు పూనగలదో దీని చరిత్రచూస్తే తెలుస్తుంది.)

విడి పారిశ్రామికుల్లాగాకాక గుత్త సంస్థలు ప్రపంచ ముడిసరుకులను సరిగా అంచనా వెయ్యగలవు. మార్కెట్లనూ ధరలనూ నిర్ణయించగలవు. పేటెంట్లు కొని వెయ్యగలవు. యంత్రాలను ఎప్పటికప్పుడు మెరుగుపరుచుకోగలవు. ఎలాటి పోటీ నైనా ఎదుర్కోగలవు. ఉత్పాదనశక్తిని అత్యున్నతస్థాయిలో ఉంచగలవు. సాంకేతిక పరిశోధనలు జరుపగలవు. అత్యంత ప్రవీణులైన ఇంజనీర్లనూ, రైల్వేలలాటి రవాణా సాధనాలనూ స్వాధీనంలో ఉంచుకోగలవు.

అవి చెయ్యగల వ్యతిరేకచర్యలుకూడా ఉన్నాయి: ముడిపదార్థాల సరఫరాకు అడ్డంతగలటం; కార్మికుల సరఫరాకు అంతరాయమైన ఒప్పందాలు చేసుకోవటం(ట్రేడ్ యూనియన్ సభ్యులు కార్టెల్కింద పనిచెయ్యాలన్న ఒప్పందం); సరుకులను వినియో గదార్లకు అందకుండా బిగించటం; తమకు లొంగిరాని ఉత్పత్తిదార్లను నాశనం చెయ్యా టానికి ధరలు పడగొట్టటం వగైరాలు.

1912 లో డా. ఫ్రిట్జ్ వెస్ట్నర్ అన్నాడు: "తెలివైన వ్యాపారస్థుడికివి రోజులు కావు. చట్టావ్యాపారంలో ఆరితేరినవాడు అతనిస్థానం ఆక్రమించాడు."ఎందుచేతనంటే వాడికి పారిశ్రామిక సంస్థలకూ బాంకులకూమధ్య సంబంధాలూ, వాటికిగల అవకాశాలూ బాగా తెలుసు. ద్రవ్యసంబంధమైన ఎత్తు, పైఎత్తులలో ఆరితేరినవాళ్లే లాభం పొంద గలుగుతున్నారు.

గుత్తసంస్థలు (కార్టెల్స్, ట్రస్టులు, సిండికేట్లు) బలపడటానికి కారణం ముడి పదార్థాలు లభించే ప్రాంతాలు స్వాధీనంలోకిరావటం.

ఈ గుత్తసంస్థల నిర్వహణలో బాంకులు కీలకపాత్ర నిర్వహిస్తాయి.

డబ్బుచేత పిల్లలుపెట్టించటం బాంకులపని. జడంగావుండే డబ్బు వాటిలో ప్రాణం పడుతుంది. బాంకులు ఆ డబ్బును పెట్టుబడిదారులకు అందించి, దానికి చైతన్యం కలి గిస్తాయి. పరిశ్రమలు పెరిగి గుత్తపరిశ్రమలు వెలిసినట్టే, బాంకులుకూడా బడాబాంకు లకు దారితీశాయి.

"అనేక చిన్నచిన్న దళారీసంస్థలు బహుకొద్ది గుత్తసంస్థలుగా రూపొందుతాయి. ఇలా మార్పుచెందేక్రమం, పెట్టుబడిదారీ విధానం సామ్రాజ్యవాదంగా అభివృద్ధిచెందే ప్రధాన పరిణామక్రమాల్లో ఒకటి."

బాంకింగు కేంద్రీకరణకు లెనిన్ ఇచ్చిన ఉదాహరణలు :

1907-8 కీ 1912-13కూ మధ్యగల అయిదేళ్ళలో జర్మనీలోని మొత్తం బాంకు డిపాజిట్లలో 47 శాతం నుంచి 49 శాతం 9 అతిపెద్ద బాంకులలోనూ, 32 న్నర శాతం నుంచి 36 శాతం 43 పెద్దబాంకులలోనూ పెరిగాయి; చిన్నబాంకులలో డిపాజిట్ల శాతం 20న్నరనుంచి 15కు తరిగింది. అనేక చిన్నబాంకులు పెద్దబాంకుల శాఖలుగా మారాయి. 1909 నాటికి ఈ తొమ్మిది అది పెద్ద బాంకుల పెట్టుబడి మొత్తం బాంకుల పెట్టుబడిలో 83 శాతం ఉన్నది :

ఆరు పెద్ద బెర్లిన్ బాంకులకు 1895లో 16 బ్రాంచీలుండేవి. 1911 కు అవి104; నాటి డిపాజిట్ బాంకులూ, ఎక్స్చేంజి ఆఫీసులూ 14 నుంచి 276కు పెరిగాయి. ఇలాటి పరిణామమే బ్రిటను, ఫ్రాన్సులలోకూడా జరిగింది.

"జర్మనీని నేడు పాలించే 300 మందీ క్రమంగా 50 కీ, 25 కీ మరింతగాకూడా తగ్గుతారు. కేంద్రీకరణకేసిసాగే ఈ అధునాతనధోరణి బాంకింగుకు మాత్రమే పరిమితమవుతుందనుకోలేం... చివరకు మన కళ్ళఎదట ట్రస్టులు తప్ప మరేదీ కనబడనిస్థితి రావచ్చు"అని Die Bank వ్యాఖ్యానించింది.

"పెట్టుబడుల కేంద్రీకరణనూ, గుత్తసంస్థల నిర్మాణాన్నీ బాంకులు చాలాతీవ్రతరం చేస్తాయి." కేంద్రీకరణఫలితంగా కొద్ది బాంకులు మొత్తం పెట్టుబడిదారీవ్యవస్థకు అగ్రభాగంగా ఉన్నాయి... పెద్ద పెద్ద పరిశ్రమలు కొద్దిపాటి బాంకింగు గ్రూపులమీద ఆధారపడే స్థితి నానాటికీ పెరుగుతోంది.

ఇంతేకాదు, భారీ పరిశ్రమలకూ, బడాబాంకులకూ మధ్య 'వియ్యం' బలపడింది. ఇటు బాంకులలోనూ, అటు గుత్తపరిశ్రమలలోనూకూడా ఘనమైనపాత్రలు నిర్వహించేవారు వచ్చారు.

జర్మనీలో 1910 నాటికే అతిపెద్ద పారిశ్రామికవేత్తలు 56 మంది 6 పెద్దబాంకులలో సూపర్వయిజరీ బోర్డుడైరెక్టర్లుట. 1895 నుంచి 1910దాకా ఈ ఆరు బాంకులూ షేర్లనూ, బాండ్లనూ కొన్న పారిశ్రామికసంస్థల సంఖ్య 281 నుంచి 418 కి పెరిగిందట. "ఈవిధంగా బాంకులు పారిశ్రామిక సంస్థలతోనూ, పారిశ్రామిక సంస్థలు బాంకులతోనూ సంలీనం"అయాయి.

బాంకులకు ప్రభుత్వముతోకూడా యిలాటి"వియ్యం"ఉన్నది "హోదాగలవ్యక్తులకూ, మాజీ సివిల్ సర్వెంట్లకూ సూపర్వయిజరీ బోర్డులలో ఉచితంగా స్థానాలీయబడ్డాయి. వీరు అధికార్లతో సంబంధాలను చక్కబరచుకోడానికి ఎంతగానో కృషిచేయగలవారు... సాధారణంగా ఒక పెద్ద బాంకు సూపర్వయిజరీబోర్డులో ఒక పార్లమెంటు

సభ్యుడైనా, ఒక బెర్లిన్ సిటీ కౌన్సిలర్ అయినా సభ్యుడుగా ఉంటాడు." (యుద్ధకాలంలో మనకు వైస్రాయిగావుండి ఇంగ్లండుకు తిరిగివెళుతూనే లార్డ్ లిన్లిత్‌గో ఇంపీరియల్ కెమికల్ ఇండస్ట్రీకి డైరెక్టరు కావడం మన కళ్ళఎదటనే జరిగింది.)

మరొకటి ఏమిటంటే, బాంకుల సంబంధాలు సర్వతోముఖంగా వ్యాప్తి చెందటంతో ఆ పరిణామాన్ని సూచించేవిధంగా, బాంకుడైరెక్టర్లు ఒక్కొక్కడూ ఒక్కొక్క ప్రత్యేక శాఖలో నిపుణుడై ఉంటాడు. "ఒక డైరెక్టరు జర్మన్ పరిశ్రమల్లో మాత్రమే నైపుణ్యం చూపుతాడు... మిగతావారు విదేశ ప్రభుత్వాలతోనూ, పరిశ్రమలతోనూ గల సంబంధాల్లో నైపుణ్యం సంపాదిస్తారు; మరికొందరు పారిశ్రామికవేత్తల, తదితరుల స్వభావాలను గురించి సమాచారం సేకరించడంలోనూ, స్టాక్ ఎక్స్‌చేంజి మొదలైనవాటి విషయంలోనూ ప్రావీణ్యం పొందుతారు. అంతేగాక, ఒక్కొక్క బాంకుడైరెక్టరుకు తరచు ఒక్కొక్క ప్రాంతం, లేదా ఒక్కొక్క పారిశ్రామిక శాఖ కేటాయించబడుతుంది."

బాంకుల పెట్టుబడీ, పారిశ్రామిక పెట్టుబడీ సంలీనం అవుతున్నాయంటే, అవి శాంతియుతంగానూ, సౌమ్యంగానూ జరుగుతున్నదనుకోనవసరంలేదు. "పారిశ్రామిక వ్యాపారవర్గాలు చాలా తరుచుగా బాంకుల 'జబర్దస్తీ'గురించి ఫిర్యాదులు చేస్తూఉంటారు. పెద్ద బాంకులు 'ఆజ్ఞాపిస్తూ'ఉంటాయి "

బెర్లిన్‌లోని చాలా పెద్దబాంకు 1909 నవంబరు 19 న ఒక పెద్ద సిమెంటు సిండికేట్ డైరెక్టర్ల బోర్డుకు ఘాటుగా ఉత్తరం రాసింది. డైరెక్టర్లు బాంకుకు సమ్మతంగాని నిర్ణయాలు చేయబోతున్నారట. అందుచేత "మేమిదివరలో మీ[?]య్యడానికి అంగీకరించిన రుణాన్ని ఉపసంహరించుకోవలసి వస్తుందని తెలియజేయుటకెంతో చింతిస్తున్నాం" అలాంటి బెదిరింపులు, సిండికేటు అల్పమైనదేమి కాదు. కాకపోతే బాంకు మరింత గొప్ప పహిల్వాన్ ! లెనిన్ చెప్పినట్టు "చిన్న పెద్ద పెట్టుబడులమధ్య జరుగుతూవచ్చిన పాతపోరాటం ఒక నూతన అభివృద్ధి దశలో, అత్యున్నతమైన దశలో, తిరిగి ప్రారంభమవుతోంది."

"పెట్టుబడిదారీ విధానం ఉచ్ఛదశకు చేరుకొంది. కొత్త పెట్టుబడిదారీ స్వేచ్ఛాయుత పోటీతో 'సమన్వయపరచడానికి' దృఢమైన సిద్ధాంతాల కొరకూ, నిర్దిష్టమైన లక్ష్యంకొరకూ అన్వేషించడం వృధా."

అవును, పాపం ! పెట్టుబడిదారీ చాలా కాలంగా ఆత్మసమర్థన కోసం 'వ్యక్తిస్వేచ్ఛ'లాటి గాలికబుర్లు చెప్పటం తప్ప ప్రజలకు పనికివచ్చే ఒక్క సిద్ధాంతాన్నిగాని, లక్ష్యాన్నిగాని బయటపెట్టలేని విషాదస్థితిలో ఉంటున్నది.

ఇరవయ్యో శతాబ్దం ఆరంభమవుతూనే ఉత్పత్తిలో మామూలు పెట్టుబడి ఆధిపత్యంపోయి ఫైనాన్స్ పెట్టుబడి అవతరించింది. దీన్నికూడా లెనిన్ విపులీకరించాడు.

ఒకప్పుడు పారిశ్రామికులు తమ పెట్టుబడితో పరిశ్రమలునడిపి, తామే యజమానులుగా ఉండేవారు. కాని పారిశ్రామిక పెట్టుబడి అధికంగా బాంకులనుంచి రావటం ప్రారంభమయాక, అధికారం బాంకులకు సంక్రమించింది. బాంకర్లు పారిశ్రామిక పెట్టుబడిదార్లయారు. పారిశ్రామిక పెట్టుబడిగా రూపొందిన బాంకు పెట్టుబడిని 'ఫైనాన్స్ పెట్టుబడి' అంటారు.

ఈ రకం పెట్టుబడిలో చాలా సౌకర్యాలున్నాయి. ఒక గుత్తసంస్థ యజమాని ఆ సంస్థను శాసిస్తాడు; అది దాని 'పిల్ల'సంస్థలనూ, వాటి పిల్లలనూ శాసిస్తుంది. "10 లక్షల(పెట్టుబడి)తో 160 లక్షలనూ, 320 లక్షలనూ, ఇంకా ఎక్కువ మొత్తాలనూ కంట్రోలు చెయ్యవచ్చు. ఒక కంపెనీ వ్యవహారాలను నడపడానికి దాని షేర్లలో 40 శాతం ఉంటేచాలు. చిన్నచిన్న, చెదురుమదురు షేర్‌హోల్డర్లు సర్వసభ్య సమావేశాలకు హాజరుకావడం ఆచరణలో సాధ్యంకాదు." ఇందుకే అమాయకులు చిన్న చిన్న షేర్ల వాళ్ళకుకూడా పరిశ్రమల్లో స్వామ్యంఉన్నదనీ, అందులో ప్రజాతంత్రంఉన్నదనీ భ్రమపడతారు. కాని "చిన్నస్థాయి ఉత్పత్తియొక్క పాత్రనూ, ప్రాధాన్యతనూ పటిష్ఠమొనర్చడం మొదలైనవన్నీ ధనస్వామ్యవర్గం యొక్క అధికారాన్ని పెంచేవే."

జర్మనీలో ప్రభుత్వం చిన్న మొత్తాలలో షేర్లను నిషేధించినసమయంలో బ్రిటన్‌లో ఒక పౌండు(20 జర్మన్‌మార్కుల)షేర్లు జారీచేయబడ్డాయి. "ఒక పౌండు షేరు బ్రిటిష్ సామ్రాజ్యవాదంయొక్క పునాది"అన్నారు (పెట్టుబడిదారీకి కాలం చెల్లిపోయిన కారణంగా మన యూనిట్లు భారతీయ సామ్రాజ్యవాదానికి పునాదికాలేక, భారతీయ సామ్యవాదపునాది కావటానికి వ్యర్థప్రయత్నం చేస్తున్నాయా ?)

ఈ పద్ధతిలో గుత్తాధిపతుల దుర్మార్గాలకు గొప్ప అవకాశంకూడా వున్నది. గుత్తసంస్థలకు చిన్నసంస్థలపై పెత్తనం ఉన్నదిగాని, బాధ్యతలేదు. యుద్ధకాలంలో ఒక సంస్థ యుద్ధసామాగ్రికి కావలసిన ముడిసరుకులను తయారుచేసే ఒక ఫాక్టరీని స్థాపించింది. కొద్దికాలంలోనే దానికి పెట్టుబడినిమించిన లాభాలువచ్చాయి. ఆ లాభాలతో అది ఒక 'పిల్ల'ఫాక్టరీని పెట్టింది. దానిమీద లాభాలు బాగావచ్చాయి అప్పుడా సంస్థ'పిల్ల'ఫాక్టరీషేర్లలో సగంవాటా పైవాళ్ళకు అమ్మింది. అటుపైన యుద్ధసంబంధమైన ఆర్డర్లు తల్లిసంస్థకు తరలించబడ్డాయి. (ఆర్డర్లు వచ్చేది యజమాని సంస్థకుగాని ఫాక్టరీలకుకాదు.) 'పిల్ల' సంస్థ ఎండగట్టుకుపోయింది. యజమాని సంస్థకు దమ్మిడీ

నష్టం కలగలేదు. పిల్లసంస్థలో షేర్లు కొన్నవారు చేతులు కాల్చుకున్నారు. అలాక్షీణించిన షేర్లను యజమానులు చవకగా కొనివెయ్యవచ్చుకూడా.

పట్టణాలశివార్లలో అభివృద్ధిలోకివచ్చే భూములనూ, రైలుమార్గాలుపడే ప్రాంతపు భూములనూ, కాలువలు రాబోయేప్రాంతపు భూములనూ ముందుగానే టోకున చౌకగా కొనేసి, అంతులేని లాభాలుగడించే అవకాశం సత్తా పెట్టుబడిదార్లకుంటుంది.

ఫైనాన్స్ పెట్టుబడి మరొకమెట్టు ముందుకుపోయి, పెట్టుబడిని ఎగుమతిచేయ సాగింది. ఈ పని 20 వ శతాబ్దంలో బాగా సాగింది. బ్రిటను 1862లో ఎగుమతిచేసిన పెట్టుబడి 36 కోట్ల ఫ్రాంకులకు సమానమైతే 1914 నాటికి ఇరవై, ముప్పైరెట్లు పెరిగింది. అలాగే ఫ్రాన్సు 1893–1914 మధ్యకాలంలో తన పెట్టుబడి ఎగుమతులను మూడింతలు చేసింది. ఆలస్యంగా పెట్టుబడిని ఎగుమతిచెయ్యటం ప్రారంభించిన జర్మనీ 1902–14 మధ్య విదేశీ పెట్టుబడులను 125 కోట్ల ఫ్రాంకులనుంచి 440 కోట్లకుపెంచింది.

ఎగుమతి అయేది"అదనపు"పెట్టుబడి అన్నమాట. దీనితో స్వదేశంలోనే వ్యవసాయం-వెనకబడి ఉండనేవున్నది– అభివృద్ధిచేసి, తిండికొరతలేకుండాచేసి, ప్రజల జీవితప్రమాణాలను ఎందుకు పెంచగూడదు? కాని పెట్టుబడిదారీ యిలాటిపనులుచేస్తే అది పెట్టుబడిదారీ విధానమే కాదంటాడు లెనిన్. అలాకాక, ఈ అదనపుపెట్టుబడిని బడుగు దేశాలకు ఎగుమతిచేస్తే, అక్కడ భూమివిలువా, కార్మిక వేతనాలూ కారుచౌకగనక, స్వదేశంలోకన్న చాలా రెట్లు లాభాలు వస్తాయి. లాభాలు తప్ప ప్రజాహితం పెట్టుబడిదారీలక్ష్యం ఎంతమాత్రం కాదు.

పెట్టుబడి ఎగుమతిచేసే దేశాలకు కొన్ని "సౌకర్యాలు" ఉంటాయి. అభివృద్ధిలోకి రాగోరే దేశాలు అప్పులకోసం చేతులు చాస్తాయి. సాధారణంగా అప్పులు నిరాకరించటం జరగదు. ఎందుచేతనంటే ఒక దేశం నిరాకరిస్తే మరొక దేశం ఇయ్యడానికి సిద్ధంగా ఉంటుంది. ఫైనాన్స్ పెట్టుబడిలో పోటీ! అయితే అప్పు మంజూరు చేసే ఒప్పందంలో ఇచ్చేదేశానికి లభించే క్లాజులుంటాయి; ఒక రైలుమార్గం నిర్మించాలనుకుందాం. దాని సంబంధమైన కంట్రాక్టులూ, సామాగ్రి ఎగుమతులూ, ఇతరలాభాలూ ఇచ్చే దేశానికి ఉండేటట్టు ఒప్పందం జరుగుతుంది. లేదా మారణాయుధాలు కొనాలన్న "క్లాజు"కూడా వుండవచ్చు. ఇలాటి రుణపత్రాల్లో "రహస్య"క్లాజులుంటాయి. ఈ ఒప్పందాలు నామమాత్రంగా ప్రభుత్వాలమధ్య జరిగినప్పటికీ, ప్రభుత్వాలవెనక పెద్ద గుత్తసంస్థలుంటాయి– లెనిన్ ఆ కాలానికి ఇచ్చిన ఉదాహరణలు : జర్మనీలో క్రుప్, ఫ్రాన్స్‌లో ష్నీడర్, బ్రిటన్‌లో ఆమ్‌స్ట్రాంగ్ వగైరా, ప్రభుత్వాలు వీటిని కాదనలేవు.

"ఫ్రాన్స్ రష్యాకు రుణాలిచ్చేటప్పుడు 1905 సెప్టెంబరు 16 నాటి వర్తకపు ఒడంబడిక ప్రకారం ఆదేశాన్ని 'పీల్చి పిప్పిచేసింది.' అలాగే జపానుకూడా 1911 లో రష్యాతో ఒక ఒడంబడిక చేసుకుని, రష్యాను దోచింది. సామ్రాజ్యవాదం అవలంబించే దేశాలనుంచి రుణాలకోసం గర్భాలు తెరుచుకునిఉన్న బడుగు దేశాలగతి ఎప్పుడూ ఇంతే.

"ఫైనాన్స్ పెట్టుబడి అక్షరాలా ప్రపంచదేశాలన్నిటిమీదా తన కబంధహస్తాల్ని చాచిందని చెప్పవచ్చు" ఈ పని సాధించటానికి వలసదేశాలలో స్థాపించిన బాంకులూ, వాటి శాఖలూ ఎంతగానో తోడ్పడ్డాయి. 1904 నాటి బ్రిటన్‌కు వలసదేశాల్లో 50 బాంకులుండేవి 1910 కి అవి 72 అయాయి; వాటి శాఖల సంఖ్య ఈ మధ్యకాలంలో 2279 నుంచి 5449కి పెరిగింది. ఫ్రాన్సుకు 20 బాంకులూ, 136 శాఖలు. హాలండుకు 16 బాంకులు, 68 శాఖలు. జర్మనీకి 17 బాంకులు, 70 శాఖలు'మాత్రమే'. సహజంగా "తమ స్థితిని చాలా 'జయప్రదంగా' చక్కబెట్టుకున్న 'పాత' వలసరాజ్యాల్ని జర్మన్ సామ్రాజ్యవాదులు ఈర్ష్యతో చూస్తున్నారు."

ఇంకోపక్క "అమెరికన్ పెట్టుబడిదార్లు ఇంగ్లీషు, జర్మన్ పెట్టుబడిదార్లంతే ఈర్ష్యపడుతున్నారు... అర్జంటీనా, బ్రెజిల్, ఉరుగ్వాయ్ దేశాల మొత్తం వ్యాపారంలో 46 శాతం వాటిచేతుల్లోవుంది." ఇవాళ పరిస్థితులు ఎలా మారిపోయాయో!

ప్రపంచవిభజన జరిగింది. "గుత్త పెట్టుబడిదారీ సంస్థలు...మొదట తమదేశాల మార్కెట్లను తమలో తాము విభజించుకుని, తమదేశాల్లోని పరిశ్రమలను ఇంచుమించు పూర్తిగా గుప్పెట్లో పెట్టుకున్నాయి.. దేశీయమార్కెట్టు అనివార్యంగా విదేశీమార్కెట్టుతో బంధింపబడి యుంటుంది. పెట్టుబడివిధానం ఏనాడో ప్రపంచమార్కెట్టును సృష్టించింది. పెట్టుబడి ఎగుమతి పెరిగేకొద్దీ, పెద్దపెద్ద గుత్తసంస్థల విదేశీ సంబంధాలూ, వలససంబంధాలూ, 'పలుకుబడి ప్రాంతాలూ' (spheres of influence) సర్వవిధాల విస్తరించేకొద్దీ, పరిస్థితులు 'సహజంగా' ఒక అంతర్జాతీయ ఒప్పందం దశలో, అంతర్జాతీయ కార్టెల్సుదిశలో మొగ్గుచూపాయి."

19వ శతాబ్దం అంతానికే అమెరికా, జర్మనీలలో విద్యుత్పరిశ్రమ పూర్తిగా కేంద్రీకృతమై, దానికి భారీఎత్తున బాంకుల తోడ్పాటు లభించింది. 1907లో అమెరికా, జర్మనీలట్రస్టులు ఒప్పందం కుదుర్చుకున్నాయి. అమెరికా కెనడాలు అమెరికన్‌ట్రస్టు (జనరల్ ఎలక్ట్రిక్ కంపెనీ) పరమయాయి; జర్మనీ, ఆస్ట్రియా, రష్యా, హాలెండు, డెన్మార్కు, స్విజర్లాండు, టర్కీ, బాల్కన్ దేశాలను జర్మనుట్రస్టు 'సంపాదించింది.' ఇలాటి ట్రస్టులు కలిసి పనిచేసినంతకాలమూ వాటిది ప్రపంచాధిపత్యమే. వాటితో ఏ సంస్థా పోటీచేయలేదు.

(అయితే ఇలాటి ట్రస్టులు ప్రపంచాన్ని విభజించుకున్నప్పటికీ, 'అసమాన అభివృద్ధీ, యుద్ధమూ' మొదలైన కారణాలవల్ల వాటిమధ్య ఐక్యత చెడవచ్చు అప్పుడేం జరుగుతుంది? ప్రపంచాన్ని పునర్విభజన చేయటం జరుగుతుంది!)

విద్యుచ్ఛక్తి విషయంలోలాగే నూనె (పెట్రోలియం), నౌకానిర్మాణం, ఉక్కు మొదలైన పరిశ్రమలలో కార్టెల్స్ ఏర్పడ్డాయి.

కార్టెల్స్ అంతర్జాతీయ పెట్టుబడిగలవికావటంచేత వాటి విజృంభణ అంతర్జాతీయ శాంతికి దారితీస్తుందనే దుర్భ్రమను ఖండిస్తూ లెనిన్, "ఈ అభిప్రాయం సిద్ధాంతరీత్యా అర్థరహితమైనది... గుత్త పెట్టుబడిసంస్థలు ఏమేరకు అభివృద్ధిచెందాయో, వివిధపెట్టుబడిదారీ సంస్థలమధ్య జరిగే పోరాటంయొక్క లక్ష్యమేమిటో అంతర్జాతీయ కార్టెల్స్ తెలియజేస్తాయి. వీటిలో రెండవ అంశం... జరుగుతున్న ఘటనల చారిత్రిక-ఆర్థిక అంతర్యాన్ని చెప్పగలదు. ఎందుచేతనంటే, మారుతున్న కారణాల కనుగుణంగా పోరాటరూపాలు ఎల్లప్పుడూ మారవచ్చు. ఆ పోరాటం సారాంశంమాత్రం వర్గాలున్నంతకాలం మారటానికి వీల్లేదు" అన్నాడు.

పెట్టుబడిదారిలో గుత్త పద్ధతీ, సామ్రాజ్యవాదమూలాటి దశలు అనివార్యంగా ఏర్పడ్డాయనటానికి లెనిన్ ఈ విధంగా చెప్పాడు

"పెట్టుబడిదార్లు ప్రపంచాన్ని పంచుకొంటున్నారంటే, ఏదో దురాలోచనతో వారీ పనిచేస్తున్నారనికాదు; కేంద్రీకరణ నేడు ఏ స్థాయికి చేరుకున్నదంటే,, లాభాలు సంపాదించటానికి వారీమార్గం చేపట్టకతప్పదు. వారు(ప్రపంచాన్ని)పెట్టుబడి నిష్పత్తినిబట్టీ, బలాబలాల నిష్పత్తినిబట్టీ పంచుకుంటున్నారు. వర్తకపు సరుకుల ఉత్పత్తి, అంటే పెట్టుబడిదారీవిధానం అమల్లో ఉండగా యిదితప్ప మరొక పంపకపు పద్ధతి అసంభవం. కాని బలాబలాలు ఆర్థిక రాజకీయ అభివృద్ధిస్థాయిని బట్టి మారుతాయి."

"పంపకుబడిప్రాంతాలకై జరిగే పోరాటం ఆధారంమీద రాజకీయకూటాలమధ్యా, రాజ్యాలమధ్యకూడా కొన్ని సంబంధాలు ఉత్పన్నమవుతాయి."

చూస్తున్నాం కామా!

1900 నాటికి యూరప్‌లోని అగ్రరాజ్యాలు ఆఫ్రికాలో 90.4 శాతం, పోలినేసియాలో 98.9 శాతం, ఆసియాలో 56.6 శాతం, ఆస్ట్రేలియా అంతానూ తమ అధీనంలోకి తెచ్చుకున్నాయి. ఇది ప్రపంచపు "అంతిమ విభజన". ఇందులో మార్పులు కలగాలంటే పునర్విభజనరావాలి. అంటే వలసలు ఒకరి యాజమాన్యంనుంచి మరొకరి యాజమాన్యంకిందికి రావాలి. లేదా— సామ్రాజ్యవాదం చావుదెబ్బతినాలి.

లెనిన్ ఈ గ్రంథం రచించిన అనంతరం రెండు ప్రపంచయుద్ధాలు జరిగాయి, ప్రపంచంలో చాలా దేశాలు విముక్తి చెందాయి, నయావలసవిధానం అమలులోనికి వచ్చింది; ప్రపంచ విప్లవం కొనసాగుతున్నది.

గుత్త పెట్టుబడిదారీ పురోగమనంలో అనివార్యంగా సామ్రాజ్యవాదం తప్పనిసరి అయేపరిస్థితి ఏర్పడకపూర్వం, 1840-60 మధ్య, బ్రిటిషు పెట్టుబడిదారీ రాజకీయ నాయకులు వలసవిధానాన్ని వ్యతిరేకించారు, వలసలు గుదిబండలని భావించారు. కాని 19వ శతాబ్ది అంతానికి ఆ సామ్రాజ్యవాదమే గొప్పదయింది, "నిజమైన, వివేకవంతమైన, మితవ్యయంతోకూడిన" విధానమయింది.

వలసలు ఏర్పడడంతోచాలదు. వాటిని 'జయించాలి'. "ఏ ప్రయోజనాలకై పెట్టుబడి ఎగుమతిచేయబడుతుందో, ఆ ప్రయోజనాలుకూడా వలసల్ని జయించడానికి ప్రోద్బలమిస్తాయి. ఎందుకంటే, వలసల మార్కెట్లో పోటీదార్లను లేకుండా చేయడానికీ, సప్లయిలు లభించేటట్టు చేయడానికీ, అవసరసంబంధాలు సమకూర్చుకోవడానికీ గుత్త పద్ధతులు అవలంబించడం(ఈవిధంగా)సులభం."

వలసవిధానానికి ఆర్థిక కారణాలేగాక సామాజిక కారణాలుకూడా ఉపకరిస్తాయి. "ప్రాచీన నాగరికత అభివృద్ధిచెందిన దేశాలన్నిటిలోనూ అసహనం, చికాకు, ద్వేషం పెచ్చుపెరుగుతున్నాయి... స్పష్టమైన వర్గమార్గాలలో బయటికి త్రోసివేయబడుతున్న శక్తిని(అంటే, వలసవిధానం అవలంబించే దేశాలలో తీవ్రమవుతున్నవర్గసంఘర్షణను) ఇతరదేశాల్లో వినియోగించుకోవాలి; ఇలాచేస్తేనే స్వదేశంలో పేలుడు సంభవించకుండా చేసుకోగలం" అన్నాడొక ఫ్రెంచి పెట్టుబడిదారు.

సామ్రాజ్యదేశాలూ, వలసదేశాలూ మాత్రమేగాక "అర్ధవలస దేశాలు" కూడా ఉంటాయి. ఉదాహరణకు, పూర్వం చీనా, ఈనాడు భారతదేశం. "ఇవి రాజకీయంగా లాంఛనప్రాయమైన స్వతంత్ర దేశాలు; కాని వాస్తవానికి ద్రవ్యసంబంధమైన, రాజనీతి పరమైన వలలో చిక్కుకొనివుంటాయి."

చూస్తూనే ఉన్నాంగద!

పెట్టుబడిదారీ విధానపు ఒక ప్రత్యేకదశ సామ్రాజ్యవాదం-పెట్టుబడిదారీవిధానపు గుత్తాధిపత్యదశ.

ఈ దశరావటానికి పెట్టుబడిదారీ మూలలక్షణాలు అనేకం తలకిందులు కావలసి వచ్చింది. స్వేచ్ఛతోకూడిన పోటీ పోయి గుత్తాధిపత్యం నెలకొన్నది; వర్తకపు సరుకుల ఎగుమతిస్థానంలో పెట్టుబడి ఎగుమతి వచ్చింది; బాంకులద్రవ్యమూ, పారిశ్రామిక

పెట్టుబడీ ఏకమయాయి; వెనుకబడిన ప్రాంతాలు పరాధీనమయాయి; ప్రపంచాన్ని సామ్రాజ్యవాద దేశాలు— అంటే గుత్త పెట్టుబడిలో అగ్రగామిదేశాలే- తమలో తాము పంచుకున్నాయి.

అయితే ఈ కథ ఇంతటితో ముగియలేదు. "అనేక అగ్రరాజ్యాలు ఆధిపత్యం కొరకు, అంటే భూభాగాలను సంపాదించడానికి, తమలోతాము పోటీపడతాయి. ఈభూభాగాలు తమ సొంతానికవసరం లేకపోవచ్చు, శత్రువును బలహీనపరచేటందుకు, వాని ఆధిపత్యాన్ని దెబ్బకొట్టేటందుకు అది అవసరం. (జర్మనీకి బెల్జియం చాలా అవసరం; ఎందుచేతనంటే, బ్రిటనుకు వ్యతిరేకంగా సైనికచర్యలు జరపడానికి అదొక స్థావరంగా ఉపయోగపడుతుంది. అలాగే బ్రిటనుకు బాగ్దాద్ ఎంతో అవసరం. ఎందుచేతనంటే, జర్మనీకి వ్యతిరేకంగా పోరాడేటందుకదొక స్థావరంగా ఉపయోగపడుతుంది.)"

ఇవాళ మనం సైనికస్థావరాల కోసం అమెరికాపడే ఆరాటం చూస్తున్నాం. ముఖ్యంగా చీనాను చుట్టుముట్టటానికి అమెరికా ఏర్పరచిన స్థావరాలు ఖర్చుతోకూడినవే తప్ప, ఆదాయం తెచ్చేవికావు. కాని గుత్త పెట్టుబడి రాజ్యాధికార విస్తరణకోసమూ, ఇతరరాజ్యాలను దాస్యంలో ఉంచటానికీ ఇలాటి ఖర్చులు భరించేస్థితిలో ఉన్నది. వియత్నాంలో ముఖంపగలగొట్టుకుని వెనక్కుతిరిగి రావటానికి ఎన్ని అర్బుదాలడాలర్లు ఖర్చు చెయ్యలేదు ?

సామ్రాజ్యవాదం బతుకు జలగ బతుకు. "పరభాగ్యోప జీవనం." గ్రేట్ బ్రిటన్ లెనిన్ ఈ గ్రంథం రచించేనాటికే, "క్రమంగా పారిశ్రామిక రాజ్యంనుంచి రుణాలిచ్చే రాజ్యంగా మారుతోంది. ఆ దేశంలో పారిశ్రామికోత్పత్తీ, తయారీవస్తువుల ఎగుమతీ యిదివరకు కంటె యిప్పుడు హెచ్చినప్పటికీ వడ్డీలు-లాభాలవల్లా, సెక్యూరిటీలు-కమిషన్లవల్లా— చట్టావ్యాపారంవల్లా లభించే ఆదాయం ఎక్కువ ప్రాధాన్యత కలిగియుంది. సామ్రాజ్యవాదం యొక్క ఆర్థికపునాది యిదేనని నా అభిప్రాయం"అన్నాడు షుల్ట్జ గెవర్నిట్జ్.

ఇలాటిది "స్టాక్ బ్రోకర్"రాజ్యమనీ, పతనమవుతున్న పెట్టుబడిదారీని పెంచి పోషించే రాజ్యమనీ లెనిన్ అన్నాడు ఇలాటి రాజ్యంలో రాజకీయ-సామాజిక పరిస్థితులు మార్పు చెందకమానవు.

పెట్టుబడిదారుల"పరభాగ్యోపజీవన" దృక్పథం కార్మికులకుకూడా విస్తరించింది. బ్రిటిషు కార్మికుడి వేతనంలో నాలుగోవంతు వలసలనుంచి వస్తున్నదని, రెండోప్రపంచ యుద్ధానంతరం రజనిపే ఒక అంచనా ఇచ్చాడు. రెండవ అంశమేమంటే. పరాధీన జాతులనుంచి సైనికదళాలు ఏర్పాటుచేసుకోవటం(బ్రిటిషు సేనలో గూర్ఖారెజిమెంట్లు ఒక

ఉదాహరణ) భారత దేశాన్ని జయించటానికి బ్రిటిషువాళ్లు భారతీయ సైన్యాలనే ఉపయోగించారు. ఆఫ్రికాలోకూడా ఇలాగే జరిగింది.

మార్క్సిస్టు అవటానికి ఎంతమాత్రమూ వీల్లేని హాబ్సన్ 1902 లో సామ్రాజ్యవాదం గురించిరాస్తూ ఇలా అన్నాడు :

"ఇప్పటికంటెకూడా విస్తృతమైన పశ్చిమరాజ్యాలకూటమి ఏర్పడే అవకాశం కూడా ఉందని మేము యిదివరకే కనుగొన్నాం. ఇది యూరపియన్ అగ్రరాజ్యాల సమాఖ్యగా ఉంటుంది. ప్రపంచనాగరికతను అది పెంపొందించదు సరికదా, పశ్చిమ రాజ్యాల పరభాగ్యోపజీవన మహా ప్రమాదాన్ని అది తెచ్చిపెట్టవచ్చు. అభివృద్ధి చెందిన పారిశ్రామిక జాతుల ముఠాకుచెందిన ఉన్నతవర్గాలు ఆసియా, ఆఫ్రికాలనుంచి కప్పం(లూటీ) విపరీతంగా వసూలుచేస్తాయి; ఆ ధనంతో వారు అసంఖ్యాకులైన తమ హంగుదార్లను పోషిస్తూ వుంటారు; ఈ హంగుదార్లు ప్రధాన వ్యవసాయోత్పత్తిలోగాని పారిశ్రామికోత్పత్తిలోగాని పాల్గొనకుండా వ్యక్తిగత సేవల్లోనో, నూతన ధనస్వామ్య వర్గం కంట్రోలులో ఉండే అప్రధానమైన పారిశ్రామిక సర్వీసుల్లోనో నిమగ్నులై యుంటారు."

(ఇదంతా ఈనాడు మరింత ప్రస్ఫుటంగా మనం చూస్తున్నాం. పశ్చిమరాజ్యాల కూటమిమాత్రమేగాక, కామన్ మార్కెటుపేరుతో ధనస్వాముల ట్రేడ్‌యూనియన్ కూడా ఏర్పడింది. దేశసంపద 84 శాతం 7 శాతం వ్యక్తుల అధీనంలోగల బ్రిటన్ లాటి దేశాలను "సర్వీస్ స్టేట్స్" అంటున్నారు. అసలైన ఉత్పత్తిదార్లు సంపాదించే దానికి అనేకవందలరెట్లు హాబ్సన్ చెప్పిన సేవలవాళ్లు సంపాదిస్తున్నారు. ధరలుపెరగక ఏంచేస్తాయి, ద్రవ్యోల్బణం రాకేమవుతుంది?)

"రచయిత (హాబ్సన్) చెప్పింది పూర్తిగా నిజం"అని ఆనాడు లెనిన్ అన్నట్టే ఈనాడు మనమూ అనాలి. దీనికి తార్కాణంగా 1865–98 మధ్య గ్రేట్‌బ్రిటన్ జాతీయాదాయం దాదాపు రెట్టింపుఅయితే, విదేశాలనుండి రాబడి తొమ్మిదిరెట్లు పెరిగింది. కార్మికుల్లో ఒక అగ్రశ్రేణి, ఒక నిమ్నశ్రేణి ఏర్పడింది. "కార్మికుల్లో అవకాశవాదాన్ని పటిష్ఠం"చేసి, కార్మికోద్యమాన్ని తాత్కాలికంగా కుంగదీసేధోరణిని సామ్రాజ్యవాదం చేపట్టింది. "ఇంగ్లండ్‌కి ప్రపంచమార్కెట్టుపైనా, వలసదేశాలపైనాగల గుత్తాధిపత్యపు విందులో కార్మికులుకూడా ఉల్లాసంగా పాల్గొంటున్నారు."

"సామ్రాజ్యవాదపు నిర్దిష్ట రాజకీయ లక్షణాలు, ప్రతిచోటా అభివృద్ధి నిరోధకత్వమూ, నానాటికీ పెచ్చుపెరిగే జాతులపీడనా... అందుచేత ఇరవయ్యోశతాబ్దారంభంలో

యించుమించు అన్ని సామ్రాజ్యవాద దేశాల్లోనూ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఒక పెటీబూర్జువా ప్రజాతంత్ర ప్రతిపక్షం బయల్దేరింది."

కాట్‌స్కీలాటివాళ్లు స్వేచ్ఛావ్యాపారం తిరిగివస్తేనూ, సామ్రాజ్యవాదంపోతేనూ ఎక్కువ అభివృద్ధి అయేదన్న అపోహను ప్రకటించారు. కాట్‌స్కీ వాదాన్ని లెనిన్ ఈ గ్రంథంలో చాలాగా విమర్శించాడు. స్వేచ్ఛావ్యాపారంనుంచే గుత్తవిధానం ఉత్పత్తి అయిందిగనక కాట్‌స్కీలాటివాళ్లు కాలచక్రాన్ని వెనక్కు తిప్పాలన్న ధోరణి వ్యక్తం చేశారు; గుత్తవ్యాపారంనుంచి సామ్రాజ్యవాదాన్నికూడా వేరుచేసి చూశారు.

సామ్రాజ్యవాదం పెట్టుబడిదారీ విధానపు పరివర్తనదశఅనీ, చరమదశఅనీ లెనిన్ నిరూపించాడు. లెనిన్ యీ గ్రంథాన్ని రచించి చాలాకాలమయింది. అటుతరవాత పెట్టుబడిదారీ విధానం సామ్రాజ్యవాదాన్ని మించిన వెర్రితలలే వేసింది. మొదటి ప్రపంచయుద్ధం అనంతరం రష్యాలో విప్లవం విజయవంతమై, ప్రపంచంలో ఆరో వంతు పెట్టుబడిదారీ విధానానికి స్వస్తి చెప్పటంతో సామ్రాజ్యవాద దేశాలు ఫాసిజముకు పాలుపోసిపెంచాయి. హిట్లరు తాముచెయ్యలేనిపని- సోషలిజమును నిర్మూలించటం- చేస్తాడని ఆశించాయి. కాని హిట్లరు సామ్రాజ్యవాదాన్ని మరింత ఉన్నతదశకు తీసుకుపోయి ప్రపంచాన్నే కబళించజూశాడు. దానితో పెట్టుబడిదారీదేశాలు విధిలేక, చాలా బద్ధకంగా, ఎంతో అయిష్టంగా హిట్లరుతో యుద్ధానికి దిగవలసివచ్చింది. ఆయుద్ధాన్ని ఫాసిస్టు వ్యతిరేక యుద్ధంచేసినది ప్రపంచ ప్రజలు. దానికోసం అందరికన్న హెచ్చు త్యాగం చేసినది రష్యా

రెండవ ప్రపంచపు యుద్ధం విప్లవ యుగానికీ, వలస వ్యతిరేక రాజకీయాలకూ చలనంలేని పునాది వేసింది. బ్రిటనువంటి సామ్రాజ్యవాద దేశం తన సామ్రాజ్యాన్ని కోల్పోయి దివాలాతీసింది. స్వేచ్ఛకోసం వెనుకబడిన దేశాల పోరాటం విజయం సాధించింది. పెట్టుబడిదారీ మరికొన్ని దేశాలలో శ్రామిక ప్రజా విప్లవాల ఫలితంగానూ మార్క్సిస్టు-లెనినిస్టు సిద్ధాంతాచరణ ద్వారానూ అంతం చేశాయి.

గత యుద్ధం తర్వాత జరిగిన పరిణామాలలో చెప్పుకోదగినవి: సామ్రాజ్యాలు చావుదెబ్బ తిన్నప్పటికీ, గుత్తవిధానమూ అది తెచ్చిపెట్టే వైరుధ్య, వైషమ్యాలూ ఆయా దేశాలలో తీవ్ర ఆర్థిక- సామాజిక సంక్షోభాలు కలిగించటం; అమెరికా సామ్రాజ్యవాదాన్ని గుత్తతీసుకోవటం. లెనిన్ ఆనాడు చెప్పిన పద్ధతులన్నిటినీ యుద్ధానంతర కాలంలో అమెరికా చేపట్టింది— ఋణాలివ్వటమూ, సైనిక దురాక్రమణలూ, సైనిక స్థావరాలు ప్రపంచమంతటా ఏర్పాటు చెయ్యటమూ, ఆర్థికంగా వెనుకబడిన దేశాలను లోబరచుకోవటమూ వగైరా. అమెరికా అదనంగా చేబట్టినదేమంటే, ప్రపంచంలో

వీలయినన్ని దేశాలలో ప్రజావ్యతిరేక, ఫాసిస్టు శక్తులను బలపరచటం. నిజానికి ఇది కూడా కొత్తదేమీకాదు. సామ్రాజ్యవాదులు తమ పెత్తనం చలాయించటానికి వలసల లోని వెనుకబాటుతనాలన్నిటినీ తమకు అనుకూలంగా బలపరచుకుంటూనే వచ్చారు: ఆ దేశాల పురోభివృద్ధిని అరికట్టుతూనే వచ్చారు.

దాని ఫలితంగా అమెరికా అంతరంగిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది. పెట్టుబడిదారీ పెత్తనం నిలవటానికి ఎలాటి దుర్మార్గాలు అవసరమయేదీ అమెరికాలో ఈనాడు జరిగే విచారణలు రుజువుచేస్తున్నాయి. మన దేశాన్ని శతాబ్దంపాటు హేయ, హీనస్థితిలో ఉంచిన ఫలితం పెట్టుబడిదారీనుంచీ, దాని పరిణామంనుంచీ కలిగిందని గ్రహించిన మనం పెట్టుబడిదారీని నమ్ముకున్నందుకు అంతులేని పాలకవర్గ అవినీతినీ, జనసంక్షోభాన్నీ, పెట్టుబడిదారీ విషవృక్షపు ఫలితాలనూ ప్రత్యక్షంగా అనుభవిస్తున్నాం. "వెనుకబడిన ప్రాంతాల"కు చెందిన వనరులు బిగిస్తే, "అగ్రరాజ్యాలు" పడే పాట్లు అరబ్బుదేశాలు నూనెను స్తంభించిచూపాయి. పెట్టుబడిదారీలో దేశాలు "పురోగాములు" ఎలా అయాయో, "శ్రేయోరాజ్యాలు" ఎలా అయాయో మనం ప్రత్యక్షంగా చూస్తున్నాం. "బ్రిటన్‌ను పాలించేది ప్రభుత్వమా, కార్మికులా ?" అన్నది తేల్చుకుంటానని ఎన్నికలు పెట్టి బ్రిటిష ప్రధాని హీత్ చెత్తకుప్పలోకెక్కాడు. "శ్రామికులు" పాలించే దేశాలలో ఇలాటి సమస్యలుండా నవసరంలేదు. ఉత్పత్తి ఏనాడో సమాజపరమూ, అంతర్జాతీయమూ అయింది. ఉత్పత్తి సాధనాలుమాత్రం వ్యక్తుల సొంతంగా మిగిలిపోయాయి. వీటిమధ్య వైషమ్యం ఇవాళ కట్టి కుదుపుతున్నది.

శాంతియుత పోటీద్వారా పెట్టుబడిదారీని సోషలిజం జయిస్తుందంటూ సోవియట్ పాలకవర్గం లెనినిజముకు స్వస్తిచెప్పింది. ఎందుకంటే, శాంతియుత పోటీద్వారా గుత్త పెట్టుబడీ, అది తెచ్చిపెట్టే వైరుధ్యాలూ ఎలా అంతర్ధానమవుతాయో లెనిన్ ఎక్కడా చెప్పిఉండలేదు. చివరకు సోవియట్ యూనియన్ సామ్రాజ్యవాదం లక్షణాలు-దళారీ వ్యాపారమూ, "పలుకుబడి ప్రాంతాల" కోసం పాకులాటలూ, ఋణాలిచ్చి వెనుకబడిన ప్రాంతాలను లోబరచుకోవటమూ, ప్రాంతీయ స్పర్థలలో తలదూర్చటమూ-సంపాదించుకుని, అమెరికాతో సామ్రాజ్యవాదంలో పోటీకి దిగింది.

పెట్టుబడిదారీ విధానం నిర్మూలన కావటానికి శ్రామికవర్గ విప్లవమూ, శ్రామిక వర్గ నియంతృత్వంద్వారా పెట్టుబడిదారీరహిత సమాజ నిర్మాణమూ తప్ప మరోమార్గం లేదు. ఇది ఆచరణలో కూడా రుజువవుతున్నది.

ఈ సమీక్ష ముగించేముందు ఒక్క విషయం చెప్పాలి. ఇక్కడ సమీక్షిస్తున్న పుస్తకంలాటివి తెలుగులోకి అనువదించటం చాలా కష్టం. అందుకు తగినభాషకూడా

లేదు. మనం ఉపయోగించేభాష ప్రజలలోకి పోయినదికాదు. అందుచేత ఇంగ్లీషులో చదవగల వారికే ఈ అనువాదాలు అర్థమవుతాయి. ఒక్కొక్కప్పుడు ఇంగ్లీషులోనే బాగా అర్థమవుతాయనిపిస్తుంది. అందుచేత యిది చాలాకాలంగా పార్టీకి పనికివచ్చే సాహిత్యంగా ఉంటున్నది. అందుచేత నాకేమనిపిస్తుందంటే మార్క్సిస్టు సాహిత్యాన్ని సంగ్రిహపరిచి, సుగమంగా ప్రజలకు అందించటం చాలా అవసరం.

కొడవటిగంటి కుటుంబరావు

---

74 మే 21 న చీరాల తాలూకా మృత వీరుల
స్మారక సభ పర్చూరులో జరుగనున్నది.

ఆ సందర్భంగా

విప్లవ వీరుడు, అమరజీవి
డాక్టర్ చాగంటి భాస్కరరావు, ఎం. ఎస్.
స్మారకంగా

పెద్దఎత్తున నాటిక పోటీలు, చెడుగుడు పోటీలు, ఎడ్ల పందెములు ది. 17-5-74 నుండి 21-5-74 వరకు జరుగనున్నవి. మిక్కిలి వ్యయప్రయాసలతో కూడుకొన్న యీ కార్యక్రమములు జయప్రద మగుటకు మీ ఆర్థిక, శారీరక, హార్దిక సహకారాన్ని కోరుతున్నం. పాల్గొన దలచినవారు, వివరాలు తెలుసుకోదలచినవారు కింది అడ్రసుకు రాయవలసిందిగా కోరుతున్నం.

విప్లవాభివందనాలతో—

భాస్కర్ సేవా సమితి
పర్చూరు
చీరాల తాలూకా. ప్రకాశం జిల్లా.

"నక్సల్‌బరి సాయుధపోరాటమే ప్రగతిశీల సంఘాల ధ్యేయం"

నడిగూడెం బ్యాంక్ దోపిడి అయిన తరువాత కోదాడ్ ప్రాంతంలో సి.ఐ.డి. లు చెప్పతరంకాకుండ వెలిసిరి. ఈ విషయం వారి పత్రికలలోగూడ ప్రకటించుకొన్నారు. నక్సలైట్లఫోటోలు, పెత్తందార్ల వద్ద, వారి అనుచరవర్గంవద్ద వున్నవిషయం ప్రజలకు తెలిసినదే. ఈ దాడి జరిగిన తరువాత కోదాడ్‌లోగూడ వారిఫోటోలు నిండిపోయినవి భూస్వామ్యవర్గంలో భూకంపం పుట్టించింది ఈ దాడి. నిద్రపోయే పరిస్థితిగూడ కోల్పోయారు. అక్కడవున్న కార్మికవర్గంతో, లంబాడీలతో పొట్టకుగడవని ప్రజలతో నక్సలైట్లు వచ్చేటట్టున్నారు మీ గుడిసెలకు నిప్పుపెట్టుతారు. మిమ్ములను, మమ్ములను తేడాలేకుండానే చంపుతారు. వూరికి సెంట్రీ సి ఐ.డి.లు పెట్టాము మీరుగూడ సెంట్రీలకు సహాయంగా వుండాలి అని అనేక రకాలుగా బోధించడం, వారేమో మావద్దఏమున్నది; మట్టిచిప్పలుతప్ప, మమ్మలనేమి ముట్టుకోరు, మీ వద్దనే డబ్బులున్నాయికాబట్టి మీకే ముప్పు: మాకేమి భయంలేదనడం ఇలా జరుగుతుంది. ఇదంతా మాకుతెలుస్తూనే వున్నది. మరుసటిరోజు వీటన్నిటిని ఎలుగెత్తిచాటాలనుకొన్నాం గోడలమీద విద్యుత్తు దీపాలు వెలిగించాలనుకొన్నాం. గోడలమీద యిలా కొన్ని వ్రాశాము.

వర్గశత్రువుని నిర్మూలించండి, నక్సల్‌బరి పోరాటమే ఏకైకమార్గం; నోటిలోని నాలుకలా, ప్రజలలో నక్సలైట్లు, భూస్వామ్యంగుండెల్లో భూకంపం పుట్టించిన నక్సల్‌బరి జిందాబాద్; ప్రజలు భూమిలాంటివారు నక్సలైట్లు విత్తనంలాంటివారు; అమ్మలారా! అయ్యలారా! అందుకోండి ఆయుధాలు; నక్సల్‌బరినిర్మాత చారుబాబుకి జోహార్లు; ప్రతి స్త్రీ గెరిల్లా కావాలె, పోలీసులూ మీరు పేదలే; డాక్టర్లు పల్లెజలవద్దకు వెళ్ళి వైద్యంచేయండి; బూర్జువా విద్యావిధానం నశించాలి. మీ పోరాటాన్ని కొనసాగించండి మీకు రైఫిళ్ళకొరతంటూ ఉండదు- మావో చదవండి, సృజన, విమోచన, పిలుపు, ప్రజాసమస్యలు, ఉదయం, వెలుగు, జీవనాడి మొదలగునవి వ్రాశాము.

వ్రాసేటప్పుడు ఒక కానిస్టేబుల్ వచ్చి ఏమిటోబాబు పొట్టకూటికోసం పోలీసునైనాను అనుకుంటు చీకట్లో కలిశాడు. వెనుక ఒక పోలీసుగుంపు రావటాన్నిచూసి మేం చీకట్లోకలిశాము. అక్కడక్కడ గొందుల్లో రాసేవరకు పోలీసుస్టేషన్‌కి అందింది. కోదాడకి మైలున్నరలోవున్నది కాలేజి.(లంబాడితండవద్ద) ఇక అక్కడికి లెఫ్ట్‌రైట్ కొట్టాము. అక్కడ 10 నిముషాల్లో పూర్తి అవుతాదిఅనగానే అక్కడి భూస్వామియగు ప్రెసిడెంట్ యింక యిద్దరు వచ్చి చదువుతుండగానే మేము కనిపించకుండ వారిని చూస్తున్నాం. కొద్దికాలంలోనే 50 60 మంది గుంపు తయారయింది. మాలో ఇద్దరం జాగ్రత్తగా వారివద్దకువెళ్లాం. ఏమిటి గుంపుగూడారు అనగానే యింకేముంది భూస్వా

ములకు ముప్పువచ్చింది. నక్సలైట్లువచ్చి గోడలమీదవ్రాశారు. భూస్వాముల మెడలను గడపలకు వేలాడదీస్తారట. కూలిరేట్లు పెంచకపోతే కూలీలను పనిమానివేయమన్నారు. మా కూలీలను మామీద ఉసికొల్పుతున్నారు. వాళ్ళను ఎలానైన పట్టుకోవాలి అని పోలీసులు, వారు కుమ్మక్కై కాలేజిగ్రౌండ్ మొత్తం తిరిగారు. నిజంగా ఆ రోజు మేం దొరికినట్లయితే మమ్మలను హింసతోకూడిన పనిచేయుదురు. గోడలమీదవ్రాతలకే భయపడితే నిజంగా విప్లవంవస్తే యిలా భూమిమీద యింకా నిలబడతారా! ఇలా భూస్వామ్యవర్గం వణికిపోతున్నాగానీ విప్లవ పరిస్థితులులేవా? వీరికి ఆరోజునుంచి సరిగా నిద్రలుగూడలేవు. నిజంగా మావో అన్నట్లు వీరు కాగితపు పులులేవున్నట్లున్నదిగదా! మా ఈ చిన్న అనుభవంలో చూసిన విప్లవ పరిస్థితి ఎంతబాగున్నదో అర్థమవుతుంది. ఈనాడు జరుగుతున్న నక్సల్‌బరి శ్రీకాకుళ సాయుధపోరాటాలే ఏకైకమార్గం. అదే మా ప్రగతిశీల సంఘాల ధ్యేయం. (ఇది పూర్తిగా వాస్తవం)

ఇంకొక చిన్న విషయం.

మేం ప్రిన్సిపాల్‌దగ్గరకువెళ్ళి కాలేజికి సృజన తెప్పియ్యండి విద్యార్థులలో విజ్ఞానాన్ని పెంపొందించాలంటె సృజన తప్పకుండ చదవవలసిన సాహిత్య పత్రిక. అంటే 60, 70 విద్యార్థులు, విద్యార్థినిల సంతకాలు పెట్టించుకొని రమ్మంటే మేం 100 పైన పెట్టించి దరఖాస్తు యిచ్చాము. ప్రిన్సిపాల్ తెప్పించేటట్టువుండేసరికి లెక్చరర్స్‌లో కొంతమంది అది నక్సలైట్ల పత్రిక. దాన్ని తెప్పించవద్దని, కొంతమంది పుల్లలువేసి యిది తెప్పివ్వగూడదనటం మేం రోజు ప్రిన్సిపాల్‌ని అడగటం చివరికి సృజనకి, జీవనాడికి చందాకట్టారు. మూడు నెలలునుంచి వస్తూనేవుంది. చదువుకొనేగదిలో బల్లమీద (reading room) సృజనలను ఎత్తుకపోవటం మేం తగిన జాగ్రత్తలు తీసుకోవడం జరిగింది. ఎప్పుడు వాటిని ఎవరో ఒకరు చదువుతూనే వుంటారు. వాటికి కొంతైన టేబుల్‌మీదపడుకొనే పనేలేదు. సృజన రాజకీయాలు విద్యార్థులలో బాగా పాతుకొనిపోతున్నాయి. రీడింగ్ రూంలో, క్లాస్‌రూంలో చదవండి సృజన. జీవనాడి మార్మోగిపోతున్నాయి. లెక్చరర్స్‌లో కొంతమంది బందుచేయండి అని ప్రిన్సిపాల్‌కి చెప్పడం. దానిమీద దాడి జరుగుతూనేవుంది సృజనను తెప్పివ్వకుండ వుంటె మా ఉద్యమం వేరొకరకంగా విజృంభించేది. విద్యార్థులలో సమ్మెకు దారితీసేది. మేం వారితో సవాల్‌చేసి చెప్పుతున్నాం సృజనను వారు బహిష్కరిస్తే! వారిని..."సృజనను ప్రతి పాఠశాలకు, కళాశాలలకు తెప్పించండి."

విప్లవాభినందనలతో—

ప్రగతిశీల సంఘం,
కోదాడ్.

తెలుగు రాజకీయ పక్షపత్రిక 'ప్రభంజనం' సంపాదకులు, వి.ర.సం. సభ్యులు అయిన డాక్టరు యం.వి. రమణారెడ్డిగారి అరెస్టు.

వ్యక్తిగత కక్షలము లంగా స్థానిక నూనెమిల్లు యజమానిని ఎవరో వ్యక్తులు కొట్టిన సందర్భంలో కాటన్‌మిల్ వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షులు, ఇంటర్‌నేషనల్ పాకేజింగ్ కంపెని వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు, ప్రముఖ ట్రేడ్‌యూనియన్ నాయకులు అయిన డా॥ యం. వి. రమణారెడ్డిగారిపై అనవసరంగా కేసు బనాయించి 31-3-74 తేదిన వారి ఆస్పత్రిలో వుండగా పోలీసులు అరెస్టుచేశారు.

పై విధంగా వారిని వ్యక్తిగత కక్షలలోనికి లాగి అబద్ధపు కేసును బనాయించి, అన్యాయంగా అరెస్టుచేయడాన్ని కడప జిల్లా వి.ర.సం శాఖ తీవ్రంగా ఖండిస్తూంది.

1-4-74 తేదిన డాక్టరు యం.వి. రమణారెడ్డిగారిపై అబద్ధపునేరాన్ని మోపినందుకు ఆంధ్ర కాటన్‌మిల్స్ వర్కర్స్ యూనియన్, ప్రొద్దుటూరు, ఇంటర్‌నేషనల్ ప్యాకేజింగ్ కంపెని వర్కర్స్ యూనియన్, ప్రొద్దుటూరు. జ్యోతి కెమికల్స్ వర్కర్స్ యూనియన్ కడప, రైతు కూలీ సంఘం, యేరువపాలెం, జొన్నవరం, వెలవలి, సమ్మెటూరు వారు తమ నిరసనను తెలుపుతూ ఊరేగింపుగావెళ్ళి స్థానిక డిప్యూటి సూపరింటెంటుగారికి అబద్ధపు కేసును విచారణ జరిపించి త్వరగా ఎత్తివేయవలసిందిగా డిమాండ్ చేశారు.

కన్వీనర్,
కడపజిల్లా వి.ర.సం శాఖ

డా॥ యం.వి. రమణారెడ్డిని తక్షణం విడుదలచెయ్యాలి

విప్లవ రచయితల సంఘం సభ్యుడు, ప్రభంజనం 'సంపాదకుడు' డా॥ యం.వి. రమణారెడ్డిని మార్చి 30 తేదిన పొద్దుటూరులో అరెస్టు చేశారు. 'లాకౌట్'కు వ్యతిరేకంగా పోరాడుతున్న కార్మికుల్ని అరెస్టుచేయటం దారుణమైన అన్యాయం. రమణారెడ్డిని సహచర కార్మికుల్ని తక్షణం విడుదలచేయవలసిందిగా డిమాండ్‌చేస్తున్నాం.

త్రిపురనేని మధుసూదనరావు
కార్యదర్శి
విప్లవ రచయితల సంఘం, ఆంధ్రప్రదేశ్.

డాక్టర్ ఎం.వి. రమణారెడ్డిగారి అరెస్టును ఖండిస్తూ, 'భావస్వాతంత్ర్యాన్ని బందీ చేస్తున్న', 'విప్లవ ఆలోచనల వెల్లువకు ఆనకట్టలు కడుతున్న' ప్రభుత్వ ఫాసిస్టు చర్యల్ని ప్రతిఘటించండి అని ప్రజలకు పిలుపునిస్తూ క్రాంతిదళం(జముకులకథదళం) పిండి, పట్టణ కళాసీ సంఘం బొబ్బిలి నుంచి ప్రకటనలు మా కార్యాలయానికందినవి. డాక్టర్ ఎం.వి. రమణారెడ్డి అరెస్టును ఖండిస్తూ, విడుదలను డిమాండ్ చేస్తూ విరసం, వరంగల్, హైదరాబాద్ యూనిట్లు, రాష్ట్ర పౌరహక్కుల సంఘం కార్యదర్శికూడ పత్రికా ప్రకటనలు చేసారు.

నడిగూడెం బ్యాంకుపై దాడి :

ప్రపంచ చరిత్రలో విప్లవకారులు బ్యాంకులమీద దాడిచెయ్యడం కొత్తేమీకాదు. నల్లగొండ జిల్లా నడిగూడెంలో మార్క్సిస్టు-లెనినిస్టు విప్లవకారులు చేసింప దాడేగాని దోపిడీకాదు. దోపిడీచేసేది పాలకవర్గాలు కాబట్టి దోపిడీవర్గాల బాకాఅయిన ఆలిండియా రేడియో ఆ సంఘటనమీద 'నడిగూడెం బ్యాంకుదోపిడీ' అనే రూపకం ప్రచారం చేసింది. ప్రత్యక్షసాక్షికథనంగా దాన్ని రూపొందించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వెంగళరావు ఆ రూపకంలో ఒక పాత్రను పోషించారు. ప్రజావ్యతిరేక కళాసాహిత్యాల్ని ప్రజలు తిప్పికొడతారు. దోపిడీ పాలకవర్గాల కుట్రను ప్రజలు సాయుధంగా భగ్నం చేసి తీరుతారు. ప్రజావ్యతిరేక కళాసాహిత్యాలను కావ్యగానాలను బుగ్గిపాలుజేసి నిజమైన శ్రామికవర్గ సాహిత్యాన్ని కాపాడుకుంటారు. రేడియో కుట్రను, వెంగళరావు అభినయాన్ని పాలకవర్గాల అబద్దాన్నీ విరసం తీవ్రంగా ఖండిస్తూ విప్లవకారుల్ని అభినందిస్తున్నది.

ఖమ్మంజిల్లాలో పెచ్చుపెరిగిపోతున్న పోలీసు దురాగతాలు :

ఖమ్మం జిల్లాలో పోలీసు కిరాతక చర్యలు హద్దుమీరి పోతున్నవి. కనిపించిన వాణ్ణల్లా పోలీసు స్టేషనుకు తీసుకుపోయి రోజులతరబడి చిత్రహింసలు పెడుతున్నారు. వి.ర.సం. కార్యవర్గ సభ్యుడు జీవన్‌ను అరెస్టుచేసి ఇంట్లో పుస్తకాలు ఎత్తుకుపోయారు. జీవన్‌ని వదిలినా ఇంకా పుస్తకాలను ఇవ్వలేదు. వి.ర.సం. అభిమానులమీద నానారకాల దమనకాండను ప్రదర్శిస్తున్నారు. ఒక విద్యార్థిని 20 రోజులు స్టేషన్‌లోవుంచి చిత్రహింసలు పెట్టారు. విప్లవ రచయితలను విద్యార్థుల కోర్కెలపై కాలేజీలకు వుపన్యాసాలకు ఆహ్వానించారని ప్రిన్సిపాల్స్‌నూ, లెక్చరర్లనూ బదిలీచేస్తున్నారు. ఈ రకం పోలీసు ఫాసిస్టు చర్యలను విరసం కార్యవర్గం తీవ్రంగా ఖండిస్తున్నది.

ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులతో కరచాలనం :

ఉస్మానియా యూనివర్సిటీ అధికారులు, పోలీసులు, జాతీయ ఉన్మాదవిద్యార్థులు కలిసి కుట్రతో ప్రగతిశీల విద్యార్థుల్ని అరెస్టుచేయడం, విద్యాలయాలనుండి బహిష్కరించటం మొదలగు ప్రజావ్యతిరేక కుట్రలను వి.ర.సం. నిరసిస్తున్నది. యూనివర్సిటీ పాలకులపై విద్యార్థులు చేస్తున్న పోరాటంలో చేయికలపవలసిందిగా యితరప్రాంత విద్యార్థులను, రచయితలను, వుద్యోగులను, ప్రజలను వి.ర.సం. కోరుతున్నది.

రబీసేన్ అరెస్టు-నిరసన :

బెంగాలీ రచయిత రబీసేన్‌ను ఈ సంవత్సరం జనవరి 3వ తారీఖున పశ్చిమ బెంగాల్ ప్రభుత్వము నిర్బంధంలోకి తీసుకొని, తన నయాఫాసిస్టు విధానాన్ని మరోమారు నిరూపించుకొంది. రబీసేన్‌ను అరెస్టుచేసి జైల్లో పెట్టినంతమాత్రాన ప్రజల్లో తీవ్రతరమౌతున్న అసంతృప్తిగానీ మేధావుల్లోని సంచలనంగానీ ఆగిపోతుందనుకోవడం ఘోరమైన దుర్భ్రమ. ఇందిరాగాంధీ మోచేతినీళ్లు తాగుతూ పశ్చిమబెంగాల్‌లోని విప్లవాగ్నులను రక్తంలో కన్నీళ్ళలో ముంచుతూన్న సిద్ధార్థ శంకర్‌రే ప్రభుత్వం మేధావులమీద తీసుకొంటూన్న యీ పోలీసు చర్యలను విప్లవ రచయితల సంఘ కార్యవర్గం 9-3-'74 నాటి సమావేశంలో తీవ్రంగా గర్హిస్తూంది.

శ్రామికవర్గ సాహిత్యంకోసం

రాయండి — రండి

1.	జనచైనా కమ్యూనిస్టుపార్టీ 10 వ మహాసభ నియమావళి		0-25
2.	మన అధ్యయన విధానం ఎలావుండాలి	చైర్మన్ మావో	0-05
3.	ఉదారవాదాన్ని ప్రతిఘటించండి	,,	0-10
4.	సరియైన భావాలు ఎక్కడ్నించి వస్తాయి	,,	0-05
5.	పార్టీలో కార్యవిధానాన్ని సరిచేసుకోవాల్సిన అవసరం	,,	0-30
6.	భారత దేశంలో సోవియట్ రివిజనిజం కొనసాగిస్తున్న సోషల్ సామ్రాజ్యవాద ఆర్థిక దోపిడి	పీపుల్స్ డెయిలీ వ్యాసం	0-05
7.	భారత ప్రజావిముక్తి సైన్యం అవతరణను కీర్తించండి		0-15

పై వాటికి కమీషన్ ఇవ్వబడదు. పోస్టేజ్ ఖర్చులు కూడ
తెప్పించుకునేవారే భరించాలి.

8.	చారుమజుందార్ రచనలు	రూ. 3-00
9.	భారత రైతాంగ సాయుధవిప్లవం జనచైనా వ్యాసాలు	రూ. 1-00

ఏ పుస్తకం కావాలన్నా అడ్వాన్స్‌గా డబ్బు పంపించాలి.

కొత్తగా తెరచిన మా బుక్‌షాప్‌లో మా ప్రచురణలు మాత్రమేకాక మార్క్స్, ఎంగెల్స్, లెనిన్, మావోల రచనలు మార్క్సిస్ట్-లెనినిస్ట్ మౌలిక అధ్యయన గ్రంథాలు(తెలుగులో, ఇంగ్లీషులో) పిలుపు, ఉదయం, సృజన, ఎర్రగడ్డ, విమోచన మున్నగు పత్రికలుకూడ అమ్మబడును. రండి, ఆర్డర్లు పంపించండి.

శ్రామికవర్గ ప్రచురణలు

9-2-197, గిర్మాజీపేట, వరంగల్-506002

SRJANA Telugu Monthly April '74 H/WL-10
Regd. No. with Registrar of News Papers 10953/67

SRJANA
Hanamkonda
Warangal 506001

1 Re.